ఈనాడు

విజయవాడ 14-1-2019 సోమవారం సిటీ సంపుటి 45 . సంచిక 155

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి
సోనోవిజన్ సంక్రాంతి సేల్
LG 65" 4K Smart OLED
EMI : 16,666/-
SAMSUNG 65" UHD
FREE
49 4K Smart
EMI : 14,778/-
SONY 55" 4K LED
EMI : 7,117/-
Panasonic 43" Smart LED
EMI : 2,834/-
LG 55" OLED
EMI : 10,834/-
SAMSUNG 49" UHD
FREE
24 LED
EMI : 6,834/-
Haier 39" Smart LED
EMI : 1,834/-
TCL 32" Smart LED
EMI : 1,250/-
X-Boom
EMI : 1950/-
Home Theatre Speakers
Rs : 4,200/-
LG Side by Side 675 Ltrs Refrigerator
FREE
Mini Fridge
EMI : 5,891/-
SAMSUNG Side by Side 674 Ltrs Refrigerator
FREE
32" LED TV
EMI : 7,283/-
LG CBU Refrigerator 335 Ltrs
EMI : 2,783/-
Godrej Frost Free Refrigerator 290 Ltrs
EMI : 2,033/-
SAMSUNG Frost Free 253 Ltrs Refrigerator
EMI : 1,950/-
LG Frost Free 260 Ltrs Refrigerator
EMI : 1,916/-
Whirlpool Direct Cool 200 Ltrs Refrigerator
EMI : 1,200/-
Haier Direct Cool 190 Ltrs Refrigerator
EMI : 1,050/-
Chest Freezer 200 Lts
EMI : 1,458/-
LG 1.5 Ton Inverter Air Conditioner 100% Copper Condensar
10 Years Compressor Warranty
EMI : 3,750/-
SAMSUNG 1.5 Ton Inverter Air Conditioner
10 Years Compressor Warranty
EMI : 3,250/-
DAIKIN 1.5 Ton Inverter Air Conditioner 100% Copper Condensar, R-32 Gas
5 Years Compressor Warranty
EMI : 3,208/-
VOLTAS 1.5 Ton Inverter Air Conditioner 100% Copper Condensar, 10 Years Compressor Warranty
5 Years Comprehensive Warranty
EMI : 3,000/-
Haier 1.5 Ton Inverter Air Conditioner
10 Years Compressor Warranty
EMI : 2,709/-
Carrier 1.5 Ton Inverter Air Conditioner
10 Years Compressor Warranty
EMI : 3,167/-
LG Front Load Washing Machine 7 KGS 10 Years Motor Warranty
EMI : 2,634/-
SAMSUNG Front Load Add Wash Washing Machine 9/6 KGS
FREE J-6 Mobile
EMI : 5,542/-
IFB Front Load Washing Machine 6.5 KGS
EMI : 2,580/-
BOSCH Front Load Washing Machine 6.5 KGS 10 Years Motor Warranty
EMI : 2,025/-
SAMSUNG Mobile 0 Down Payment Rs. 10,000/- Cash Back Offer
EMI : 1,800/-
vivo Mobile Upto 9% Cash Back PayTM Customers Rs. 3,000/- Cash Back
EMI : 1,125/-
oppo Mobile 5% Cash Back Offer HDFC Customers 1 Time Screen Replacement Free
EMI : 1,250/-
LG Mobile 0 Down Payment 0 Interest
EMI : 1,350/-
iPhone Mobile
Rs : 25,000/- Onwards
honor Mobile 7C 4GB Ram + 64GB Storage
EMI : 1,085/-
mi
EMI : 1,750/-
Microwave Oven 28 Ltrs Convention
EMI : 1,025/-
SAMSUNG 28 Lts Convention Microwave Oven
EMI : 2,067/-
Air Purifier
Rs : 8,600/- Onwards
Water Dispenser
Rs : 7,500/- Onwards
Water Purifier RO
EMI : 1,200/-
Water Greaser
Rs : 3,100/- Onwards
Wet Grinder
Rs : 2,900/- Onwards
Rice Cooker
Rs : 1,600/- Onwards
Mixer
Rs : 2,000/- Onwards
LG SAMSUNG SONY Panasonic Haier Whirlpool Godrej DAIKIN HITACHI VOLTAS Carrier IFB BOSCH ONIDA
TCL MITASHI V-GUARD Preethi EUREKA FORBES ULTRA Butterfly USHA Crompton orient KEELINE AO Smith iPhone vivo oppo mi honor



ఈనాడు



విజయవాడ 14-1-2019 సోమవారం సిటీ సంపుటి 45 . సంచిక 155
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

రాష్ట్రంలో రెండు దశలు!



- తెలంగాణలో ఒకే విడతలో పోలింగ్
- ఫిబ్రవరి చివరి వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్?
- లేదంటే మార్చి మొదటివారంలో...
- వచ్చే వారం నుంచి ఈసీ రాష్ట్రాల పర్యటన
- మే 24వ తేదీలోగా ఎలక్షన్ ప్రక్రియ పూర్తి
- ఓటు హక్కుపై ఈ నెల 25 లేదా 26 నుంచి ప్రచారం
- 1950కి ఫోన్ చేసి ఓటు వివరాలు తెలుసుకోవచ్చు
- సీఈవోలకు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు

ఈనాడు - హైదరాబాద్

సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఈ ఏడాది మే నెల చివరి వారంలోగా లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో రెండు దశల్లో, తెలంగాణలో ఒకే దశలో ఎన్నికలు నిర్వహించే అంశంపై ఆలోచిస్తోంది. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు వచ్చే వారం నుంచి కేంద్ర ఎన్నికల సంఘం బృందాల వారీగా అన్ని రాష్ట్రాల్లో పర్యటించనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి చివరి వారం లేదంటే మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనలో ఎన్నికల సంఘం ఉంది. వివిధ రాష్ట్రాల బోర్డు పరీక్షల తేదీలపైనా ఆరా తీసింది. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల (మిగతా 2లో)

ఈసీ బృందం పర్యటన తరువాతే..

తెలంగాణ రాష్ట్రంలో ఒకే దశలో లోక్‌సభ ఎన్నికలను పూర్తి చేసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయినందున ఒకే దశలో ఎన్నికలు నిర్వహించేందుకు అనువైన పరిస్థితులున్నట్లు ఎన్నికల సంఘం భావిస్తోంది. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ నియోజకవర్గాలు ఎక్కువగా ఉండటంతోపాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించాల్సి ఉన్నందున రెండు దశల్లో జరపాల్సి వస్తుందేమోనని ఆలోచిస్తోంది. ఎన్నికల సంఘం బృందం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన తర్వాత ఒకదశలోనా? రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించాలా? అన్న అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భోగ భాగ్యాల భోగి



ఉదయాద్రిన వెలుగులు
తెలిమంచు తొలగేలా ఉవ్వెత్తున ఎగసిపడే భోగి మంటలు..

ఇంటింటి ముంగిట సప్తవర్ణ శోభలు
రంగవల్లుల నడుమ కొలువుదీరే గొబ్బి దేవతలు...

మాడున నూనెలూ సున్నిపిండి నలుగులు
నూతన ఉత్తేజాన్నిచ్చే ఆత్మీయ మంగళ స్నానాలు..

పిడకల దాలి మీద మట్టి కుండలో ఘుమఘుమలు
కొత్త బియ్యపు సిరుల పాలపొంగళ్లు..

లక్ష్మీకాసులు, బంతి పూరెక్కలు
పిలగాళ్ల నెత్తిన ముచ్చట్లు కురిపించే భోగి పండ్లు..

నట్టింట నయగారం
కొండపల్లి, నిర్మల్, ఏటికొప్పాక బొమ్మల కొలువులు..

కొత్త ధాన్యం, కొత్త బట్టలు, కొత్త అల్లుళ్లతో
కుటుంబమంతా కలిసిన ఆనంద సందోహం..

తెలుగు లోగిళ్లకు నేడు సరికొత్త కళ వచ్చింది..
రేపటి సంక్రాంతికి నేడు గడపగడపా తోరణం కట్టుకుంది!!


వరాల సంక్రాంతి

సంక్షేమ ఫలాల మూట విప్పుతున్న ప్రభుత్వం

- ఈ నెల నుంచే 2వేల పింఛను
- సాగుకు 9 గంటల విద్యుత్తు
- రేషన్ డీలర్లకు కమీషన్ పెంపు
- రజకులకు పింఛన్ల ప్రతిపాదన
- 70 ఏళ్లు దాటిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు పెంపు 15శాతం
- 2 చేతులు లేని వారికి రూ.10వేల 'వరం'?
- రాష్ట్రాభివృద్ధి కొనసాగించడానికి మద్దతివ్వాలని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి
- తెలుగు వారికి పండగ శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు నాయుడు

ఈనాడు - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం వరాల మూట విప్పుతోంది. ఈ సంక్రాంతికి క్రాంతి నింపే పథకాలను అమలు చేయబోతోంది. పింఛన్లను రూ.2వేలకు పెంచడం, సాగుకు 9 గంటల ఉచిత విద్యుత్తు అందించడం, రేషన్ డీలర్లకు కమీషన్ల పెంపు, 50 ఏళ్లు దాటిన రజకులకు పింఛన్లు, 75ఏళ్లు దాటిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లను 15శాతం పెంచడం వంటి చర్యలకు శ్రీకారం చుడుతోంది, వీటిలో కొన్ని ఈనెల నుంచి, మరికొన్ని (మిగతా 2లో)





"పింఛన్లు రెట్టింపు చేశా. ఇది నాకెంతో సంతృప్తినిస్తోంది. నిరుపేదల కళ్లలో వెలుగు చూడటమే నిజమైన సంక్రాంతి."

\- చంద్రబాబు

సంక్రాంతికి సొంతూరుకు..



హైదరాబాద్ నుంచి విజయవాడవైపు వెళ్లే మార్గంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

జగన్‌కు తెరాస అండ



తెనాలి శివారు పెదరావూరులో భోగి మంటలు వేస్తున్న పవన్. పక్కన నాదెండ్ల మనోహర్ తదితరులు

- నాడు వద్దన్న అక్కడి నేతలు నేడు ముద్దు చేస్తున్నారు
- చంద్రబాబుపై కక్ష సాధిస్తున్నారు
- అవకాశవాద రాజకీయాలతో అసహ్యం వేస్తోంది
- రుణమాఫీతో మభ్యపెట్టం
- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- తెనాలిలో భోగి వేడుకల్లో పాల్గొన్న జనసేన అధినేత

ఈనాడు - గుంటూరు

"జగన్‌ను తెలంగాణలో అడుగుపెట్టనీయబోమని వ్యాఖ్యానించిన తెరాస నేతలే ఇప్పుడు ఆంధ్ర రాజకీయాల్లో ఆయనకు అండగా నిలుస్తామంటున్నారు. చంద్రబాబుపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారు. 'మీరు 10 మంది కూడా లేరు. మీకు తెలంగాణ కావాలా? ఏం రాజేందర్?' అంటూ నాడు తెరాస ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఉద్దేశించి అసెంబ్లీలోనే అప్పటి సీఎం వైఎస్ నిలదీశారు. అలాంటిది వారే ఇప్పుడు ఆంధ్రా రాజకీయాల్లో జగన్‌కు అండగా ఉంటామంటున్నారు. ఈ అవకాశవాద రాజకీయాలను చూస్తుంటే అసహ్యమేస్తోంది" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. "ఒకాయన 'మళ్లీ మీరే రావాలి' అని ప్రచారం చేయించుకుంటారు. మరొకాయన 3 దశాబ్దాలపాటు సీఎంగా ఉండాలని కలలు కంటున్నారు. వారి ఆశలు, ఆకాంక్షలను నేను తప్పు (మిగతా 2లో)

ఇదీ సంగతి!



థర్డ్ పార్టీ సర్వే అని నాకేం తెలుసుసార్, ఇదేంటి, అదేంటి అని అడుగుతోంటే ఒళ్లు మండి నాలుగు తగిలించి లోపలేశా!

జవాన్ల ఫేస్‌బుక్

- పాక్ యువతి వలలో పడ్డ భారత సైనికులు
- రహస్య సమాచారం చేరవేత
- ఒక సైనికుడి అరెస్టు
- మరో 50 మందిని ప్రశ్నిస్తున్న అధికారులు

దిల్లీ: ఫేస్‌బుక్‌లో అనికా చోప్రా అనే యువతి వేసిన ఎర భారత సైన్యంలో ప్రకంపనలు సృష్టించింది. పచ్చరంగు చీర ధరించి అందమైన చిరునవ్వు చిందిస్తున్న ఆమె ఫొటోను చూసిన 50 మందికిపైగా జవాన్లు ఆమె వలలో పడ్డారు. తాను సైనిక నర్సింగ్ విభాగంలో కెప్టెన్ హోదాలో పనిచేస్తున్నట్లు ఆమె చెప్పిన మాయ మాటలు నమ్మి ఇబ్బందుల్లో పడ్డారు. ఇది పాకిస్థాన్ గూఢచర్య విభాగం విసిరిన వలపు వల అని తెలుసుకునేసరికి వారి ఇంటి తలుపులను పోలీసులు తట్టారు. ఒక జవాను అరెస్టయ్యాడు. సిపాయి సోమ్‌వీర్ సింగ్ 2016లో సైన్యంలో చేరాడు. ఆ వెంటనే కెప్టెన్ అనికా చోప్రా పేరుతో అతడికి ఫేస్‌బుక్‌లో (మిగతా 2లో)



పాకిస్థాన్ గూఢచర్య విభాగం వలలో చిక్కుకున్న సిపాయి సోమ్‌వీర్ సింగ్



వరాల సంక్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నెల నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఇందులో పింఛన్ల పెంపుపై ఇప్పటికే నిర్ణయం తీసుకోగా.. మిగిలిన వాటిపై పండగ తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు 'ఇంటికి పెద్ద కొడుకుగా సంక్రాంతి కానుక ఇచ్చా. పింఛన్లు రెట్టింపు చేశా. ఇది నాకెంతో సంతృప్తినిస్తోంది. నిరుపేదల కళ్లల్లో వెలుగు చూడటమే నిజమైన సంక్రాంతి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దివ్యాంగులకు నెలకు రూ.3వేలు ఇస్తామని, 2 చేతులు లేని వారికి రూ.10వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. 'వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు ఒక భరోసా.. చేనేత కార్మికులు, గీత కార్మికులకు వరం.. డప్పు కళాకారులు, చర్మకారులకు ఒక తోడ్పాటు.. ప్రతి పేద కుటుంబం తెదేపాకు అండగా ఉండాలి' అని ఆకాంక్షించారు. 'రాష్ట్ర పురోభివృద్ధికి రోజుకు 18 గంటల పాటు శ్రమిస్తున్నా, ప్రగతిని కొనసాగించడానికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు తిరిగి మద్దతివ్వాలి. ఆశీర్వదించాలి' అని రాష్ట్ర ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సంక్రాంతి సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో తెలుగు ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాల అమల్లోనే ఇదొక చరిత్ర

'జనవరిలో ఇవ్వాల్సిన రూ.1,000, ఫిబ్రవరిలో ఇచ్చే రూ.2వేలు కలిపి.. మొత్తం రూ. 3వేల పింఛను సొమ్మును ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో ఒకే సారి పంపిణీ చేస్తాం. తర్వాత ప్రతి నెలా రూ. 2వేల చొప్పున అందిస్తాం. పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరగాలి. వచ్చే నెల మొదట్లో అందరికీ భోజనాలు పెట్టి రూ.3వేలు అందిస్తాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'రాష్ట్రంలోని 1.42 కోట్ల కుటుంబాల్లో 54 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. అంటే ప్రతి 3 కుటుంబాల్లో ఒకరికి పింఛను ఇస్తున్నాం. సంక్షేమ పథకాల అమల్లోనే ఇదొక చరిత్ర.. పేదల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే భరోసా ఇది' అని స్పష్టం చేశారు. తెదేపా నేతలు, ప్రజాప్రతినిధులు, బాధ్యులతో ఆదివారం సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పింఛన్ల పంపిణీపై ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలని తెదేపా నేతలకు సీఎం సూచించారు.

ధాన్యం కొనుగోళ్లకు సహకరించని కేంద్రం

ధాన్యం విక్రయాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను పలువురు నేతలు టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని మండిపడ్డారు. భారత ఆహార సంస్థ నిబంధనలను సడలించి కొనుగోలు చేయాలని సూచించారు. వెంటనే దిల్లీ వెళ్లి ఎఫ్‌సీఐ అధికారులతో చర్చించాలని మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావులను ఆదేశించారు.

అందరి సహకారంతోనే...

ప్రభుత్వ యంత్రాంగం, సిబ్బంది సహకారంతోనే రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటు సాధించిందని చంద్రబాబు వెల్లడించారు. గత నాలుగేళ్లుగా వర్షపాతం తక్కువగా ఉన్నా వ్యవసాయ రంగం వృద్ధి రేటు 17.18 శాతం నమోదైందని వివరించారు. పట్టిసీమ ద్వారా నాలుగేళ్లలో రూ.44వేల కోట్ల విలువైన పంట పండిందని గుర్తు చేశారు. ఇదే సమయంలో రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకెళ్లి చెరువులు నింపామని, క్రమక్రమంగా అక్కడ కరవు ఛాయలు తొలగిపోతున్నాయని పేర్కొన్నారు. పట్టిసీమ స్ఫూర్తితో పంచ నదుల మహాసంగమ పనులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు 65శాతం పైగా పూర్తయిందని, రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు.

సంక్రాంతి నవ్యాంధ్రప్రదేశ్‌కు నవక్రాంతి..

సంక్రాంతి పండగ నవ్యాంధ్రప్రదేశ్‌కు నవ క్రాంతి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారికి ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వాకిట వెలుగు ముగ్గులు వేసి మన సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పే సృజనాత్మక వేడుక సంక్రాంతి పండగని పేర్కొన్నారు. పంట చేతికొచ్చిన సంతోషంతో రైతులు చేసుకునే పండగే సంక్రాంతి అని, అందుకే ఇది రైతుల నిజమైన పండగని వ్యాఖ్యానించారు.



రైతులకు 9 గంటల వ్యవ'సాయం'

వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దీనికి సంబంధించి విధి విధానాలు తయారు చేయాలని ఇంధన శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు మార్చి నెలాఖరులోగా విద్యుత్తు సరఫరా చేయాలని డిస్కమ్‌లకు స్పష్టం చేశారు. ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలిచ్చినట్లు ఇంధనశాఖ కార్యదర్శి అజయ్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఎంతమందికి ప్రయోజనం: **17లక్షల మందికి**
- ప్రస్తుతం ఇస్తున్న విద్యుత్తు **10,831 మిలియన్ యూనిట్లు**
- అదనంగా కావాల్సింది **2,800 మిలియన్ యూనిట్లు**
- అదనపు వ్యయం: **రూ.1,200 కోట్లు**
- ప్రస్తుతం అవుతున్న వ్యయం: **రూ.6,030.17 కోట్లు**
- 9 గంటల సరఫరావల్ల వ్యయం: **రూ.7,230 కోట్లు**
- ప్రభుత్వం అందించనున్న ఇంధన సామర్థ్య, సౌర ఆధారిత పంపుసెట్లు: **16 లక్షల మందికి**
- దీనివల్ల ఆదా అయ్యే విద్యుత్తు: **30 శాతం**

రేషన్ డీలర్లకు కమీషన్ పెంపు!

రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి సంక్రాంతి కానుకలను ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి రేషన్ డీలర్లకూ కమీషన్ పెంపు కానుకను సిద్ధం చేశారు. డీలర్లకు బియ్యంపై ప్రస్తుతం క్వింటాల్‌కు ఇస్తున్న రూ.70ని రూ.100కు పెంచనున్నారు. ఈ పెంపువల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28,500 మంది డీలర్లకు లబ్ధి చేకూరే అవకాశముంది. డీలర్లకు కమీషన్ పెంపునకు సంబంధించిన దస్త్రం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. సంక్రాంతి సెలవుల తర్వాత ఈ దస్త్రానికి ఆమోద ముద్ర పడే అవకాశముందని పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పెంచే కమీషన్‌ను ఈ నెల నుంచి గానీ, ఫిబ్రవరి నుంచి గానీ వర్తింపజేసే అవకాశముంది.

సంతృప్త స్థాయికి ప్రోత్సాహం

ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల వారీగా కార్డుదారుల సంతృప్తస్థాయిని ప్రభుత్వం తెలుసుకుంటోంది. ఈ లెక్కల ఆధారంగా కార్డుదారులు 85శాతంపైగా సంతృప్తిని వ్యక్తం చేసిన దుకాణాలను నిర్వహిస్తున్న డీలర్లను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఒక్కో డీలరుకు నెలకు రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి ప్రకటించారు.

గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో..

- 80శాతం నుంచి 90శాతం మధ్య సంతృప్త స్థాయి సాధించిన డీలర్లు 10300 మంది.
- 90శాతంపైన సాధించినవారు 3800 మంది.
- 85శాతంపైగా సంతృప్త స్థాయిని సాధించిన డీలర్లు సగటున 10వేల మంది వరకూ ఉన్నట్లు అంచనా.

పెంపు ప్రతిఫలం

- మొత్తం డీలర్లు: **28,500 మంది**
- కేజీ బియ్యంపై పెరగనున్న కమీషన్: **30 పైసలు**
- కమీషన్ పెంపు, నగదు ప్రోత్సాహకం కలిపి ఏటా అదనపు వ్యయం: **రూ.100 కోట్లపైనే**

చారిత్రకం: శిద్దా



రాష్ట్రంలో సామాజిక భద్రత పింఛన్ల కింద ఇచ్చే మొత్తాన్ని రూ.2 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం హర్షణీయమని రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరి బతుకుకు భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని వ్యాఖ్యానించారు.

50 ఏళ్లు దాటిన రజకులకు పింఛన్లు!

సామాజిక భద్రత కింద 50 సంవత్సరాలు దాటిన రజకులకు పింఛన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆర్థిక వెనుకబాటు, కుల వృత్తిలో భాగంగా త్వరగా అనారోగ్యానికి గురవడం వంటి కారణాల ఆధారంగా ఈ పింఛన్లను అందించనుంది. కులవృత్తిని అనుసరిస్తున్న వారు త్వరగా అనారోగ్యానికి గురవుతున్నందున 50ఏళ్లు దాటిన వారికి పింఛన్లు ఇవ్వాలని రజకుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో పింఛన్లకు సంబంధించిన ప్రతిపాదనలను బీసీ సంక్షేమశాఖ అధికారులు సిద్ధం చేసి ఆర్థికశాఖ ఆమోదానికి పంపినట్లు తెలిసింది. త్వరలో జరగనున్న మంత్రిమండలి సమావేశంలో దీనికి ఆమోదం లభించే అవకాశాలున్నట్లు బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నెలకు రూ.2వేలు ఇవ్వాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో దాదాపు 12 లక్షల మందికిపైగా రజకులున్నట్లు ప్రజా సాధికార సర్వే ద్వారా అధికారులు గుర్తించారు. వృద్ధాప్య పింఛన్ల విభాగంలో 65ఏళ్లు దాటిన వారికి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు ఇస్తోంది. 50- 65ఏళ్ల మధ్య ఎంత మంది ఉంటారనేది అధికారులు గుర్తించే పనిలో ఉన్నారు.

'పింఛను పెంపుతో ముందే పండగ'

70 ఏళ్లు దాటిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు 15 శాతం అదనపు పింఛను ఇచ్చేందుకు అంగీకారం తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం హర్షణీయమని ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. రూ.200 కోట్లు అదనపు భారం పడుతున్నప్పటికీ ప్రభుత్వం ఆమోదం తెలపడం ఉద్యోగుల మీదున్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 4 లక్షల మంది పెన్షనర్లకు సంక్రాంతి పండగ ముందే వచ్చిందని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో రెండు దశలు!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో రెండు రోజుల పాటు సమీక్షించింది. ఈ సందర్భంగా పలు మార్గదర్శకాలను జారీచేసింది. పోలింగ్ సమయంలో ఓట్లు గల్లంతయ్యాయన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తుండటంతో ఓటర్లలో చైతన్యం కోసం దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో పూర్తి స్థాయిలో వీవీప్యాట్‌లను అందుబాటులోకి తెచ్చింది. అన్ని రాష్ట్రాల్లోనూ మూడోతరం ఈవీఎంలను వినియోగించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈవీఎంల తరలింపు సందర్భంగా ఎదురైన సమస్యలపైనా సమీక్షించింది. 2014 ఎన్నికల ప్రక్రియలో భాగంగా మార్చి నెల అయిదో తేదీన ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. 14వ తేదీన ప్రకటన జారీ చేసింది. తొమ్మిది దశల్లో పోలింగ్ నిర్వహించింది. ఏప్రిల్ ఏడో తేదీన తొలిదశ పోలింగ్ జరగ్గా.. మే 12న చివరిదైన తొమ్మిదో విడత పోలింగ్ జరిగింది. మే 16న ఓట్ల లెక్కింపు చేపట్టి 28వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ అంతటినీ పూర్తి చేసింది. ఈదఫా కూడా మే నెల 24వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది.

గణతంత్ర దినోత్సవం నుంచి ప్రచారం!

ఓటు ఉందా? లేదా? అన్న అంశంపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర విభాగాలు 1950 నంబరుతో కాల్ సెంటర్లను నిర్వహిస్తున్నాయి. ఈ నంబరుకు ఫోన్ చేస్తే ఓటుకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాలన్నది ఎన్నికల సంఘం వ్యూహం. జాతీయ ఓటర్ల దినోత్సవమైన జనవరి 25వ తేదీ లేదా గణతంత్ర దినోత్సవమైన జనవరి 26వ తేదీన కానీ ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఆ రెండు రోజుల్లో ఏ తేదీన ప్రారంభించాలన్న విషయంపై వచ్చే వారంలోగా ఉత్తర్వులు జారీ చేయనుంది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 1950 నంబరు కాల్ సెంటర్‌ను 30 మందితో నిర్వహించారు. త్వరలో చేపట్టే ప్రచారానికి ఆ కాల్ సెంటర్‌ను మరింత విస్తృతం చేయటంతోపాటు ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతారు. నియోజకవర్గాల వారీగా ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి పేర్లు, ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ప్రచారం నిర్వహించే రోజుల్లో ఆయా అధికారులు ప్రజల నుంచి వచ్చే ఫోన్లకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కూడా ఎన్నికల సంఘం ఆదేశించింది.

జవాన్ల ఫేస్‌బుక్

(మొదటి పేజీ తరువాయి)

ఒక 'ఫ్రెండ్ రిక్వెస్ట్' వచ్చింది. దీంతో అతడి ఆనందానికి అవధుల్లేవు. రానురాను ఈ 'స్నేహం' బాగా బలపడింది. వివాహితుడైన సోమ్‌వీర్ తన భార్యకు విడాకులిచ్చి, అనికాను పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకునే స్థాయికి ఇది ప్రకోపించింది. సోమ్‌వీర్ కార్యకలాపాలు అనుమానాస్పదంగా ఉండటంతో భారత సైన్యంలోని నిఘా విభాగం అతడిపై కన్నేసింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో పనిచేస్తున్న అతడికి ఐదు నెలల నుంచి క్రమం తప్పకుండా జమ్మూ నుంచి ఫోన్లు రావడంతో నిఘా అధికారులు అప్రమత్తమయ్యారు. అతడి ఫేస్‌బుక్ సంభాషణలను గమనించారు. కెప్టెన్ అనికా చోప్రా పేరుతో అతడితో టచ్‌లో ఉన్నది పాకిస్థాన్ వాసి అని గుర్తించారు. అనికా చోప్రా పాత్రధారి.. మొదట్లో సోమ్‌వీర్‌కు అమాయకపు ప్రశ్నలను సంధించింది. 'నువ్వు ఎక్కడ పనిచేస్తున్నావు? నువ్వు పనిచేసే యుద్ధట్యాంక్ ఫొటోను పంపగలవా? క్షేత్రస్థాయి విన్యాసాలు ఎప్పుడు నిర్వహిస్తారు' వంటి వివరాలను ఆరా తీసింది. సోమ్‌వీర్ కూడా ఎలాంటి సంకోచం లేకుండానే తన 'స్నేహితురాలి'కి అన్ని వివరాలూ పంపాడు. అతడి నుంచి సమాచారం అందుకోవడం మొదలుపెట్టాక అనికా చోప్రా పాత్రధారి అతడిని బెదిరించడం మొదలుపెట్టింది. దీంతో అతడు డబ్బు తీసుకొని సమాచారం ఇవ్వడం మొదలుపెట్టాడు. తాను పనిచేస్తున్న సైనిక కేంద్రానికి సంబంధించిన సున్నితమైన సమాచారం, ఫొటోలు, సైనిక విన్యాసాల వివరాలు పంపుతున్న అతడిని నిఘా అధికారులు పట్టుకొన్నారు. అధికార రహస్యాల చట్టం, భారత శిక్షా స్మృతిలోని వివిధ సెక్షన్ల కింద పోలీసులు అతడిపై కేసు పెట్టారు.

చోప్రా 50 మందికిపైగా సైనికులపైనా వల విసిరింది. వీరు ఫేస్‌బుక్‌లో మారుపేర్లతో 'లైక్'లు, కామెంట్లు చేశారు. వీరిని సైనిక నిఘా విభాగం, రాజస్థాన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ విచారణలో అనికా చోప్రా పాత్రధారి ఒక్కో జవాన్‌కు నిర్దిష్టంగా ఒక్కో సమయం ఇస్తున్నట్లు తేలింది. ఆ సమయంలోనే 'ఆమె' వారితో ఫేస్‌బుక్‌లో సంభాషిస్తోంది.

సూటి బాట

రుజు వర్తనం.. ముక్కు సూటిగా ఉండటం.. పైకి ఎంత తేలిక అనిపిస్తుందో నిజానికి అంత కష్టం కూడా! లేకపోతే అంతా ఆ మార్గంలోనే ప్రయాణిస్తుండే వాళ్లు కదా. కష్టానికి వెరవకుండా ఆ దారిని ఎంచుకోవటమే ఉత్తమం.

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

14–1–2019 సోమవారం

శ్రీ విళంబి నామ సంIIరంII దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
అష్టమి: రా. 7.32 తదుపరి నవమి
రేవతి నక్షత్రం: ఉ. 8.47 తదుపరి అశ్విని
అమృత ఘడియలు: ఉ. 7.55 వరకు
తిరిగి రా. 2.13 నుంచి 3.53 వరకు
వర్జ్యం: తె. 5.33 నుంచి
దుర్ముహూర్తం: మ. 12.31 నుంచి 1.15 వరకు
తిరిగి మ. 2.43 నుంచి 3.28 వరకు
రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-40
భోగి పండుగ

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
కడప	14.0	33.0
శ్రీకాకుళం	16.0	26.0
హన్మకొండ	16.0	28.0
కరీంనగర్	16.0	30.0
తిరుపతి	16.2	29.2
నల్గొండ	16.4	30.0
విశాఖపట్నం	17.0	28.0
రామగుండం	17.4	29.8
అనంతపురం	17.4	32.3
హైదరాబాద్	17.5	29.6
మహబూబ్‌నగర్	17.6	32.5
సూర్యాపేట	18.0	28.0
గుంటూరు	18.0	30.6
ఖమ్మం	18.0	32.0
నిజామాబాద్	18.5	30.9
కర్నూలు	18.6	32.5
రాజమహేంద్రవరం	19.0	31.0
ఆదిలాబాద్	19.2	31.3
నరసాపురం	19.6	27.7
విజయవాడ	19.8	29.1
తాడేపల్లిగూడెం	20.1	28.8
ఒంగోలు	20.5	30.5

జగన్‌కు తెరాస అండ



కుర్చీపై నిల్చొని భోగి మంటలు తిలకిస్తున్న పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

పట్టను. పదవుల్లో ఎన్నాళ్లైనా ఉండండి. కానీ అవినీతిలేని పాలన సాగిస్తే ప్రస్తుతం నాలాంటి వాళ్లు రాజకీయాల్లోకి రావల్సిన అవసరం ఉండేది కాదు" అని వ్యాఖ్యానించారు. ఈ అవినీతి రాజకీయ వ్యవస్థలను భోగి మంటలతో దహించేద్దామని యువత, ఆడపడుచులకు పిలుపునిచ్చారు. ప్రజలను మోసగించాలనే పార్టీ నేతలను జనసైనికులు ఎక్కడికక్కడ నిలదీయాలని, చివరకు జనసేన తప్పు చేసినా వదలొద్దని పార్టీ శ్రేణులకు సూచించారు. గుంటూరు జిల్లా తెనాలి శివారు పెదరావూరులో పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొని సభలో మాట్లాడారు. "నాయకుల అవకాశవాద రాజకీయాలవల్లే రాష్ట్ర విభజన జరిగింది. దీని వల్ల ప్రజలకు నష్టం కలిగింది. ప్రస్తుతం ఈ నష్టం గురించి యువతకు అంతగా తెలియకపోవచ్చు. కానీ 30ఏళ్ల వరకు ఈ నష్టాలను భరించాల్సి ఉంటుంది. మంచి చదువులు చదివి మేధావులుగా గుర్తింపు పొంది ఇక్కడ సేవలు అందించి సంపద సృష్టించాల్సిన వాళ్లు పరాయి దేశాలకు వెళ్లి ఎన్నారైలుగా మారిపోతున్నారు. దీనికి కారణం మన రాజకీయ నాయకులే. ఎక్కడో అమరావతిలో ఉద్యోగాలు పొందడం కాదు. ప్రతి ఊరిలో యువతకు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా చేయాలనేది జనసేన ఉద్దేశం. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి వారిని అభివృద్ధి బాట పట్టించాలనే ఆలోచన చేయకుండా రుణ మాఫీలతో తాత్కాలిక ఉపశమనం కలిగించే ఆలోచనా విధానం మా పార్టీది కాదు. వారితో చర్చించి వారి సమస్యలను పార్టీ మేనిఫెస్టోలో చేరుస్తాం. అందుకు ఫిబ్రవరి రెండో వారంలో రైతులతో ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించాలనుకుంటున్నాం" అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

కార్యక్రమాల రద్దు

విద్యార్థులు, రైతులతో వేర్వేరుగా మాట్లాడాలని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అనుకున్నారు. కానీ పార్టీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించటంతో అసహనానికి గురై ఆ కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. భోగి మంటల్లో పాల్గొని అనంతరం విజయవాడకు వెనుదిరిగారు. పార్టీ నేతలు నాదెండ్ల మనోహర్, రావెల కిషోర్ బాబు, బాలరాజు, మాదాసు గంగాధరం, తోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత వ్యవస్థ

- కార్యాచరణ ప్రణాళికలపై దృష్టి
- ఏసీబీలో ప్రత్యేకంగా నియంత్రణ విభాగం
- లంచాలకు ఆస్కారం లేని విధానాలపై సర్కారుకు సిఫార్సులు
- ప్రణాళిక రూపొందించిన ఏసీబీ ఇన్‌ఛార్జి డీజీ ఠాకూర్



ఈనాడు, అమరావతి: లంచాలు తీసుకున్న తర్వాత అవినీతి అధికారులను పట్టుకోవడం కాదు...అందుకు ఆస్కారమే లేని వ్యవస్థను రూపొందించటంపై ఆంధ్రప్రదేశ్ ఏసీబీ దృష్టిసారించింది. అందులో భాగంగా తమ పరిధిలో కొత్తగా అవినీతి నియంత్రణ విభాగాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఏసీబీ ఇన్‌ఛార్జి డీజీ, రాష్ట్ర డీజీపీ ఆర్.పి.ఠాకూర్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఏయే శాఖల్లో ఏయే అంశాల్లో అధికంగా అవినీతి చోటుచేసుకుంటోంది? ఎక్కడ లంచాలకు ఆస్కారమేర్పడుతోంది? తదితర అంశాలను ఈ విభాగం నిరంతరం అధ్యయనం చేస్తుంది. గత నాలుగేళ్లలో ఉచ్చు (ట్రాప్) కేసుల్లో ఏసీబీకి పట్టుబడిన వారిలో ఎక్కువ మంది పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగల్ ప్రతుల మంజూరు, రైతుల భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు, పాసు పుస్తకాల జారీకి, పట్టణాలు, నగరాల్లో కొత్తగా చేపట్టే నిర్మాణాలకు అవసరమైన అనుమతులు మంజూరు చేసేందుకు, కొత్త నిర్మాణాలకు పన్నుల విధింపు, ట్రేడ్ లైసెన్సుల మంజూరు తదితర సేవల కోసం లంచాలు తీసుకున్నారు. మరికొంత మంది ప్రభుత్వోద్యోగులైతే.. కేసుల దర్యాప్తు పూర్తయిన తర్వాత అభియోగ పత్రాల్లో మార్పులు, కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు, స్టేషన్ బెయిల్ మంజూరుకు, విద్యుత్తు మీటర్ల ఏర్పాటు, సర్వీసు కనెక్షన్లు, డాక్యుమెంట్లు/ఈసీలు, సేల్‌డీడ్‌ల మంజూరు కోసం లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇప్పటికే వీటన్నింటినీ విశ్లేషించిన ఏసీబీ.. ఆయా సేవల్లో లంచాలకు ఆస్కారం లేకుండా చూడాలంటే ఎలాంటి విధానాలు ప్రవేశపెట్టాల్సి ఉంటుందనే దానిపై కొత్త విభాగంతో అధ్యయనం చేయించనుంది. ఎక్కడెక్కడ లోపాలున్నాయో గుర్తించనుంది. వాటిని అధిగమించి ఆయా శాఖల్లో అవినీతికి ముకుతాడు వేసేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది. విధానాలు, చట్టాల రూపకల్పన దశలోనూ భాగస్వామ్యమై..అవినీతి చోటుచేసుకోకుండా ఉండాలంటే ఏం చేయాలనేదానిపైన సూచనలు పంపించనుంది. ఈ అధ్యయనం ఆధారంగా భవిష్యత్తులో పూర్తిస్థాయిలో అవినీతికి ఆస్కారం లేని వ్యవస్థల రూపకల్పన సాధ్యపడుతుందని ఏసీబీ భావిస్తోంది.

చెన్నారెడ్డి జీవిత చరిత్రను పుస్తకంగా తేవాలి

- శత జయంతి వేడుకల్లో పలువురు నేతలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలని పలువురు రాజకీయ పార్టీల ప్రముఖులు సూచించారు. చెన్నారెడ్డి సమాధి ప్రాంతంలో స్మారక భవనం నిర్మించాలన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నివాళులర్పిస్తూ సందేశం పంపించారు. మర్రి చెన్నారెడ్డి స్మారక ట్రస్ట్, మహానగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ గవర్నర్ రోశయ్య, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు, కేంద్ర మాజీ మంత్రులు జైపాల్‌రెడ్డి, దత్తాత్రేయ, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, జస్టిస్ సుభాషణ్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ చెన్నారెడ్డి వ్యక్తిత్వం, పరిపాలన దక్షతను కొనియాడారు. మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ..చెన్నారెడ్డి జీవిత చరిత్రను రాయించే పని ప్రారంభించామని తెలిపారు. ఏడాది పొడవునా చెన్నారెడ్డి శత జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు రోశయ్య అధ్యక్షతన కమిటీ వేశామని చెప్పారు.

ఎన్జీవో అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక

- ప్రధాన కార్యదర్శిగా బండి శ్రీనివాసరావు
- ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎన్జీవో రాష్ట్ర కార్యవర్గం



ఎన్నిక అనంతరం అశోక్‌బాబుతో చంద్రశేఖర్‌రెడ్డి, బండి శ్రీనివాసరావు, వివిధ జిల్లాల నేతలు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం(ఏపీ ఎన్జీవో సంఘం) అధ్యక్షునిగా నలమారు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకూ చంద్రశేఖర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శిగా, శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కో-ఆప్షన్ విధానంలో వీరిద్దర్నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2020 మేలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగులు సొంతిళ్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని, వీటి సాధన కోసం దశల వారీగా ఉద్యమిస్తామని ప్రకటించారు. ప్రభుత్వానికి సహకరిస్తూ రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా తమ సంఘం ఒక సామాజిక బాధ్యతతో పనిచేస్తోందని ఏపీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు అశోక్‌బాబు తెలిపారు. సంఘంలో 8 ఏళ్లపాటు కీలక హోదాల్లో పనిచేయడం అదృష్టమని వెల్లడించారు.

గన్నవరం నుంచి దుబాయ్‌కు నేరుగా విమాన సర్వీసు

- ప్రజాభిప్రాయానికి శ్రీకారం చుట్టిన ఏపీఏడీసీఎల్

ఈనాడు-అమరావతి: గన్నవరం విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు నేరుగా విమానాన్ని నడిపేందుకు ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ప్రజాభిప్రాయానికి ఇటీవల శ్రీకారం చుట్టింది. సింగపూర్‌కు విమాన సర్వీస్ ప్రవేశపెట్టే ముందు కూడా ఇలాంటి ప్రయోగమే చేశారు. అప్పట్లో 60 వేల మందికిపైగా ఆన్‌లైన్‌లో సానుకూలతను వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి లోటు భర్తీ నిధి (వీజీఎఫ్) సమకూర్చే అవకాశం లేకుండానే గన్నవరం నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసు నడుస్తోంది. దుబాయ్‌కు ప్రవేశపెట్టే సర్వీసుపైనా ఆన్‌లైన్‌లో 55వేల మందికి పైగా అనుకూలతను వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి దుబాయ్ వెళ్లే వారు హైదరాబాద్ వెళ్లి ప్రయాణం సాగిస్తున్న పరిస్థితి. గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా వచ్చాక ఇక్కడి నుంచి ఇతర దేశాలకు విమాన సర్వీసులు నడిపేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. సింగపూర్ విమాన సర్వీసు విజయవంతం కావడంతో ఇప్పుడు దుబాయ్ కోసం ఏపీఏడీసీఎల్ ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ప్రజల నుంచి అనతి కాలంలో మంచి స్పందన రావడంతో తదుపరి చర్యలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. లోటు భర్తీ నిధి విధానంలో గన్నవరం నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసు నడిపేందుకు ముందుకొచ్చే సంస్థలను ఆహ్వానిస్తూ నెలాఖరులో విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ టెండర్లు పిలవనుంది.

తెదేపా అంటే మోదీకి భయం.. కోపం: సభాపతి కోడెల

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: తెలుగుదేశం ప్రభుత్వం.. పార్టీ అంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి భయం.. కోపమని శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విమర్శించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గులు పోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాల్ని ముఖ్యమంత్రితోపాటు క్షేత్రస్థాయిలో పని చేసే తాము అందిస్తుంటే, ప్రధానమంత్రి రాజకీయాలు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు నిధుల్ని మంజూరు చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చే విధంగానే ఏపీకి ఉపాధి నిధులు మంజూరు చేయాలన్నారు. మోదీ తన జేబుల్లో నగదు ఏమీ ఇవ్వట్లేదని ఉపాధి నిధులు అందరికీ సంబంధించినవని చెప్పారు. లాలూచీ రాజకీయాలతో తెలుగు ప్రజలపై మోదీ వివక్ష చూపిస్తున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రతిపక్షం చేస్తున్న దుర్మార్గమైన ఆలోచనల్ని ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. మోదీకి.. అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షానికి విరుగుడు మందు వచ్చే ఎన్నికల్లో తెదేపాను భారీ అధిక్యంతో గెలిపించడమేనని ఆయన చెప్పారు.

ఈనాడు

సమగ్ర వ్యూహంతోనే సుజల గంగ

ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ (ఇటీవలిదాకా అలహాబాద్)లో అంగరంగ వైభవంగా అర్ధ కుంభమేళా నిర్వహణకు పూర్వరంగం సిద్ధమైంది. మకర సంక్రాంతి పర్వదినమే ముహూర్తంగా మొదలై మార్చి తొలివారందాకా జరిగే అర్ధ కుంభమేళా- దాదాపు 15 కోట్లమంది యాత్రికుల పుణ్య స్నానాలతో భారతావని ఆధ్యాత్మిక చింతనామృత సారాన్ని దేశదేశాలకూ చాటి చెప్పనుంది. నాగరికతా సింధువులుగానే కాదు, మనిషి ఉనికికి, మనికికి కారణభూతమైన ప్రకృతి ప్రసాదిత జీవనదుల్ని ఆరాధ్య మూర్తులుగా సేవించడం- భారతీయ సంస్కృతి. భగీరథుడి పుణ్యాన భువికి చేరిందంటున్న గంగమ్మనైతే భారతీయ ఆత్మగా సంభావిస్తున్నాం. కోట్లాది భక్తజన సందోహానికి పరమ పవిత్రమైన గంగ- దశాబ్దాల తరబడి కాలుష్య కాసారంగా మిగిలిపోతున్న దురవస్థను దూరం చెయ్యడానికే కేంద్ర ప్రభుత్వం 'నమామి గంగే' ప్రాజెక్టును పట్టాలకెక్కించింది. దాని సాఫల్య వైఫల్యాలపై భిన్న కథనాలు వెలుగు చూస్తున్న దశలో, కుంభమేళా భక్త జన కోటి స్నానాదికాల కోసం గంగలో నీటి నాణ్యత బాగుండేలా చూసేందుకు యూపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేసింది. 800 కిలోమీటర్ల పరిధిలో 227 ప్రధాన మురుగునీటి కాల్వలనుంచి నేరుగా గంగలోకి ప్రవహించే మాలిన్య ప్రవాహాలను కట్టడి చేసేందుకు 206మంది ఇంజినీర్లను ప్రత్యేకంగా నియమించింది. ఈ తరహా తాత్కాలిక ఏర్పాట్లతో భక్తుల పుణ్య స్నానాలకు ఇబ్బంది లేకపోవచ్చుగాని, ఆ తరవాత గంగమ్మతల్లి పరిస్థితేమిటి? నమామి గంగే ప్రాజెక్టు లక్ష్యాల పరిపూర్తి గడువు తరుముకొస్తున్నా ఇప్పటికీ గంగానది వెంబడి 66 నగరాలు, పట్టణాలనుంచి మురుగు కాల్వలు, నల్లాల ద్వారా విసర్జితాలు నేరుగా జీవనదికే చేరుతున్నాయి. ఏకాయెకి 85శాతం నల్లాలకు చెత్తను వడగట్టే ఏర్పాట్లూ లేవని భారతీయ నాణ్యత మండలి అధ్యయనం తాజాగా నిగ్గుదేల్చింది. భక్తి పారవశ్యం పొంగులతో నదీమతల్లిని కొలిచేదీ మనమే. విష కాలుష్య వ్యర్థ ప్రవాహాలతో నదుల గొంతు నులుముతున్నదీ మనమే!

వచ్చే మార్చి నాటికి గంగానది మరింత స్వచ్ఛత సంతరించుకొంటుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తీకరిస్తున్నారు. నిరుడు నవంబరు నాటికి రూ.24,672 కోట్ల వ్యయం కాగల మొత్తం 254 భిన్న ప్రాజెక్టులను అనుమతించామని గంగ పునరుజ్జీవన శాఖ సహాయమంత్రి లోక్‌సభలో ఇటీవల వెల్లడించారు. రోజుకు 3083 మిలియన్ లీటర్ల మురుగునీటి శుద్ధి సామర్థ్యం కల్పనకు, 4871 కిలోమీటర్ల మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి దాదాపు 20వేల కోట్ల రూపాయలతో 131 ప్రాజెక్టుల్ని చేపట్టామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా- క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆశాజనకంగా లేదని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత రాజేంద్ర సింగ్ వంటివారు పెదవి విరుస్తున్నారు. గంగానది పునరుజ్జీవాన్ని ఏనాడో రాజీవ్ జమానాలో లక్షించి 2014దాకా రూ.4000 కోట్లకుపైగా వ్యయీకరించారు. ప్రస్తుత ఎన్‌డీఏ ఏలుబడిలోనే వివిధ పథకాలకు ఖర్చు చేసింది అయిదు వేల కోట్ల రూపాయలు! గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేనంతగా నది నీటిలో ఆక్సిజన్ పరిమాణం మెరుగుపడటం జలచరాలకు ఎంతో మేలు చేయనుందని ఇస్రో సహా పలు శాస్త్ర పరిశోధన సంస్థల నిపుణులు మూడు వారాల క్రితం వెల్లడించారు. ఉత్తరాఖండ్, ఉత్తర్ ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ్ బంగ రాష్ట్రాల్లోని నగరాలు పట్టణాలనుంచి విచ్చలవిడిగా నదిలోకి చొరబడుతున్న మురుగునీటి వ్యర్థాల్ని సమర్థంగా నిలువరించి, ప్రవాహానికి అవరోధాలు తొలగించగలిగితే- సజీవ జలతరంగ గంగ సాక్షాత్కరిస్తుందనడంలో సందేహం లేదు. వచ్చే సంవత్సరం చివరికల్లా గంగా పునరుజ్జీవం పూర్తి అవుతుందన్న శుభ సంకల్పం నెరవేరాలంటే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరింత గట్టిగా కృషి చేయక తప్పదు!

'ధూమపానం ఆరోగ్యానికి హానికరం' అంటూ సిగరెట్ పెట్టెలపై ముద్రిస్తున్నట్లుగా గంగానది దగ్గరా అలాంటి హెచ్చరికలు ఎందుకు పెట్టకూడదు?' అని జాతీయ హరిత ట్రైబ్యునల్ నిరుడు జులైలో ప్రశ్నించింది. హరిద్వార్‌నుంచి ఉన్నావ్ మధ్య గంగాజలం సేవించడానికే కాదు, స్నానానికీ పనికిరాదని తేలిన నేపథ్యంలో ఆ మేరకు బోర్డులు పెట్టాలని జాతీయ స్వచ్ఛ గంగా మిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. గంగానదిని పరిశుభ్రంగా ఉంచాలంటే, డబ్బులు వెదజల్లితే సరిపోదు, స్వచ్ఛమైన సంకల్పమూ ఉండాలని పక్షంరోజులనాడు ప్రధాని మోదీ స్పష్టీకరించారు. తొలినాళ్లనుంచే జల నిర్వహణపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం- స్వచ్ఛ భారత్ (పట్టణ) మిషన్‌లో భాగంగా మల వ్యర్థాలపై దృష్టి సారించిందంటున్నారు. నదీ, దాని ఉపనదుల స్వరూప స్వభావాల్ని అవగతం చేసుకొని దీర్ఘకాలిక సమగ్ర కార్యాచరణతో కాకుండా, పదేపదే విఫలమవుతున్న పంథాలోనే నిధుల్ని వ్యయీకరిస్తూ పోవడంవల్ల ప్రయోజనం ఏముందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. నదిలో నిరంతర ప్రవాహాలకు అవరోధం కలిగించే ఎలాంటి ప్రాజెక్టుల్నీ చేపట్టకపోవడమే అత్యంత కీలకాంశమని యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఐటీ కన్సార్షియం నివేదిక స్పష్టీకరించింది. గంగానది ఎగువన నిర్మిస్తున్న నాలుగు ఆనకట్టల నిర్మాణాన్ని ఆపకుండా నది పునరుజ్జీవం ఎలా సాధ్యమన్న ప్రశ్నలూ వినవస్తున్నాయి. నదుల పరిరక్షణను ప్రభుత్వాల పథకంగా కాదు, ప్రజా అక్షౌహిణుల బాధ్యతగా అమల్లోకి తీసుకువచ్చి, కూర్చున్న కొమ్మను తెగనరుక్కునే వివేక భ్రష్టత్వాన్ని సర్కార్లు, సమాజం వదులుకోవాలి. అప్పుడే సుజలాలతో దేశం సుఫలమవుతుంది!

స్వామి శరణం... ఎందుకీ రణం!



కె.రామకోటేశ్వరరావు

శబరిమల ఆలయ సమస్య చాలా సంక్లిష్టంగా మారింది. రాజకీయంగా బద్ధవిరోధులైన కాంగ్రెస్, భాజపా ఒక వైపు; దేశ రాజకీయాల్లో కాంగ్రెసుకు కాస్తో కూస్తో సన్నిహితంగా ఉండే సీపీఐ(ఎం), సీపీఐ రెండోవైపు మోహరించాయి. ఈ రాజకీయ సమీకరణలను గమనిస్తేనే సమస్య ఎంత జటిలంగా మారిందో బోధపడుతుంది. కేరళ సమాజం గురించి, దాని ప్రత్యేకత గురించి స్థూలంగా తరచిచూస్తే ఈ సమస్య పూర్వాపరాలు మరింత వివరంగా అర్థమవుతాయి.

పురాణకాలంలో కేరళ పరశురామ్ భూమిగా ప్రసిద్ధి చెందింది. అశోకుడి కాలం నుంచి ఇది స్వతంత్ర రాజ్యంగా ఉండేది. చేర రాజుల భూమిగా ప్రసిద్ధి చెందింది. క్రీస్తుపూర్వం నుంచి వివిధ దేశాలకు ఈ ప్రాంతంనుంచి సుగంధ ద్రవ్యాలు ఎగుమతి అవుతుండేవి. ప్రసిద్ధ హిందూ అద్వైతవేత్త శంకరాచార్యుల జన్మభూమీ కేరళనే. ఆధునిక చరిత్ర చూస్తే యూదు, క్రైస్తవం, ఇస్లాం మొట్టమొదట భారతభూమిలోకి ప్రవేశించిందీ ఈ గడ్డమీదుగానే! భారతదేశానికి వచ్చిన ఐరోపా వలసవాదులైన పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్, ఆంగ్లేయులు వంటివారందరూ ఈ నేలమీదుగానే దేశంలోకి ప్రవేశించారు. కొన్ని ఆదివాసీ సమాజాలను మినహాయిస్తే- ఇప్పటికీ మాతృస్వామ్య వ్యవస్థ అమలవుతున్న సమాజమిదే. ఆయుర్వేదానికి కార్యభూమి సైతం కేరళ సమాజమే. అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రమూ ఇదే కావడం విశేషం! దేశంలోని మూడు ప్రధాన మతాలు గణనీయంగా ఉన్న రాష్ట్రమూ కేరళే. మోప్లా తిరుగుబాటు సందర్భాన్ని మినహాయిస్తే- మత ఘర్షణలు లేని సామరస్యంగా కొనసాగిన సమాజంగా ఈ రాష్ట్రం ప్రఖ్యాతి గాంచింది. హేతువాదానికీ ప్రధాన భూమికగా నిలిచిందీ ఇక్కడి సమాజమేనని మరచిపోరాదు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా తొలి కమ్యూనిస్టు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికైనది సైతం ఈ రాష్ట్రంలోనే! మరోవంక హిందూ సమాజంలోనే అత్యంత నిష్ఠతో ఆచార, సంప్రదాయాలు పాటించే వర్గమూ ఇక్కడే ఉంది. ప్రముఖ ఆలయాలైన పద్మనాభస్వామి, గురువాయూర్, శబరిమలలో ఇప్పటికీ ప్రత్యేక వస్త్ర ధారణతోనే ప్రవేశానికి, దర్శనానికి అనుమతిస్తారు. దేవాలయానికి ప్రభుత్వ విరాళం కచ్చితంగా ఇచ్చేటట్లు రాజ్యాంగంలో పొందుపరచిన ఏకైక పద్మనాభస్వామి దేవాలయం ఈ రాష్ట్రంలోనే ఉండటం విశేషం. తిరువన్కూర్ సంస్థానం భారతదేశంలో విలీనమయ్యే సమయంలో ఈ నిబంధనకు ఒప్పుకోవాలని పట్టుపట్టి సాధించుకున్న సంస్థానం ఇక్కడే ఉంది.

ప్రత్యేకతల నిలయం...

శబరిమలకు ఉన్న ప్రత్యేకతలేమిటి? పద్మనాభస్వామి ఆలయం, గురువాయూర్ ఆలయంలా ఈ గుడి ప్రజల మధ్య లేదు, అడవిలో ఉంది! అక్కడికి చేరుకోవడమూ కష్టమైన పనే. ఇక స్వామి అయ్యప్ప బ్రహ్మచర్యం చుట్టూ అల్లుకున్న కథ ఎన్నో శతాబ్దాలుగా భక్తుల గుండెల్లో గూడుకట్టుకుని ఉంది. 41 రోజుల దీక్ష దాని చుట్టూ ముడివడి ఉంది. ఈ దీక్షబూనినవారు నిష్ఠగా బ్రహ్మచర్యంతో ఉంటారు. వారి జీవన విధానమూ చాలా కఠినంగా ఉంటుంది. హేతువాద దృక్పథంతో పరికిస్తే ఈ విషయం అంత హేతుబద్ధంగా కనిపించకపోవచ్చు కానీ- అది భక్తుల మతవిశ్వాసాలకు సంబంధించినది. ఈ కఠిన నిబంధనలపై వారికి అత్యంత విశ్వాసం ఉంది అన్న విషయం విస్మరించరానిది. హిందూ దేవాలయాల్లో భక్తులు ఇంత నిష్ఠతో ఉండటం శబరిమల దేవాలయం ప్రత్యేకతగా చెప్పొచ్చు. సహజంగా స్వామీజీలు కఠిన నిబంధనలు పాటిస్తారు. కానీ, ఇక్కడ దేవాలయానికి వెళ్ళే భక్తులందరూ ఇంత నిష్ఠగా ఉండటం అరుదైన విషయం. మొత్తం సమస్యను ఈ నేపథ్యంలో చూడగలిగినప్పుడే విషయ తీవ్రతకు కారణాలు అర్థమవుతాయి.


ఇక ప్రస్తుత సమస్యలోకి వెళదాం. శబరిమల ఆలయంలోకి మహిళల

శబరిమలలో మహిళల ప్రవేశం

నిషేధంపై స్త్రీవాదులు, అభ్యుదయవాదులు చాలాకాలంగా చర్చిస్తూనే ఉన్నారు. మహిళలపై ఈ విచక్షణ తగదని వాదిస్తూ వచ్చారు. పర్యవసానంగా దేశంలోని అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, వారికి అనుకూలంగా తీర్పు రావడం తెలిసిందే. సహజంగా అంతకుముందు ఎన్ని విభేదాలున్నా ఒకసారి సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తరవాత అందరూ దానికి బద్ధులై ఉంటారు. ఈ నేపథ్యంలోనే భాజపా, కాంగ్రెస్ సహా అన్ని పార్టీలూ తీర్పును స్వాగతించాయి. అదీగాక అంతకుముందు షిరిడీ సమీపంలోని శని సింగణాపూర్‌లో మహిళల ఆలయ ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని చొరవ తీసుకొని భాజపా ప్రభుత్వమే ఎత్తివేయడం అందరికీ తెలిసిందే. కోర్టు తీర్పుతో శబరిమల సమస్య సమసిపోయిందనే అందరూ భావించారు. కానీ, ఆశ్చర్యంగా సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా భక్తులే ఆందోళన ప్రారంభించారు. ప్రస్తుత సీపీఐ(ఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తున్నట్లుగా ఈ ఉద్యమం భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ మొదలు పెట్టింది కాదు. భక్తుల ఆందోళన ఆరంభమైన తరవాత భాజపా, ఆర్‌ఎస్‌ఎస్, కాంగ్రెస్ తమ వైఖరి మార్చుకొన్నాయి. ఆందోళన చేస్తున్న భక్తుల తరఫున అవి నిలబడ్డాయి.

సంస్కరణలకు ఆలవాలం

కేరళ సమాజం మొదటి నుంచి చలనశీలంగా ఉంది. అన్ని మతాలూ సామరస్యంగా మెలగడం మొదలు- ఎన్నో సామాజిక సంస్కరణలకు ఈ రాష్ట్రం ఆలవాలంగా ఉంది. 19వ శతాబ్దంనాటి స్త్రీ ఉపరిభాగ వస్త్రధారణ ఉద్యమంలోనూ, శ్రీ నారాయణగురు ప్రారంభించిన నిమ్న వర్గాలకు దేవాలయ ప్రవేశ ఉద్యమంలోనూ ప్రజాబాహుళ్యంలో



శ్రీ నారాయణగురు

చొరవగా ముందుండి నడిచింది. మతాలతో సంబంధం లేకుండా మలయాళీ సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడ్డారు. అక్షరాస్యత ఉద్యమంలోనూ అక్కడి సమాజం మొత్తం ఒక్కటై దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇన్ని ప్రత్యేకతలున్న సమాజం శబరిమల విషయంలో విభిన్నంగా ప్రతిస్పందించడానికి కారణాలు ఆసక్తికరం!

అడ్డంపెట్టుకొని పథకం ప్రకారం ప్రభుత్వం రహస్యంగా మహిళలను ఆలయ ప్రవేశం చేయించడం సమర్థనీయంగా లేదు. ఈ వైఖరిని భాజపాతో సహా కాంగ్రెస్ సైతం తప్పుపట్టింది. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి సైతం ఆలయంలోకి మహిళా ప్రవేశాన్ని సమర్థిస్తూనే, అదంత రహస్యంగా జరగాల్సిన వ్యవహారం కాదని ఓ ముఖాముఖిలో వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వేరు, పార్టీ వేరనే విషయాన్నీ ప్రభుత్వం మరచిపోయింది. పార్టీపరంగా మహిళల ప్రవేశంపై నిర్దిష్ట అభిప్రాయం ఉండటం దాని హక్కు. కానీ ప్రభుత్వపరంగా తీర్పు అమలు చేసేటప్పుడు చాలా సున్నితంగా వ్యవహరించి ఉండాల్సింది. ఏదో విధంగా ఆ తీర్పును అమలు చేయాలని తాపత్రయపడే బదులు సంబంధితులతో సంప్రతింపులు జరిపి సామరస్య పరిష్కారం కోసం ప్రయత్నించి ఉంటే బావుండేది. ప్రయత్నించినా వాళ్లు సహకరించలేదని చెప్పొచ్చు. అందుకు కొంత సమయం పట్టినా సహనంతో వేచి ఉండాల్సింది. శనిసింగణాపూర్లోనూ సమస్య ఒక్కరోజులో పరిష్కారం కాలేదన్న విషయాన్ని గుర్తించాలి.

భక్తుల చైతన్యంతోనే మార్పు

హిందూ ధర్మం మిగతా మతాల్లాగా ఒక సూత్రం మీదో, ఒక పవిత్ర గ్రంథం మీదో ఆధారపడి లేదు. వివిధ కాలాల్లో, వివిధ సందర్భాల్లో అక్కడున్న పరిస్థితులను బట్టి సంప్రదాయాలు, విశ్వాసాలు చోటుచేసుకున్నాయి. కొన్ని దేవాలయాల్లో మహిళలే దేవుళ్లు. కొన్ని ప్రాంతాల్లో పురుషులకు, మరి కొన్ని ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం నిషిద్ధం. శబరిమల దేవాలయం ప్రత్యేక ఆచారంతో ఎన్నో శతాబ్దాల నుంచి కొనసాగుతోంది. దాన్ని మార్చాలంటే కేవలం చట్టాలు, కోర్టు తీర్పులతోనే కాకుండా భక్తులను చైతన్యపరచి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, సామాజిక సంస్థలపై ఉంది. దీనిని కేవలం పౌర హక్కుల సమస్యగానే చూడకుండా ఉండాల్సింది. ఇది అభ్యుదయవాదులకు, తిరోగమనవాదులకు మధ్యకన్నా భక్తులకు, హేతువాదులకు మధ్య ఘర్షణగా మారిందని చెప్పొచ్చు. ఇది ప్రభుత్వాన్ని నడిపే సీపీఐ(ఎం)కూ మేలుచేసేది కాదు. దానివల్ల ప్రజల్లో వ్యతిరేకతను కొని తెచ్చుకున్నట్లవుతుంది. ఎప్పుడూ అభ్యుదయ భావాలతో ఉండే కేరళ సమాజం మొట్టమొదటిసారి విభజనకు గురైందని చెప్పొచ్చు. వస్తున్న వార్తల్ని బట్టి బ్రాహ్మణులు, నాయర్లు భాజపా గొడుగు కిందకు చేరారని తెలుస్తోంది. నాయర్లు మొట్టమొదటిసారి ఈ విధంగా మారడానికి ప్రభుత్వ దుందుడుకు చర్యలే కారణమన్న అభిప్రాయం ఉంది. అదే సమయంలో భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ హింసాత్మక వైఖరీ గర్హనీయం. ప్రభుత్వ చర్యపై ఆగ్రహం పేరుతో బస్సులు తగలబెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం సభ్య సమాజం సిగ్గుపడే చర్య. ఘర్షణాత్మక వైఖరిని విడనాడి సరైన పరిష్కార మార్గం కోసం ప్రయత్నించడం ఇరుపక్షాల గురుతర బాధ్యత!

భాజపా, ఆర్‌ఎస్‌ఎస్‌లు మరో అడుగు ముందుకేసి భక్తుల ఆందోళనకు నాయకత్వం వహించాయి. శబరిమల కొండ దిగువ భాగాన పెద్దయెత్తున నిరసన ప్రదర్శనలతో మహిళలు ఎవరైనా ఆలయ ప్రవేశానికి ప్రయత్నిస్తే అడ్డుకున్నారు. ఇది చివరకు శబరిమల కర్మ సమితికి స్త్రీ వాదులు, అభ్యుదయవాదులకు మధ్య ఘర్షణగా మారింది. ఇంతవరకు ఇది భావోద్రేకాలు, విశ్వాసాలకు మధ్య ఘర్షణగానే ఉంది. కానీ ఉన్నట్లుండి రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలనే పట్టుదలతో పావులు కదిపింది. అందుకు పకడ్బందీ వ్యూహాన్నీ అమలు చేసింది. మహిళలను రహస్యంగా ఉంచి, అర్ధరాత్రి పూట దేవాలయానికి పోలీసుల రక్షణతో వేరేమార్గంలో తీసుకెళ్లి దర్శనం చేయించింది. అది భక్తుల మనోభావాల్ని, విశ్వాసాలను దెబ్బ తీసిందనే చెప్పాలి. హేతుబద్ధంగా ఆలోచిస్తే భక్తుల వైఖరి ఎంతవరకు సరైనదన్న విషయాన్ని పక్కనపెడితే- తీర్పును



(రచయిత- సామాజిక విశ్లేషకులు)

హామీల జోలె

'హరియను రెండక్షరములు, హరియించును పాపమంత' అని భక్తులు మనసారా విశ్వసిస్తారు. మరి హామీ అను రెండక్షరాలు గతంలో ప్రజల విషయంలో చేసిన పాపాలన్నింటినీ హరిస్తాయని ఓటరు భక్తులయిన రాజకీయ నాయకుల అఖండ విశ్వాసం!

లెక్కలేనన్ని హామీలతో ఎన్నికల ప్రణాళికలను తయారుచేయడం ఆనవాయితీ. ఆహా ఓహో అనిపించేట్టు ఎన్నికల ముందు హామీలను కురిపించడం, ఎన్నికలయ్యాక తుంగలోకి తొక్కడమూ ఆనవాయితీయే. చిత్రమేమిటంటే పార్టీలు ఎన్ని హామీలయినా ఇస్తాయిగానీ ఆ హామీలన్నీ కచ్చితంగా అమలు పరుస్తామన్న ఒక్క హామీని మాత్రం ఇవ్వవు. పొరపాటున ఇచ్చినా నిలబెట్టుకోవు.

తాము ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం దగ్గర తగినన్ని సొమ్ములు లేవని చెప్పిన రాజకీయపార్టీలెన్నో స్వతంత్ర భారతంలో రొమ్ము విరుచుకు తిరుగుతాయి. ఎన్నికలముందు జనభజన, ఎన్నికలయ్యాక ఖజానా భజన. కల్యాణం కాస్తా పూర్తయ్యాక అల్లుడికే విలువ లేనప్పుడు, లోక కల్యాణం పూర్తయ్యాక ఓటరుకు మాత్రం విలువ ఏముంటుంది?

కలల్లోనూ, కళ్లలోనూ అదిగో ఇదిగో అని ఊరించే అందలం ఎన్ని (మాయ) మాటలైనా చెప్పిస్తుంది. ఎన్ని హామీలయినా ఇప్పిస్తుంది. 'ప్రజల వద్దకే పాలన' అనే మాటొకటుంది. దాని తాతలాంటిది ఇప్పుడు వచ్చేసింది. అదే 'ప్రజల వద్దకే హామీలు'! 'మీకేం హామీలు కావాలో మీరే చెప్పండి' అని నాయకులు అడుగుతున్నారు. అన్ని దానాల్లోకీ అన్నదానం గొప్పదంటారుకానీ దానికన్నా ఎన్నికల వాగ్దానం గొప్పది. అన్నదానం ఒక్కపూట కడుపు నింపితే, ఎన్నికల వాగ్దానం అయిదేళ్లపాటు కడుపు నింపుతుంది. అది ఓటర్లకా? నాయకులకా? అన్న చర్చా సాగుతోంది.

ఓటర్ల సంగతి ఏమయినా నాయకులకు న్యాయం జరగడం మాత్రం ఖాయం! ముందుండి జనాన్ని నడిపించే నాయకులు ఇందులోనూ ముందుంటే తప్పేముందసలు?

ఎన్నికల భారతంలో జనానికి తొలిసారిగా హామీల రుచి చూపించిన కాంగ్రెస్ పార్టీ త్వరలో లోక్‌సభ ఎన్నికల్లో తన పంథా కాస్త మార్చుకుని అరచేతిలో స్వర్గం చూపించే హామీల కోసం జనం మీదనే ఆధారపడుతోంది. 'చెప్పేది మీరు... చేసేది మేము' అంటున్నారు 'చెప్పండయా మీరు చెప్పండయా! దయచేసి మీ మనస్సు విప్పండయా' అని జనాన్నే కోరుతోంది. ఎన్నికలకు సన్నద్ధం కావడంలో హామీలకు రూపకల్పన చేయడం కూడా ముఖ్యమైందే కదా! పార్టీలు వేరైనా ఓటరొక్కడే కాబట్టి అతణ్ని ప్రసన్నం చేసుకోవడానికి ఏమేమి కావాలో చెప్పండని అడుగుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళిక సంఘం అధ్యక్షుడు చిదంబరం ఎన్నికల ప్రణాళికకు జనం నుంచి హామీలు



అడగడంలో చొరవ చూపించారు. ఆ హామీలు ఎలా ఉండాలి? 'రోగి పాలే కోరాడు, వైద్యుడూ పాలే ఇచ్చాడు' అన్నట్లు ఉండాలి. ఈ విషయంలో అశోక చక్రవర్తి అదృష్టవంతుడు. 'అశోకుడు రోడ్లు వేయించెను, చెట్లు నాటించెను' అని చెప్పుకోవడమే తప్ప అంతకుముందు అశోకుడు ఏమేమి హామీలిచ్చాడో ఎవ్వరూ చెప్పరు.

ఏ హామీలు సూచిస్తే కాంగ్రెస్ పార్టీకి రుచిస్తుందో, ఎన్నికల ప్రణాళికలో ఏమేం చోటుచేసుకుంటాయో జనం ఆలోచించుకోవాలి. శంఖంలో పోస్తే గానీ తీర్థం కాదు... మ్యానిఫెస్టో శంఖంలో వేస్తేగానీ హామీకి అర్థం రాదు. కాంగ్రెస్ పెద్దల్లాగా ఆలోచించి హామీలు సూచిస్తే ఎలా ఉంటుందో... మచ్చుకు కొన్ని...

✦ వంశ పారంపర్యం దేశానికి అవసరం... 'అత్యవసరం'! వంశ పారంపర్యమంటే భవిష్యత్తులో దేశానికి పనికొచ్చే నాయకులను అందించే చక్కటి వ్యవస్థ. అందువల్ల నాయకుల పిల్లలకు టిక్కెట్లు ఇచ్చి గెలిపించి, వారికి గొప్ప గొప్ప పదవులిస్తాం. అటువంటి కుటుంబాలను గుర్తించి రాజభరణాల్లాంటి పింఛనులిస్తాం.

✦ నాయకుల ఇళ్లలో ఎవ్వరూ నిరుద్యోగులు లేకుండా చేస్తాం. ఎన్నికల్లో గెలవలేని వాళ్లందరికీ నామినేటెడ్ పదవులిస్తాం.

✦ ప్రధాని మోదీ చేసిన ముఖ్యమైన నియామకాలన్నీ రద్దు చేసేస్తాం. ఆయన తొలగించిన కీలకమైన వ్యక్తులను తిరిగి నియమిస్తాం. ఉదా... ఇటీవల తొలగించిన కేంద్ర దర్యాప్తు సంస్థ (సి.బి.ఐ.) డైరెక్టర్ అలోక్‌వర్మను తిరిగి అదే హోదాలో కూర్చోబెడతాం.

✦ కాంగ్రెస్ మార్కు రాజకీయ నాయకులను తయారు చేయడానికి పాఠశాలలను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇస్తాం!

✦ రాజకీయాలను 'కుటీర పరిశ్రమ'గా లేదా కుటుంబ పరిశ్రమగా గుర్తిస్తాం.

✦ 2014కు ముందు కుంభకోణాల్లో నిందితులైన కాంగ్రెస్ నాయకులు, ఆ పార్టీ మిత్రపక్షాల నాయకుల కోసం కేసుల మాఫీ పథకం ప్రవేశపెడతాం. ఈ కేసుల వల్ల ఇప్పటికే నష్టపోయినవారికి వడ్డీ లేని రుణాలు అందిస్తాం.

✦ కాంగ్రెస్ గుర్తు 'చెయ్యి' కాబట్టి చేతివాటం ప్రదర్శించే వారిపై ఎటువంటి కేసులు లేకుండా చూస్తాం.

✦ చేతి పార్టీ కార్యకర్తలందరినీ 'హస్త'కళాకారులుగా గుర్తించి వారి కళానైపుణ్యం పెంచడానికి జీతభత్యాలు ఇస్తాం.

✦ బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వారికి, మరిన్ని రుణాలిచ్చి పాతవి తీర్చేట్లు చేస్తాం. బ్యాంకు రుణాలు తీర్చక విదేశాలకు చెక్కేసినవారికి విదేశీ పౌరసత్వం దక్కడానికి తోడ్పడతాం.

'ఓటునే ప్రేమించుమన్నా సీటులన్నీ పెంచుమన్నా' అని పాడుకుంటూ ఆలోచిస్తుంటే సరికొత్త హామీలు మరెన్నో తన్నుకు వస్తాయి. ప్రజల మధ్య 'హామీల పోటీ' కూడా పెట్టవచ్చు. ఏ హామీలో ఎలాంటి గెలుపు పొంచి ఉందో ఎవరు ఊహించగలరు?

– శంభు

ఈనాడు లేఖలు

రిజర్వేషన్లు హర్షణీయం

అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అన్నివిధాలా స్వాగతించదగ్గది. విస్మరణకు గురైన ఈ వర్గాలను ఇప్పటికైనా గుర్తించడం, వారికి ఉపశమనం కలిగించేలా నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ఈ బిల్లు కొద్దిరోజుల్లోనే పార్లమెంట్ ఉభయ సభలు, రాష్ట్రపతి ఆమోదం పొందడం మంచి పరిణామం. ఎంతోకాలంగా ఈ వర్గాల వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వపరంగా ఎటువంటి చేయూత లేక నైరాశ్యంలో ఉన్నారు. ఫలితంగా వారు అన్ని రంగాల్లో వెనకబడిపోయారు. ఇప్పటికైనా వారికి మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయడం అభినందనీయం.

- పి. ఆర్. తల్లాప్రగడ, మదీనాగూడ, హైదరాబాద్

భృతి కాదు... భవిత కావాలి

దేశ జనాభాలో అధిక శాతం మంది యువకులే. దేశ భవిత వారి మీదే ఆధారపడి ఉంది. వారికి సంబంధించి ప్రభుత్వాలు నిరుద్యోగ భృతి వంటి మాటలతో కాలక్షేపం చేయకుండా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. యువతలో నిబిడీకృతమైన ఉన్న శక్తియుక్తులను వెలికితీయాలి. వాటికి పదునుబెట్టాలి. తద్వారా సవాళ్లను ఎదుర్కొనేందుకు యువకులను సన్నద్ధులను చేయాలి. వారికి అవసరమైన చేయూత అందించాలి. అప్పుడే తమకున్న నైపుణ్యాలతో ఉపాధిని పొందగలుగుతారు. అంతేతప్ప నిరుద్యోగ భృతి వంటి హామీలు ఎలాంటి మేలు చేయవన్న విషయాన్ని పాలకులు గుర్తించాలి.


- మూర్తి వెంకటేశ్వర్లు, విశ్వనాథపురం, మైదుకూరు, కడప జిల్లా

హరితోషణం

భగవంతుడు భక్తిసులభుడు. అన్ని యోగాలు పరిపూర్ణం కావటం భక్తి రసంతోనే. భక్తి పరాకాష్ఠ చెందినప్పుడే జ్ఞానం ఆ పరమాత్మ దివ్యమంగళ విగ్రహంగా కట్టెదుట సాక్షాత్కరిస్తుంది. మరో ధ్యాస లేకుండా నాయందే రతులై నిరతం సేవించేవారికి వశమవుతానని కృష్ణపరమాత్మ గీతోపదేశం చేశాడు అర్జునుడికి. అలాంటి భక్తులకు యోగక్షేమాలతోపాటు ముక్తిని ప్రసాదిస్తాను. అందుకు చెల్లించదగ్గ ఒకే ఒక మూల్యం కేవలం శరణాగతి అన్నాడు. భాగవతులు చేయవలసిందేమిటో తొమ్మిదో అధ్యాయం రాజ విద్యారాజ గుహ్యాయోగంలోని ఇరవైఏడో శ్లోకం స్పష్టంగా తెలియజేస్తున్నది.

'నీవు చేసేపని, తినే ఆహారం హోమం చేసే హవ్యం, ఇచ్చేదానం ఆచరించే తపస్సు నాకు సమర్పించు'. అలా నివేదించటమే శరణాగతి. తపస్వి, దాత, యశస్వి, మనస్వి, మంత్రవిదుడు, వేద పరాయణుడు... ఎవరైనా తమ కళలను స్వామికి సమర్పించనిదే సత్ఫలితం అందుకోజాలరు. అలా సమర్పించి, చేపట్టిన కర్మలు సత్ఫలితంతో పాటు శ్రీహరిని సంతోషపరచేవై సంసిద్ధిని కలిగిఉంటాయి అంటున్నది శ్రీ భాగవతం. అన్ని కర్మలు, అన్ని ధర్మాలు శరణాగతికి సాటి రావన్నమాట అక్షర సత్యం. ఆ సత్య చైతన్యమే సాకారమై కనుల పండువ చేస్తుంది శరణాగతుడికి. శరణాగతికి ఆ శ్రీహరి సంతోషిస్తాడు. ఆ సంతోషమే హరితోషణం.

కర్మయోగం ఆశ్రమ ధర్మం, జ్ఞానయోగం సన్యాస ధర్మం, ధ్యానయోగం యతిధర్మం. వీటికి మించిన ధర్మం శరణాగతి. అదే బ్రహ్మగతి. హరితోషణానికి (సంతోషానికి) సంగతి (చేరిక). భక్తులను తన దారిన చేర్చుకోవటానికి ఆ భక్తవత్సలుడు తొమ్మిది మార్గాలను, భక్తులు సులభంగా చేరేలా సృష్టించాడు. గమకాలు వేరైనా చేరవలసిన గమ్యం ఒక్కటే. భక్తి ద్వారా సిద్ధించిన శక్తిని మాత్రం పాపకార్యాలకు ఉపయోగించకూడదు. హిరణ్యకశిపుడు, రావణుడు మొదలైన దానవులందరూ అలాంటి దుర్బుద్ధితో భగవంతుణ్ని సేవించి వరాలు పొందారు. ఆ వరాలు చివరికి వారి పాలిట మృత్యు దేవతలుగా మారాయి.



అంతర్యామి

భగవంతుడి అంతరంగాన్ని బాగా తెలుసుకున్న ప్రహ్లాద కుమారుడు చెప్పిన కీర్తనం, స్మరణం, ఈ క్షణం, వందనం, శ్రవణం, అర్చనం మొదలైన ప్రక్రియల వల్ల తక్షణం కల్మషాలను పోగొట్టుకోవచ్చు. శ్రద్ధగా ఆ పవిత్రమైన నామధ్యేయాన్ని వింటే చాలు- అన్ని శుభాలూ కలుగుతాయి. పరమాత్మ నాస్తికులకు దూరంగా, భౌతిక ఆధ్యాత్మిక లోకాల్లో విహరిస్తూ, తన స్వీయ ధామం (వైకుంఠం)లో సర్వదా ఆనందంగా విరాజిల్లుతాడు. ఆయన దివ్యశక్తి సాటిలేనిది, అంతు ఎరుగనిది- అంటున్నది భాగవతం.

కాలం, కర్మ, స్వభావాల వల్ల భిన్నభిన్న రూపాలు, ఉపాధులు, ఆలోచనలు, ప్రపంచంలో మనుషుల మధ్య కనిపిస్తున్నాయి. ఇది మాయా ప్రభావమే అయినా భిన్నత్వం అంగీకారయోగ్యమే. ధర్మాన్ని నిలబెట్టడానికి, అధర్మాన్ని నియంత్రించటానికి, స్వయం భగవానుడే బహురూపిగా అవతరిస్తూ ఉన్నాడు. భిన్న కర్మలను ఆశ్రయించటం వల్ల మనుషులు మహత్తత్త్వం, భౌతికత్వానికి బానిసత్వం నెరపక తప్పదు. పాపపుణ్యాలు చేసి వాటికి తగిన ఫలితాలు అందుకొనకా తప్పదు. ఈ నరతత్త్వానికి పరమ ఔషధం నారాయణ శబ్ద శ్రవణమే. నిరామయమైన శ్రీహరి నామస్మరణమనే అమృతం సేవించమని కులశేఖరులవారు చెప్పారు. భవరోగానికి పరమ ఔషధం భగవన్నామ స్మరణమేనన్న భాగవతతత్త్వం ఈనాటిది కాదు. అది పరాపరతత్త్వాలకు అతీతమైనది. క్షరాక్షరులకు పైనున్న పురుషోత్తమ తత్త్వాన్ని గీతోపనిషత్తు స్పష్టం చేస్తున్నది. హరితోషణమే హరిశరణాతి కోరిన వారికి పరాంగతి ప్రసాదిస్తుంది.

– ఉప్పు రాఘవేంద్రరావు

ప్రత్యేక హోదానే ఎన్నికల అజెండా

ముందే చెప్పానన్న సినీనటుడు శివాజీ

నాదెండ్ల, న్యూస్‌టుడే: ప్రతి రాజకీయ పార్టీకి 2019 ఎన్నికల్లో ప్రత్యేక హోదానే ప్రధాన అజెండా అవుతుందని తాను ఉద్యమం ఆరంభించినప్పుడే చెప్పానని సినీనటుడు, ప్రత్యేక హోదా ఉద్యమకారుడు శివాజీ గుర్తు చేశారు. గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు జడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలకు సంబంధం లేకుండా స్వేచ్ఛగా బతుకుతున్న ప్రజల మధ్య స్వార్థ ప్రయోజనాల కోసం విభజన తీసుకొచ్చారన్నారు. సొంత ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు భవిష్యత్తు తరాలకు ప్రత్యేక హోదా సంజీవని వంటిదని చెప్పారు. రాష్ట్రంలో కుల సంఘాలు విచ్చలవిడిగా ఏర్పడి అభివృద్ధికి అడ్డుపడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని, పని చేసే వారికి అధికారం అప్పగించాలన్నారు.

సభ్యత్వ నమోదులో సరికొత్త రికార్డు

- 65.29 లక్షలు దాటిన తెదేపా సభ్యులు
- అగ్రస్థానంలో గుంటూరు జిల్లా
- నియోజకవర్గాల్లో పాలకొల్లు ప్రథమం
- పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ వెల్లడి



ఈనాడు, అమరావతి: సభ్యత్వ నమోదులో తెదేపా రికార్డులు తిరగరాస్తోందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. 2016-18లో 64.42 లక్షల మంది సభ్యత్వం స్వీకరించగా.. 2018-20కి సంబంధించి ఈ సంఖ్య 65.29 లక్షలు దాటిందని ఆయన వివరించారు. సభ్యత్వ నమోదులో గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాలు తొలి అయిదు స్థానాల్లో నిలిచాయని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా చూస్తే పాలకొల్లు, కుప్పం, ఉదయగిరి, ఆత్మకూరు, మైలవరం తొలి అయిదు స్థానాలను దక్కించుకున్నాయని వివరించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రెండు నెలలుగా అవిశ్రాంతంగా పనిచేసిన కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. కార్యకర్తల సమస్యలు, సలహాలు స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కాల్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ తరఫున పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. పార్టీ సభ్యత్వంగా చెల్లించే రూ.100 మొత్తానికి మరికొంత పార్టీ సంక్షేమ నిధి నుంచి జమ చేసి అందరికీ ప్రమాదబీమా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన 3,031 మంది కార్యకర్తల కుటుంబాలకు బీమా కింద రూ. 60.62 కోట్లు, గాయపడిన 89 మంది వైద్యం కోసం రూ.52.80 లక్షల సాయం అందించినట్లు వివరించారు. 815 మంది విద్యార్థుల చదువులకు రూ.2.28 కోట్లు అందజేయడంతో పాటు 365 కొత్త జంటలకు పట్టువస్త్రాలు, కానుకలు ఇచ్చినట్లు తెలిపారు.

సీపీఎస్ రద్దు కోరుతూ 31న చలో అసెంబ్లీ

విజయవాడ, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను పథకం(సీపీఎస్) రద్దు కోరుతూ ఈ నెల 31న చలో అసెంబ్లీ చేపట్టాలని నిర్ణయించామని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.రామాంజనేయుల యాదవ్ తెలిపారు. విజయవాడలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశానంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసే అంశంపై ఈ నెల 26 వరకు వేచి చూస్తామన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలే ఏకైక లక్ష్యంగా ఈ నెల 31న చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నామన్నారు.

పఠనంతోనే సమాజాభివృద్ధి సాధ్యం

- మంత్రి దేవినేని ఉమా
- ముగిసిన పుస్తక మహోత్సవం



ఈనాడు, అమరావతి: పుస్తక పఠనంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందనే వాస్తవాన్ని అందరూ గుర్తించాలని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడ 30వ పుస్తక మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నతనం నుంచి పిల్లలకు పుస్తకాలను దగ్గర చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉందన్నారు. పుస్తకాలను తరచూ కొనివ్వడం.. పిల్లలతోనూ కొనిపించడం చేయాలని సూచించారు. సందర్భాన్ని బట్టి పుస్తకాలనే బహుమతులుగా ఇస్తూ ఉండాలన్నారు. కానీ. . చాలా మంది ఈ విషయాన్ని విస్మరిస్తున్నారని, పుస్తకాలను చదివే తీరిక ఎవరికీ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పరిణామం కాదని, పుస్తక పఠనంపై ఆసక్తిని చిన్నతనం నుంచే పెంచాలని సూచించారు.

★ విజయవాడలోని స్వరాజ్యమైదానంలో జనవరి 1 నుంచి 13 వరకూ పుస్తక ప్రదర్శన జరిగింది. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్), రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్తంగా ప్రదర్శనను ఏర్పాటు చేశాయి. ఏటా 11 రోజులు జరిగే పుస్తక మహోత్సవం ఈ ఏడాది మరో రెండు రోజులు అదనంగా కొనసాగింది. జనవరి 1న గాంధీజీ మనవడు రాజమోహన్‌గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. గత 13 రోజులుగా నిత్యం మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 9 వరకూ ప్రదర్శన కొనసాగింది. దేశంలోని అన్ని ప్రముఖ ప్రచురణ సంస్థలూ, విక్రయదారులూ తరలివచ్చి 290 స్టాళ్లను ఏర్పాటు చేశారు. పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వేదికపై అనేక పుస్తకాల ఆవిష్కరణలు, సాహిత్య సమీక్షలు, సభలను నిర్వహించారు.

గొల్లపాలెంలో గ్యాస్ పైపులైను లీకేజీ

మలికిపురం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లాలోని ఓఎన్జీసీ పైపులైను నుంచి ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గ్యాస్ లీకవ్వడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మలికిపురం మండలం గొల్లపాలెంలోని జీజీఎస్ (గ్రూప్ గేదరింగ్ స్టేషన్)కు సమీపంలోని ఓఎన్జీసీ పైపులైను వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సుమారు 20 మీటర్ల ఎత్తు వరకు గ్యాస్ ఎగజిమ్మింది.





పారా మోటరింగ్ విహారం ★ పర్యాటకుల కోసం సిద్ధం చేసిన హాట్ ఎయిర్ బెలూన్లు

సీతంపేటలో ఘనంగా గగన క్రీడలు

- వైభవంగా ప్రారంభమైన ఏరో స్పోర్ట్స్ ఫెస్ట్

సీతంపేట, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కు(సాహస ఉద్యానవనం)లో ఆదివారం ఏరో స్పోర్ట్స్ ఫెస్ట్-2019 ఘనంగా ప్రారంభమైంది. 13 నుంచి 16వ తేదీ వరకు ఈ వేడుకను నిర్వహించడానికి ఐటీడీఏ, జిల్లా పర్యాటకశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిని జిల్లా కలెక్టరు కె.ధనంజయరెడ్డి ప్రారంభించారు. ఎయిర్‌షోలో పారా మోటరింగ్, పారా సైలింగ్, హాట్ ఎయిర్ బెలూన్లు ఏర్పాటు చేశారు. దిల్లీ నుంచి వచ్చిన 15 మంది నిపుణులైన పైలట్లు, 40 మంది సాంకేతిక సిబ్బంది పర్యాటకులకు సహకరించారు.

మోదీకి పగిలిన కుండలతో స్వాగతం చెప్పాలి

- ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్

గుంటూరువారితోట, న్యూస్‌టుడే: వచ్చే నెలలో రాష్ట్రంలో పర్యటించనున్న ప్రధాని మోదీకి గోబ్యాక్ అని చెప్పాలని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గుంటూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మోదీకి పగిలిన కుండలు, చిట్లిన పాత్రలు, పెట్టిన టోపీలతో స్వాగతం పలుకుతామని అన్నారు. అందరం కలిసి రాష్ట్రానికి న్యాయం చేయాలని ప్రధాని మోదీని కోరతామని పేర్కొన్నారు. రూ. 3,500 కోట్లు ఇచ్చామని, అమరావతిలో ఒక్క ఇటుక కూడా వేయలేదని ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడటం చాలా బాధ కలిగించిందని అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే ఛత్తీస్‌గఢ్ చాలా చిన్న రాష్ట్రం. 20 వేల ఎకరాల భూమిని తీసుకుని, ఆ తరువాత సరిపోదని చెప్పి అదనపు భూమి కోసం వెళ్లిన ఘనత మీ రాష్ట్ర ప్రభుత్వానిది కాదా' అని ప్రశ్నించారు. ఎల్‌కే అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్, ఉమాభారతి ఆంధ్రప్రదేశ్‌పై కొంత సానుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకు రాజ్‌నాథ్‌సింగ్‌ను కలవగా ప్రధాని మోదీతో మాట్లాడాలని సూచించారని వివరించారు. ఏపీకి ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని హామీల అమలుపై ఎక్కడా వ్యతిరేకతను వ్యక్తపర్చలేదని పేర్కొన్నారు.

'అమరావతి పెద్ద భూ కుంభకోణం'

ఈనాడు, దిల్లీ: అమరావతి ప్రపంచంలోనే పెద్ద భూ కుంభకోణమని భాజపా రాష్ట్ర వ్యవహారాల సహ బాధ్యుడు సునీల్ దియోధర్ ఆరోపించారు. దిల్లీలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయాన్ని కమీషన్ల కోసం తన మిత్రులకు అప్పజెప్పారని విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ విమానాశ్రయంలో ప్రతిపక్ష నేతపై దాడిపై ఎన్ఐఏ విచారణ అంటే చంద్రబాబుకు వెన్నులో చలి పుడుతోందన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకి బోయల రిజర్వేషన్ల అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లామని అమిత్ షా 18న కడప, ఫిబ్రవరి 1 విశాఖపట్నంలలో సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు.

భృంగి వాహనంపై పార్వతీ పరమేశ్వరులు



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజు ఆదివారం పార్వతీ పరమేశ్వరులు భృంగి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవ మూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివనామ సంకీర్తనల నడుమ శ్రీగిరి పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం జరిగింది.

గెలుపు కోసం ఐక్యంగా వెళ్లండి: జగన్



నాయకులను పలకరిస్తున్న జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: ఎన్నికల సమయం దగ్గర పడుతోందని, పార్టీ గెలుపు కోసం కలసికట్టుగా వెళ్లాలని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి నేతలకు సూచించారు. కడప జిల్లాలో 3 రోజుల పర్యటనలో భాగంగా పులివెందులలోని తన కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. పులివెందులకు చెందిన తెదేపా నాయకుడు రఘునాథరెడ్డి తన అనుచరులతో వైకాపాలో చేరారు. కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు ఎమ్మెల్యేలు అంజద్ బాషా, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, కడప మేయరు సురేష్ బాబు జగన్‌ను కలిశారు. మరోవైపు 14 నెలల తరువాత పులివెందులకు జగన్ వచ్చారు. ఈ క్రమంలో నియోజకవర్గాల వారీగా వైకాపా అభ్యర్థుల పేర్లను జగన్ వెల్లడిస్తారేమోనన్న ఉత్కంఠ నాయకుల్లో నెలకొంది. కానీ ఆయన ఏ విషయమూ వెల్లడించలేదు. తన బాబాయి, మాజీ మంత్రి వివేకానందరెడ్డితో ఆదివారం తెల్లవారుజామున 2 గంటలపాటు ఆయన సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.

అనుబంధాలకు ప్రతీక సంక్రాంతి

ఈనాడు, అమరావతి: సొంత గ్రామాలతో ప్రజలకు ఉన్న ఆత్మీయత, అనుబంధాలకు ప్రతీక సంక్రాంతి అని జగన్ పేర్కొన్నారు. సంక్రాంతి అంటేనే రైతులు, పల్లెలు గుర్తుకు వస్తాయని, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని, ప్రతి ఇల్లూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

'పళనిస్వామీ.. నువ్వే హంతకుడివి'

తెహల్కా మాజీ మేనేజింగ్ ఎడిటర్ మాథ్యూస్ సంచలన ఆరోపణ



మాథ్యూస్ సామ్యూల్

చెన్నై, న్యూస్‌టుడే: కొడనాడు ఎస్టేట్ బంగ్లాలో దోపిడీ వ్యవహారంతో ముడిపడిన హత్యల వెనుక తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి ఉన్నారంటూ తెహల్కా మాజీ మేనేజింగ్ ఎడిటర్ మాథ్యూస్ శామ్యూల్ సంచలన ఆరోపణలు చేశారు. దిల్లీలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలో పెద్ద విషయం ఒకటి బయటకు రానుందని పేర్కొన్నారు. అది తమిళనాడు ప్రభుత్వానికీ తెలుసన్నారు. 'కొడనాడు' హత్యల్లో ముఖ్యమంత్రి పళనిస్వామిని హంతకుడిగా ఆరోపిస్తున్నానని, దేశ చరిత్రలో తొలిసారి ఓ ముఖ్యమంత్రి హత్య కేసులో చిక్కారని తెలిపారు. ''పళనిస్వామీ.. నువ్వే హంతకుడివి'' అని ఈ సందర్భంగా ఆయన ఆవేశపూరితంగా వ్యాఖ్యానించారు. తాను ఆరోపించిన అందరూ జైలుకు వెళ్లారని, ఒక్కరూ బయటలేరని తెలిపారు. మరోవైపు, కొడనాడు ఎస్టేట్ బంగ్లాలో దోపిడీ, హత్య ఘటనలపై మాథ్యూస్ శామ్యూల్ రూపొందించిన వీడియో డాక్యుమెంటరీ తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే.

'కొడనాడు' వీడియో డాక్యుమెంటరీకి సంబంధించి మాథ్యూస్ శామ్యూల్ సహా ఆరుగురిపై చెన్నైలోని సెంట్రల్ క్రైం బ్రాంచ్ (సీసీబీ)లో అన్నాడీఎంకే సాంకేతిక విభాగం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు విచారణ జరిపేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అందులో సీసీబీ డిప్యూటీ కమిషనర్ సెంథిల్‌కుమార్ నేతృత్వంలోని బృందం మాథ్యూస్ శామ్యూల్‌ను విచారించడానికి దిల్లీ బయలుదేరి వెళ్లినట్లు తెలిసింది. మరొక బృందం కేరళకు వెళ్లినట్లు సమాచారం.

ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ 18న

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 23వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 18న హైదరాబాద్‌లో ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరజ్యోతి ర్యాలీ ఆహ్వాన పత్రికను శనివారం విజయవాడలో ఆవిష్కరించినట్లు అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల అధ్యక్షుడు, తెదేపా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీపతి సతీష్ తెలిపారు. ఆదివారం బేగంపేటలో విలేకరుల సమావేశంలో సతీష్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ అభిమాన సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీపతి రాజేశ్వర్ ప్రారంభించిన అమరజ్యోతి ర్యాలీని ప్రతీ సంవత్సరం కొనసాగిస్తున్నామన్నారు. ఈ నెల 18వ తేదీన బేగంపేట రసూల్‌పురా కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుతుందన్నారు. ర్యాలీని నందమూరి బాలకృష్ణ ప్రారంభిస్తారని, లోకేష్, తెదేపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ తదితరులు హాజరవుతారని చెప్పారు.

అవార్డుల ఘనకీర్తి



కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. రాజధాని నుంచి రెవెన్యూ లోటు దాకా అన్నీ కష్టాలే.. మొత్తం కొత్తగా మొదలు పెట్టాల్సిందే. కార్యాలయాల ఏర్పాటు నుంచి నివాసాల నిర్మాణాల కోసం వేల కోట్ల పెట్టుబడులను సమకూర్చుకోవాల్సి వచ్చింది. కరెంటు కోతలను తట్టుకుని నిలబడాల్సి వచ్చింది. తుపాన్లనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినా పట్టు వదలలేదు. ఒక్కొక్కటిగా సమకూర్చుకుంటూ ఆదాయాన్ని పెంచుకుంటూ రాష్ట్రం ముందుకు సాగింది. క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయిదాకా అందరూ కష్టపడ్డారు. ఫలితాలను చూపించారు. అవార్డులను కొల్లగొట్టారు. ఒకటి కాదు.. రెండు కాదు.. జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి 4 ఏళ్లలో ఏకంగా 667 అవార్డులను సాధించారు. ఇదీ నవ యువ ఆంధ్రప్రదేశ్ ఘనత.

- రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ అవార్డుల పంట
- 4 ఏళ్లలో 667 సొంతం
- పాలనకు, సంస్కరణలకు దక్కిన గౌరవం

ఎందుకొచ్చాయంటే...

- ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో చేపట్టిన సంస్కరణలు.
- వివిధ పథకాలను పౌరులకు చేర్చేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానాలు.
- పౌర సేవల్ని సులభతరం చేయడం.
- ప్రభుత్వ సేవలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం.
- నాణ్యమైన సేవల కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటించడం.
- పాలనాపరంగా నిర్దేశించుకున్న లక్ష్యాల్ని గడువులోగా పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలు.

ఏయే శాఖల్లో ఎలా?

విద్యుత్తు శాఖ: ఇంధన వనరుల పునర్వినియోగం, సామర్థ్యం పెంపు, సంస్కరణలు అమలు.

ఐటీశాఖ: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు జోడించి సత్ఫలితాలు సాధించడం, ఇ-ఆఫీస్, ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టుల రూపకల్పన.

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ: సాంకేతిక విధానాలు, స్థానిక సంస్థలకు అధికార పంపిణీ, జాతీయ ఉపాధి హామీ పథకం అత్యుత్తమ అమలు, పింఛన్ల పంపిణీలో పారదర్శకత.

పురపాలకశాఖ: పారిశుద్ధ్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ పేదలకు గృహ వసతి కల్పన.

ముఖ్యమైనవి

- విద్యుత్తు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని 2016లో ప్రపంచ బ్యాంకు అవార్డు.
- దశాబ్దకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 100శాతం విద్యుదీకరణ కోసం తీసుకున్న చర్యలకు ఐపీపీఏఐ- 2015.
- పింఛన్ల పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేసినందుకు, జాతీయ పింఛను పథకంలో విధానపరమైన చిక్కులు, సమస్యలను పరిష్కరించినందుకు నేషనల్ బెస్ట్ పెన్షన్ సిస్టమ్ బెస్ట్ స్టేట్.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలు అందించడంలో దేశంలోనే అత్యుత్తమ విధానాలు పాటించినందుకు 2017, 2018లో స్కోచ్ గోల్డెన్.
- పాస్‌పోర్టు దరఖాస్తుదారుల పోలీసు విచారణను 2017-18లో సగటున 8 రోజుల వ్యవధిలో పూర్తి చేసినందుకు కేంద్ర విదేశాంగశాఖ నుంచి రాష్ట్ర నిఘా విభాగానికి ద్వితీయ ఉత్తమ పరిశీలనగా ప్రశంస.
- లక్ష మంది అవయవదానానికి అంగీకరించేలా చేసినందుకు మెప్మాకు ఇండియా బుక్ ఆఫ్ అవార్డ్సులో చోటు.
- పోలవరం ప్రాజెక్టుకు సీబీఐపీ-2018 అవార్డు.
- టైటిల్ డీడ్, పట్టాదారు పాస్ పుస్తకాలు 15 నిమిషాల్లోనే అందించినందుకు 2017లో స్కోచ్.
- 2017లో ఇ-పంట కార్యక్రమానికి పీయం పురస్కారం.
- అమరావతి కోసం 33వేల ఎకరాల భూ సమీకరణ చేసినందుకు నేషనల్ ఎక్సలెన్సీ-2017
- కేంద్ర పర్యాటకశాఖ నుంచి 2015-16లో సమగ్ర పర్యాటక అభివృద్ధి ప్రశంస.
- భూగర్భ జలమట్టాల గుర్తింపు, వాతావరణ మార్పుల్ని పసిగట్టి ప్రకృతి విపత్తుల గురించి ముందే హెచ్చరించడంలో ఆర్టీజీఎస్‌కు హిటాచీ పీపుల్స్ అవార్డు.

రాష్ట్ర ప్రభుత్వం సాధించినవి ఇవే

శాఖ	అవార్డుల సంఖ్య
ఇంధన, మౌలిక వసతులు, పెట్టుబడులు	138
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	97
పురపాలక పట్టణాభివృద్ధి	91
వైద్య, ఆరోగ్యం	55
ఐటీ	44
పాఠశాల, వయోజన విద్య	37
జల వనరులు, భూగర్భ జలం	28
సాంఘిక సంక్షేమం	26
యువజన సంక్షేమం, సాంస్కృతికం	20
స్త్రీ, శిశు సంక్షేమం	15
గృహ నిర్మాణం	15
పర్యాటకం	13
భూగర్భ వనరులు	10
పౌర సరఫరాలు	10
రెవెన్యూ	8
రవాణా, రోడ్లు, భవనాలు	9
పరిశ్రమలు	7
వ్యవసాయం, ఉద్యానరంగం	8
ఆర్థిక	5
ఆర్టీజీఎస్	5
పశు సంవర్ధకం	5
గిరిజన సంక్షేమం, అటవీ	6
హోం	3
ప్రణాళిక	2
నైపుణ్యాభివృద్ధి	2
ఇతర (జిల్లాల కలెక్టర్లు, జేసీలు)	8

- ఈనాడు డిజిటల్, అమరావతి



శ్రీశైలం ఘాట్‌లో తప్పిన ప్రమాదం

లోయలోకి జారి నేలను తాకి ఆగిన బస్సు

- అదుపు తప్పి లోయలోకి జారిన మహారాష్ట్ర బస్సు
- 45 మంది యాత్రికులు సురక్షితం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: శ్రీశైలం ఘాట్‌లో పెద్ద ప్రమాదం తప్పింది. మల్లన్నను దర్శించుకునేందుకు వెళుతున్న మహారాష్ట్ర యాత్రికుల బస్సు ప్రకాశం జిల్లా దోర్నాల- శ్రీశైలం ఘాట్‌లోని చిన్నారుట్ల సమీప దెయ్యాల మలుపు వద్ద అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టి లోయలోకి దూసుకెళ్లింది. సగం బస్సు లోయలోకి జారిపోయి నేలను తాకి ఆగిపోవడంతో పెనుముప్పు తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న 43 మంది యాత్రికులు, డ్రైవర్, సహాయకుడు సురక్షితంగా బయటపడ్డారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా పర్లీ ప్రాంతానికి చెందిన వీరు ప్రైవేటు బస్సులో శనివారం రాత్రి కర్నూలు జిల్లాలోని మహానంది ఆలయాన్ని దర్శించుకుని అర్ధరాత్రికి పెద్దదోర్నాలకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం 6.30 సమయంలో పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం బయలుదేరారు. ప్రమాదంపై పెద్దదోర్నాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌కు జగన్ కేసు నిందితుడు

- తరలించిన ఎన్ఐఏ అధికారులు
- విశాఖలో గంటపాటు విచారణ



విశాఖ విమానాశ్రయానికి శ్రీనివాసరావును తీసుకువస్తున్న ఎన్ఐఏ అధికారులు

మధురవాడ, కొమ్మాది, న్యూస్‌టుడే, ఈనాడు, విశాఖపట్నం: జగన్‌పై దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఎన్ఐఏ అధికారులు ఆదివారం విశాఖపట్నం నుంచి హైదరాబాద్ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ సమీపంలోని తమ కార్యాలయానికి తరలించారు. అంతకుముందు విజయవాడ నుంచి విశాఖకు తీసుకొచ్చి ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో గంటపాటు విచారించారు. నిందితుడి తరపు న్యాయవాది సలీమ్ సమక్షంలోనే ఆదివారం మధ్యాహ్నం శ్రీనివాసరావును విచారించారు. ఏమి జరిగిందో భయపడకుండా చెప్పాలంటూ పదేపదే అడిగారు. తానొక్కడినే నేరానికి పాల్పడ్డానని, తన వెనుక ఎవరూ లేరని స్పష్టంగా అతడు సమాధానమిచ్చాడు. అనంతరం న్యాయవాది సలీమ్‌తోనూ అధికారులు మాట్లాడారు. తాము విచారణ నిమిత్తం నిందితుడిని దిల్లీ, కోల్‌కతా, పుణె, ముంబయి తదితర ప్రాంతాలకు తీసుకెళ్తామని, మీరూ రాగలరా? అని ప్రశ్నించగా... తాను ఎక్కడికైనా వస్తానని న్యాయవాది చెప్పారు.

అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు: న్యాయవాది

'జగన్ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ అధికారులు నన్ను తప్పుదోవ పట్టిస్తున్నారు. శనివారం తొలుత హైదరాబాద్ రావాలని కోరారు. నేను అక్కడికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోగా విశాఖపట్నం వెళ్తున్నామని, విశాఖ రావాలని చెప్పారు. దీంతో హుటాహుటిన విజయవాడ నుంచి విశాఖ వచ్చా. ఆదివారం కేవలం గంట మాత్రమే విచారించారు. తదుపరి విచారణ హైదరాబాద్, ముంబయి, దిల్లీ, పుణె తదితర నగరాల్లో ఎక్కడైనా చేయాల్సి వస్తుందని చెప్పగా ఇతర నగరాల్లో ఎందుకని ప్రశ్నించా. తమకు ఎక్కడైనా విచారించే హక్కు ఉంటుందని, తమ అవసరాన్ని బట్టి వినియోగించుకుంటామని చెప్పడంతో నేను మిన్నకుండిపోయా' అని న్యాయవాది సలీమ్ వివరించారు.

ఇద్దరు యువతుల పరిణయం



పెళ్లాడిన యువతులు సావిత్రి, మోనాలిసా

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఓ అమ్మాయి మరో అమ్మాయిని వివాహం చేసుకున్న ఘటన ఒడిశాలోని కేంద్రపడ పట్టణంలో చర్చనీయాంశమైంది. పట్టాముండి, మహాకాలపడ గ్రామాలకు చెందిన ఇద్దరు యువతులు సావిత్రి, మోనాలిసాలు కటక్‌లో చదువుకునే సమయంలో కలిసి వసతిగృహంలో ఉండేవారు. అనంతరం ఇద్దరికీ కటక్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగాలు లభించడంతో ఒకే అద్దె ఇంట్లో ఉంటున్నారు. దీర్ఘకాలంగా కలిసి ఉండటంతో ఇద్దరి మధ్య ప్రేమాభిమానాలు పెరిగాయి. వీరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. విషయం తమ తమ కుటుంబీకులకు తెలపగా వారు తిరస్కరించారు. దీంతో వీరిద్దరూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి వివాహం చేసుకున్నారు.

వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలకే అండ

గ్రామీణమంగళగిరి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఫిబ్రవరి 19న గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ వద్ద మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఆదివారం మంగళగిరిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలకే తాము వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటామని స్పష్టంచేశారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశానికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మల్లవరపు నాగయ్య పాల్గొన్నారు.

నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు

- రంగోలీ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన సీఎం సతీమణి భువనేశ్వరి
- నేడు స్వగ్రామానికి రానున్న సీఎం చంద్రబాబు



తితిదే కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించిన శ్రీసిద్ధి వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠ, హోమపూజల్లో పాల్గొన్న నారా భువనేశ్వరి, బ్రహ్మణి, దేవాన్ష్, ఇతర కుటుంబసభ్యులు

చంద్రగిరి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి స్వగ్రామం నారావారిపల్లిలో సంక్రాంతి సందడి మొదలైంది. సీఎం సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి లోకేశ్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్ శనివారమే నారావారిపల్లికి చేరుకున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్వగ్రామం చేరుకోనున్నారు. నారా, నందమూరి వారసులు తొమ్మిదేళ్ల నుంచి నారావారిపల్లిలోనే సంక్రాంతి పండగను జరుపుకొంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం స్థానిక తితిదే కల్యాణ మండపం ఆవరణలో ప్రతిష్ఠించిన శ్రీసిద్ధి వినాయకస్వామివారిని నారా, నందమూరి వారసులు దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన రంగోలీ పోటీలను.. కోడలు, మనవడితో పాటు తోబుట్టువులతో వీక్షించడానికి వచ్చిన భువనేశ్వరి స్థానిక మహిళలు, తెదేపా శ్రేణులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రంగోలీ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఆమె విజేతలతో పాటు పాల్గొన్నవారందరికీ బహుమతులు అందజేశారు. అనంతరం స్విమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కోసం ఏర్పాటు చేసిన పింక్ బస్సును సందర్శించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

'ఎన్టీఆర్-కథానాయకుడు'ను వీక్షించిన నారా లోకేశ్

తిరుపతి (తాతయ్యగుంట), న్యూస్‌టుడే: నందమూరి బాలకృష్ణ నటించిన 'ఎన్టీఆర్ -కథానాయకుడు' చిత్రాన్ని ఆదివారం నారా లోకేశ్, బ్రహ్మణి ఇతర కుటుంబసభ్యులతో కలిసి వీక్షించారు. నారావారిపల్లి నుంచి తిరుపతిలోని పీజీఆర్ సినిమా థియేటర్‌కు విచ్చేసిన వారు ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అనంతరం సినిమా చూశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పెద్ద కుమార్తె లోకేశ్వరి మాట్లాడుతూ.. నాన్న సినిమాను బాలయ్య చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాన్న పడిన కష్టాలను, సినిమా రంగంలో ఆయన చేసిన కృషిని చక్కగా చూపించారని పేర్కొన్నారు. ఆమె కుమారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో సాయికృష్ణ పాత్రను తాను పోషించానని చెప్పారు.

ఏపీభవన్‌లో సంబరంగా సంక్రాంతి వేడుకలు



ఈనాడు, దిల్లీ: హరిదాసు కీర్తనలు, డప్పు దరువులు, శాస్త్రీయ నృత్యాలతో ఏపీ భవన్ తెలుగు పల్లెను తలపిస్తోంది. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీభవన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన ఆదివారం పలువురు చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డప్పు దరువులు, హరిదాసు కీర్తనలు ఆహూతులను అలరించాయి. చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అంబేడ్కర్ ఆడిటోరియంలో కథా నాయకుడు, ఎఫ్2 చిత్రాలను ప్రదర్శించారు. నృత్య, క్విజ్ పోటీల విజేతలకు కార్యక్రమాలు ముగిసిన అనంతరం బహుమతులు అందజేశారు.

దిల్లీలోని ఏపీ భవన్‌లో ఆదివారం కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు

యాదాద్రి మాడవీధిలో వేంచేపు మండపం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రీశుడి క్షేత్రంలో వేంచేపు మండపంతోపాటు దీపోత్సవ, అలంకార మండపాలతో సహా వాహనశాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందాయి. సంపూర్ణంగా కృష్ణశిలతో పునర్నిర్మితమవుతున్న యాదాద్రి సన్నిధిలో ఈ సరికొత్త కట్టడాలకు యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) నిర్ణయించింది. మహారాజగోపురం ఎదుట శ్రీ స్వామి అమ్మవార్ల నిత్య అలంకార సేవోత్సవాలలో భక్తజనానికి దర్శనం ఇచ్చేందుకు వేంచేపు మండపాన్ని నిర్మించే యోచనతో పనులు చేపడుతున్నామని 'యాడా' స్థపతులు తెలిపారు. ఆలయ దక్షిణ దిశలో కృష్ణశిలతో వాహనశాల, అలంకార మండపాల నిర్మాణానికి పూనుకున్నారు. వాహనాల భద్రతకు ప్రత్యేక శాలను నిర్మించే ప్రణాళిక రూపొందింది. ఆ వాహనశాల పక్కనే అలంకార మండపాన్ని నిర్మించేందుకు నమూనా సిద్ధమవుతోంది. వాహనశాలతోపాటు అలంకార మండపాన్నీ కృష్ణశిలతోనే రూపొందించేందుకు స్థపతులు ఆదివారం మార్కింగ్ వేశారు. నిత్యం సాయంత్రం వేళ దీపారాధన పర్వాన్ని చేపట్టేందుకు దీపోత్సవ మండపాన్ని నిర్మించేందుకు దేవస్థానం యోచిస్తోంది.



యాదాద్రి క్షేత్రం దక్షిణ దిశలో సాగుతున్న పనులు

వణుకుతూ.. నిరీక్షిస్తూ..!

- చలిలో ప్లాట్‌ఫారాలపైనే ఎదురుచూపులు
- అరకొరగా నిరీక్షణ గదులు
- ఆలస్యమైతే తప్పని నరకయాతన

ఈనాడు - హైదరాబాద్

శ్రీకాకుళానికి చెందిన బాలకృష్ణ ముంబయిలో పనిచేస్తున్నాడు. సొంతూరికి వెళుతూ సికింద్రాబాద్‌కు స్టేషన్‌కు చేరుకున్నాడు. శ్రీకాకుళం వెళ్లే బండి అప్పటికే వెళ్లిపోయింది. దీంతో రాత్రివేళ స్టేషన్‌లో పడుకోవాల్సి వచ్చింది. వెయిటింగ్ హాల్‌లో జాగా లేక ప్లాట్‌ఫారంపైనే రాత్రంతా వణుకుతూ పడుకున్నాడు.

★ తిరుపతి రైల్వేస్టేషన్లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు వెళ్లిన రవిశంకర్.. ఇంకా 45 నిమిషాల సమయం ఉండటంతో వెయిటింగ్ హాల్‌కు వెళితే ఖాళీ లేదన్నారు. దీంతో పిల్లలతో సహా ప్లాట్‌ఫారంపై కూర్చోవాల్సి వచ్చింది. ఓ వైపు చలిగాలులు మొదలయ్యాయి. రైలు రావడం అరగంట ఆలస్యమైంది. గంటన్నర పాటు నరకయాతన అనుభవించాల్సి వచ్చింది.

వణికిస్తున్న చలికాలం రైలు ప్రయాణికులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో స్టేషన్లల్లో రద్దీకి సరిపడా వెయిటింగ్ హాళ్లు లేకపోవడం, రైళ్లు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో చలి విజృంభిస్తూ ఉండటంతో.. రైళ్లకోసం ఎదురుచూసే ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై చలికి గజగజ వణికిపోతున్నారు.

అరగంటపైనే ఆలస్యం

దక్షిణమధ్య రైల్వే జోన్ పరిధిలోని ప్రధాన స్టేషన్లతో పాటు ఇతర ముఖ్యస్టేషన్లలో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో రాత్రివేళలో ప్రయాణికులు చలికి ఇబ్బంది పడుతున్నారు. వెయిటింగ్ హాళ్లు రద్దీకి సరిపడా లేవు. సికింద్రాబాద్, విజయవాడ వంటి స్టేషన్లలో కనీసం 10 ప్లాట్‌ఫారాలున్నాయి. వెయిటింగ్ హాళ్లు మొదటి, చివరి ప్లాట్‌ఫారలపైనే ఉండటంతో.. చలిలోనే రైళ్ల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రధాన రైళ్లు కనీసం 30-40 నిమిషాలు ఆలస్యంగా వస్తున్నాయి. ప్రత్యేక రైళ్లయితే కనీసం గంట నుంచి రెండు గంటలు ఆలస్యం అవుతున్నాయి. గోరఖ్‌పూర్, ధానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు శనివారం రాత్రి ఖాజీపేటకు 30-40 నిమిషాల ఆలస్యంగా చేరుకున్నాయి. ముఖ్యంగా దిల్లీ వైపు రాకపోకలు సాగించే రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి చలికి వణుకుతూ గడపాల్సి వస్తోంది.

- సికింద్రాబాద్ నుంచి నిత్యం 1.70 లక్షల ప్రయాణికులతో, 240 రైళ్లు, రాకపోకలు సాగిస్తాయి. ఇక్కడున్న 5 వెయిటింగ్ హాళ్లలో 774 మంది మాత్రమే పడతారు. పదో నంబరు ప్లాట్‌ఫారంపై సాధారణ ప్రయాణికులకు వెయిటింగ్‌హాల్ లేదు. కొన్నిసార్లు ప్లాట్‌ఫారంపై కూడా స్థలం సరిపోనప్పుడు కొందరు ప్రయాణికులను స్టేషన్ బయటకు పంపిస్తున్నారు.
- విజయవాడ స్టేషన్‌లో 3 ఏసీ, 7 సాధారణ వెయిటింగ్ హాళ్లున్నాయి. నిత్యం 60 వేల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఏటా రూ.200 కోట్ల ఆదాయంతో జోన్ పరిధిలో అతిపెద్ద స్టేషన్‌గా ఉన్నా.. రద్దీకి తగిన ఏర్పాట్లులేవు. ముఖ్యంగా స్లీపర్ బోగీల్లో ప్రయాణించేవారికి నిరీక్షణ గదులు చాలక రద్దీ సమయాల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతిలో సాయంత్రం అయిందంటే చాలు.. చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వెయిటింగ్‌హాళ్లు నాలుగుమాత్రమే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపైనే పడిగాపులు పడుతున్నారు.
- రిజర్వేషన్లు ఉన్నవారితో పోల్చుకుంటే జనరల్ కేటగిరీలో వెళ్లే సామాన్య ప్రయాణికులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఎక్కాల్సిన బండిలో ఖాళీ లేనప్పుడు మరో రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఇలా స్టేషన్‌లో 2-3 గంటలపాటు చలిలో ప్లాట్‌ఫారాలపై ఎదురుచూపులు తప్పట్లేదు.




రైలు వచ్చే సమయానికి అందుకుంటామో లేదోనన్న ఆందోళనతో తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపైనే ప్రయాణికుల నిద్ర ★ విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ప్రయాణికుల తంటాలు

రైలు కిటకిట.. ప్రయాణం కటకట

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు బయలుదేరి వెళ్లే ప్రయాణికులతో ప్రస్తుతం రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. జనరల్ బోగీల్లో సీట్ల సంగతి అటుంచితే కనీసం నిల్చొని ప్రయాణించేందుకూ జాగా లేని దుస్థితి. దీంతో అవస్థల మధ్యనే వారంతా ప్రయాణాలు కొనసాగించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు సహా వృద్ధులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గత్యంతరం లేనిపరిస్థితుల్లో.. మరికొందరు బోగీల్లోని మరుగుదొడ్లలోనూ ప్రయాణించారు. ఇక కుర్రకారు రైలు పెట్టెలకు ప్రమాదకరంగా వేలాడుతూ వెళ్లారు. స్వస్థలాలకు చేరుకునేందుకుగాను ఆదివారం విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లకు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆయా స్టేషన్ల ప్లాట్‌ఫారంలు సహా పరిసరాలన్నీ కిటకిటలాడాయి. -ఈనాడు, విశాఖపట్నం



విశాఖలోని ఓ ప్లాట్‌ఫారంపై నిలిచిన కన్యాకుమారి-హౌరా ఎక్స్‌ప్రెస్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

పిల్లల టీకా మందు బుగ్గిపాలు

- కర్నూలులోని వ్యాక్సిన్ గోదాములో భారీ అగ్నిప్రమాదం
- వైద్య ఆరోగ్య శాఖకు రూ.కోటి నష్టం



మంటల్లో శీతలీకరణ భవనం

కర్నూలు నేరవిభాగం న్యూస్‌టుడే: కర్నూలులోని డీఎంహెచ్‌వో కార్యాలయం వెనుక ఉన్న జిల్లా వైద్యఆరోగ్యశాఖకు చెందిన వ్యాక్సిన్ నిల్వ భవన సముదాయం(శీతలీకరణ)లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ భవనంలో చిన్నపిల్లలకు చెందిన వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచారు. జిల్లా అంతటికీ ఇక్కడి నుంచే సరఫరా చేస్తారు. ఈ టీకాలను 24 గంటలు శీతలీకరణలో ఉంచాలి. అందువల్ల భవనంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూసేందుకు నిరంతరం ముగ్గురు ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటారు. మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రెండు గంటల సమయంలో గుర్తించేసరికి మంటలు వ్యాపించి తీవ్రమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మూడు వాహనాలతో, మూడు గంటల పాటు శ్రమించి మంటలు ఆర్పారు. అప్పటికే టీకాలతో కూడిన ఫ్రిజ్‌లు, ఫర్నిచర్, కంప్యూటర్, దస్త్రాలు మొత్తం బూడిదయ్యాయి. షార్ట్‌సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యమే అగ్నిప్రమాదానికి, నష్టానికి కారణమనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. కాలిపోయిన వ్యాక్సిన్ విలువ రూ.40 లక్షలు ఉంటుందని, మొత్తం నష్టం దాదాపు కోటి రూపాయల వరకు ఉంటుందని భావిస్తున్నారు.

టోల్‌ప్లాజాల వద్ద పోలీసు బృందాలు

పండగ నేపథ్యంలో రుసుం వసూలు చేయకుండా చర్యలు

కీసర(కంచికచర్ల గ్రామీణం), న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో టోల్ వసూలు కేంద్రాల వద్ద పండగ రోజుల్లో రుసుం వసూలు చేయవద్దని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా నిర్వాహకులు వసూలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శనివారం అర్ధరాత్రి వరకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు, కంచికచర్ల మండలం కీసర టోల్ వసూలు కేంద్రాల నుంచి 29 వేల వాహనాలు వెళ్లినట్లు టోల్ ప్లాజా అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 7 వరకు 9వేల వాహనాలు వెళ్లాయని చెప్పారు. అదనపు ఎస్పీ సాయికృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం మధ్యాహ్నం పోలీసులు రంగంలోకి దిగి.. కీసర, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద రుసుం వసూలు చేయకుండా చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక బృందాలను నియమించి గేట్లు ఎత్తివేసి వాహనాలను పంపారు. హైదరాబాద్, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు వస్తున్న వాహనాలతో జాతీయ రహదారిపై రద్దీ ఇంకా కొనసాగుతోంది.

కోతుల్లోనూ ప్రమాదకర పరాన్నజీవులు!

- వాటిలోనూ మలేరియా లక్షణాలు
- కర్ణాటక తీర ప్రాంతాల్లో పెరుగుతోన్న మర్కట జ్వరం కేసులు
- ఐఐఎస్‌సీ అధ్యయనంలో వెల్లడి

ఈనాడు డిజిటల్, బెంగళూరు: కర్ణాటక తీర ప్రాంతాలను ఇటీవల మర్కట జ్వరం(మంకీ ఫీవర్) వణికిస్తోంది. అరేబియా సముద్ర తీరంలోని ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాలతో పాటు పొరుగునే ఉన్న శివమొగ్గ, చిక్‌మగళూరు జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. మూడు నెలల వ్యవధిలోనే ఈ జిల్లాల్లో 54మంది ఈ జ్వరం బారిన పడినట్లు తేలటం, ఇతర ప్రాంతాలకూ ఇది వేగంగా విస్తరించే అవకాశం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మర్కట జ్వరానికి ఇప్పటికీ సరైన మందు లేదు. కేవలం ముందస్తు జాగ్రత్తల ద్వారానే ఇది రాకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కేఎఫ్‌డీ (క్యాసనూరు ఫారెస్ట్ డిసీజ్) వ్యాధి కారకాన్ని మోసుకెళ్లే కోతులు మానవాళికి మరో ముప్పును కలిగిస్తాయి. ఇప్పటి వరకు మనుషులు, దోమల్లోనే కనిపించే ప్రమాదకర మలేరియా పరాన్నజీవి (హ్యూమన్ మలేరియా పారాసైట్) ప్లాస్మోడియా ఫాల్సిఫారమ్ కోతుల్లోనూ కనిపించింది. బెంగళూరులోని విఖ్యాత భారతీయ విజ్ఞాన సంస్థ(ఐఐఎస్‌సీ) అనుబంధ జీవ సాంకేతిక శాస్త్ర పరిశోధన బృందం చేపట్టిన ఓ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. మన చుట్టూ తిరిగే రెండు జాతుల కోతుల్లో మానవ మలేరియా పరాన్నజీవులున్నట్లు అది తేల్చింది.

★ సాధారణంగా కోతుల రక్తంలో సిమియన్ మలేరియా పారాసైట్‌లు కనిపిస్తాయి. మానవ రక్తంలో ప్లాస్మోడియం ఫాల్సిఫారమ్‌తో పాటు మలేరియా వైవాక్స్, వోవెల్ వంటి మలేరియా పరాన్నజీవులు ఉంటాయి. తాజా పరిశోధన ద్వారా కోతుల్లో సిమియన్ పారాసైట్‌లతో పాటు ప్లాస్మోడియం కారకాలున్నట్లు తేలింది. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దిల్లీ, బిహార్, అండమాన్ నికోబార్ దీవుల నుంచి ఐదు జాతుల కోతులకు సంబంధించిన 349 రక్త, కాలేయ నమూనాలను పరిశీలించగా.. రెండు జాతుల్లో సిమియన్‌తో పాటు ప్లాస్మోడియం పరాన్నజీవులు కనిపించాయి. జనంతో నిత్యం తిరిగే బొన్నెట్ మకాక్, రెసస్ మకాక్ కోతుల్లో రెండు రకాల మలేరియా కారకాలున్నట్లు ఈ అధ్యయన బృందంలోని పరిశోధకులు డాక్టర్ జ్యోత్స్న దీక్షిత్ తెలిపారు. కోతుల్లో మలేరియా జీవులున్నట్లు 1908లో మలేషియా కోతుల అధ్యయనం ద్వారా వెల్లడైంది. తాజాగా మానవ మలేరియా కారకాలు సైతం కోతుల్లో కనిపించటం ఆందోళన కలిగించే అంశమని ఐఐఎస్‌సీ పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఆచార్యుడు ఆచార్య ప్రవీణ్ కారంత్ విశ్లేషించారు.



మానవ మలేరియా పారాసైట్‌లు గుర్తించిన రెసస్ మకాక్ కోతులు

అందరితో మాట్లాడినట్లే పుతిన్‌తోనూ మాట్లాడా

'వాషింగ్టన్ పోస్ట్' అనేది చెత్త మీడియా: ట్రంప్

వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఏం మాట్లాడానో వెల్లడించడానికి సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. వారిద్దరు ఏం మాట్లాడుకున్నారో ట్రంప్ వెల్లడించడం లేదని, ఏదో దాస్తున్నారని 'వాషింగ్టన్ పోస్ట్' రాసిన కథనంలో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. "అందరితో మాట్లాడినట్లే పుతిన్‌తోనూ మాట్లాడాను. ఇజ్రాయెల్ సంక్షేమం గురించి చర్చించాం. అంతకుముందు భారత ప్రధాని మోదీతో మాట్లాడాను. జపాన్ ప్రధాని షింజో అబేతోనూ ఏకాంతంగా భేటీ అయ్యాను. ఎవరితోనూ దాచుకోవాల్సిన విషయాలేమీ చర్చించలేదు" అని ట్రంప్ పేర్కొన్నారు. ' 'ఫాక్స్ న్యూస్''కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. హెల్సింకిలో పుతిన్‌తో ఏం మాట్లాడారో వెల్లడించలేదని వార్తలు వస్తున్నాయి కదా అని ఫాక్స్ న్యూస్ విలేకరి ప్రశ్నించగా.. ట్రంప్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. 'అదంతా వాషింగ్టన్ పోస్ట్ తెలివితక్కువతనం. అది 'న్యూయార్క్ పోస్ట్' అంతటి చెత్త మీడియా' అని విమర్శించారు.

16న జేఈఈ మెయిన్ ప్రాథమిక 'కీ'

ఈనాడు, హైదరాబాద్: అయిదు రోజులపాటు జరిగిన జేఈఈ మెయిన్ పేపర్- 1, 2 ప్రాథమిక 'కీ' ను ఈ నెల 16వ తేదీన జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) విడుదల చేయనుంది. అనంతరం అభ్యంతరాలను స్వీకరించి ఈ నెల 31వ తేదీన ఫలితాలను వెల్లడించనుంది. ఏప్రిల్‌లో మరో మారు పరీక్షలు ఉన్నందున ఈ సారి కేవలం ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయన్నదే ప్రకటిస్తుంది. ఏప్రిల్‌లో జరిగే పరీక్షల అనంతరం దేనిలో ఎక్కువ మార్కులు వస్తే దాన్ని పరిగణనలోకి తీసుకొని ర్యాంకులిస్తుంది.

ఏప్రిల్ 16న తెలంగాణ పాలిసెట్

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు రాసే తెలంగాణ పాలిసెట్‌ను ఏప్రిల్ 16 నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి (ఎస్‌బీటెట్) నిర్ణయించింది. అయితే పార్లమెంట్ ఎన్నికల తేదీల కారణంగా సమస్య ఎదురైతే తేదీని మార్చాలని, లేకుంటే ఆరోజే ప్రవేశ పరీక్ష జరపాలని నిర్ణయించారు. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఇంధన ధరల పెంపు

దిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో గతవారం ముడిచమురు ధరలు బాగా పెరగడంతో, దాని ప్రభావం మన దేశంలోని పెట్రోల్, డీజిల్ ధరలపై పడింది. ప్రధాన ఇంధన కంపెనీలు ఆదివారం లీటరు పెట్రోల్‌పై 49-60 పైసలు, డీజిల్‌పై 59-75పైసలు పెంచాయి. గత మూడురోజులుగా ఇంధన ధరలు పెరుగుతున్న సంగతి తెలిసిందే. వచ్చే వారం కూడా ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో ఆదివారం లీటరు పెట్రోల్ ధర వరుసగా రూ.69.75, రూ.75.39, రూ.72.40, రూ.74కు పెరిగింది. ఇదే నగరాల్లో డీజిల్ ధర వరుసగా రూ.63.69, రూ.66.66, రూ.67.26, రూ.69.24కు పెరిగింది.

ఇంజినీరింగ్ విద్యలో కొత్తదనం..!


- ఆయా కళాశాలల్లో ఐటీఐలు, వృత్తి విద్యా కోర్సులకు అవకాశం
- ఒకే ప్రాంగణంలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు
- సీట్లు పెంచకుండానే కొత్త కోర్సులు..

ఈనాడు - అమరావతి

ఇంజినీరింగ్ విద్యలో మార్పులు రాబోతున్నాయి. ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాలల్లో ఐటీఐలు, వృత్తి విద్య కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపిన అఖిల భారత సాంకతిక విద్యా మండలి(ఏఐసీటీఈ).. ఇందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటన సైతం ఇచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ కళాశాలల ప్రాంగణంలో సైన్సు, ఆర్ట్స్ డిగ్రీ కోర్సులు పెట్టుకోవచ్చని ఇటీవల ఏఐసీటీఈ ఛైర్మన్ అనిల్ డీ సహస్రబుద్దే ప్రకటించారు.

రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వాలి..

ఇంజినీరింగ్‌లో ప్రవేశాలు తగ్గుతున్న నేపథ్యంలో అక్కడ ఉండే మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఇలాంటి విధానాలను తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జేఎన్‌టీయూ కాకినాడ, అనంతపురం కళాశాలలు సాంకేతిక విద్యకు అనుబంధ గుర్తింపునిస్తున్నాయి. డిగ్రీ కోర్సులకు ఇవి అనుమతి ఇవ్వలేవు. వీటికి స్థానిక విశ్వవిద్యాలయాల నుంచి అనుమతులు తీసుకోవాలి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పొందాల్సి ఉంటుంది.



మారుతున్న అవసరాలకు..

మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 40% మాత్రమే సీట్లు భర్తీ అవుతుండగా.. కంప్యూటర్ సైన్సు, ఏరోస్పేస్, మెకట్రానిక్స్‌లలో 60%పైగా సీట్లు నిండుతున్నాయి. ఈ నేపథ్యంలో డిమాండ్ తక్కువగా ఉన్న విభాగాల్లో సీట్లను పెంచకుండా.. మిగిలిపోతున్న సీట్లను కొత్త సాంకేతికతకు కేటాయించాలని ఇంజినీరింగ్ విద్యపై 'జాతీయ దృష్టి కోణ ప్రణాళిక కోసం' నియమించిన కమిటీ సిఫార్సుల్లో పేర్కొంది. దీన్ని ఏఐసీటీఈ అనుమతుల ప్రాసెస్-2019-20 హ్యాండ్ పుస్తకంలో వెల్లడించింది.

సిఫార్సులిలా..

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), బ్లాక్‌చైన్, డాటా సైన్సెస్, రొబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, 3డీ ప్రింటింగ్, డిజైన్ కోర్సులు బీటెక్‌లో ప్రవేశ పెట్టేందుకు కమిటీ సిఫార్సు చేసింది. రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ, ఏఐ, డాటా ఎనాలసిస్ వంటి వాటిని ఎంపిక సబ్జెక్టులుగా ఉన్నత విద్యామండలి అందుబాటులోకి తెచ్చింది.
- ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు అధ్యాపకుల బోధనలో నాణ్యత పెంచాలని పేర్కొంది. ఇప్పటికే ఉన్నత విద్యామండలి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కళాశాలల్లోని అధ్యాపకులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

వచ్చే ఏడాది ఇంటర్న్‌షిప్ తప్పనిసరి..

ఉన్నత విద్యామండలి వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్ విద్యలో చేయనున్న మార్పులపై కసరత్తు చేస్తోంది. పాఠ్యాంశాల మార్పు ఫిబ్రవరి మొదటి వారానికి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. సామాజిక అంశాలపై ప్రాజెక్టు చేసే అంశాన్ని తీసుకురానున్నారు. సెమిస్టర్-5 నుంచి పారిశ్రామిక శిక్షణ, ఇంటర్న్‌షిప్, జాతీయ ప్రయోగశాలలో పరిశోధన ప్రాజెక్టులు చేయాల్సి ఉంటుంది.

- ప్రస్తుతం ఇంజినీరింగ్‌లో 180-200 క్రెడిట్లు ఇస్తుండగా.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని 160కి కుదించనున్నారు.
- విద్యార్థులు కేవలం ఉద్యోగులగానే స్థిరపడకుండా వ్యాపార సంస్థలు ప్రారంభించేందుకు దోహదపడేలా పాఠ్యాంశాల్లో మార్పు తీసుకురానున్నారు.

కొత్త కోర్సులకు ఏఐసీటీఈ పాఠ్యాంశాలు రూపకల్పన

కొత్త కోర్సులకు సంబంధించి ఏఐసీటీఈ పాఠ్యాంశాలను రూపొందించింది. అర్హత ఉన్న కళాశాలలు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే డిమాండ్‌లేని బ్రాంచిల సీట్లను వదులుకొని, కొత్తకోర్సులను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈనెల 11వ తేదీలోపు అధ్యాపకులు, ప్రాంగణ నియామకాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల వివరాలను ఇవ్వాలని కోరింది.

– వరదరాజన్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి

పోలీసులకు 'దృశ్యం' చూపించిన నేరస్థులు!

- సినీఫక్కీలో కాంగ్రెస్ నాయకురాలి హత్య
- శవ దహనం చేసి కుక్క కళేబరంతో హైడ్రామా
- భాజపా మాజీ కార్పొరేటర్, ఆయన కుమారుల దుశ్చర్య



పోలీసుల అదుపులో నిందితులు

ఇందోర్: వెంకటేశ్, మీనా హీరోహీరోయిన్లుగా తెలుగులో వచ్చిన 'దృశ్యం' సినిమా చూశారా? తమిళంలో కమల్‌హాసన్, మలయాళంలో మోహన్‌లాల్, హిందీలో అజయ్‌దేవగన్ ప్రధానపాత్ర పోషించిన ఈ సినిమా దేశవ్యాప్తంగా సినీఅభిమానులను అలరించింది. ఆ సినిమాలో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి హీరో.. పోలీసులను తెలివిగా పక్కదారి పట్టిస్తాడు. ఇందోర్‌లో ఓ 22ఏళ్ల యువతిని భాజపా నేత హత్య చేసి ఈ సినిమాలోని 'దృశ్యాన్ని' అనుకరించాడని, హత్యను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించాడని ఇందోర్ డీఐజీ హరినారాయణాచారి మిశ్ర తెలిపారు.

భాజపా మాజీ కార్పొరేటర్‌తో వివాహేతర సంబంధం

ఇందోర్‌లోని జగ్‌దీశ్ కరోటియా అలియాస్ కల్లు పెహ్లువాన్(65) అనే భాజపా మాజీ కార్పొరేటర్‌కు ట్వింకిల్ డాగరే(22) అనే కాంగ్రెస్ నాయకురాలితో వివాహేతర సంబంధం ఉండేది. వీరిద్దరి విషయం తెలిసి జగ్‌దీశ్ కుటుంబంలో కలతలు చెలరేగాయి. ట్వింకిల్‌ను వదిలించుకోవాలని జగ్‌దీశ్ ఆలోచించాడు. ఆయనకు అజయ్(36), విజయ్(38), వినయ్(31) అనే ముగ్గురు కుమారులున్నారు. వీరికి నీలేశ్ కశ్యప్(28) అనే సహాయకుడు తోడయ్యాడు. అక్టోబరు 15, 2016న ఆమెను గొంతు నులిమి చంపారు. తరువాతి రోజు ట్వింకిల్‌ను దహనం చేశారు. ఆమెను దహనం చేసిన స్థలానికి వందమీటర్ల దూరంలో మున్సిపల్ కార్మికులతో ఓ గొయ్యి తవ్వించారు. అందులో ఓ కుక్క కళేబరాన్ని పూడ్చారు.

నాలుగు నెలల తరువాత...

'కరోటియా స్థలంలో ఎవరో యువతి శవాన్ని పూడ్చి పెట్టారంట!' అని వదంతులు పుట్టించారు. విషయం పోలీసులకు తెలిసింది. వారు వచ్చి గొయ్యి తవ్వించగా, కుళ్లిన కుక్క కళేబరం బయటపడింది. ఎవరో లేనిపోని వదంతులు పుట్టించారని భావించిన పోలీసులు, ట్వింకిల్ కేసులో పురోగతి లేక మిన్నకున్నారు. ఇంతలో ఆమె తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటైంది. కరోటియా, ఆయన ఇద్దరు కుమారులు, ట్వింకిల్ తల్లిదండ్రులకు సిట్.. గుజరాత్‌లో 'బ్రెయిన్ ఫింగర్‌ప్రింటింగ్' అనే పరీక్ష చేయించింది. మనిషి నిజం చెప్పాడో, అబద్ధం చెప్పాడో ఈ పరీక్షతో తేలిపోతుంది. పరీక్ష అనంతరం కుట్ర మొత్తం తేటతెల్లమైంది. ఇందోర్‌లో నేరస్థులపై ఇలాంటి పరీక్ష చేయడం ఇదే తొలిసారి.

పోలీసులను పక్కదారి పట్టించారిలా

ట్వింకిల్‌ను చంపిన నేరస్థులు, ఆమె సెల్‌ఫోన్‌ను ఉపయోగించి పోలీసుల దర్యాప్తును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారు. ఆమె చనిపోయాక కరోటియా కుమారుడు అజయ్ దాన్ని స్వాధీనం చేసుకున్నాడు. "మా నాన్న వల్ల ఇబ్బంది పడుతున్నాను. మా అమ్మానాన్నలను జాగ్రత్తగా చూసుకో అజయ్' ' అని తన(అజయ్) సెల్‌ఫోన్‌కు సందేశం పంపించాడు. పైగా ఆ సెల్‌ఫోన్‌ను బద్నావర్‌కు సమీపాన పడేశారు. బద్నావర్‌లో ట్వింకిల్ ప్రియుడు ఉంటున్నాడు. ట్వింకిల్ తల్లిదండ్రులు, ఆమె ప్రియుడిపై పోలీసులకు అనుమానం వచ్చేలా చేయడానికే ఇలా చేశారు.



...అయినా పడవ ప్రయాణం

పడవ ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు గుణపాఠాలు నేర్చుకోవడం లేదు. నేటికీ బోటు ప్రయాణాల్లో లైఫ్‌జాకెట్ల వాడకాన్ని తప్పనిసరి చేయడం లేదు. గతంలో విజయవాడ సమీపంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలో సంభవించిన దుర్ఘటనలో 21 మంది మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా మంటూరు వద్ద గోదావరి నదిలో 19 మంది జలసమాధి అయ్యారు. అనుకోని పరిస్థితుల్లో బోటు మునిగినా.. లైఫ్‌జాకెట్లు ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకునే వీలుంటుంది. అయినా, పర్యాటకులకు వీటిని అందజేసే విషయమై దృష్టిసారించడం లేదు. ఆదివారం కృష్ణాజిల్లా నాగాయలంక వద్ద కృష్ణానదిలో జరుగుతున్న పడవ పోటీలను తిలకించేందుకు వచ్చిన జనం ఇలా బోట్లలో కిక్కిరిసి నదిలో ప్రమాదకరంగా ప్రయాణించారు.

–ఈనాడు, అమరావతి


నాగాయలంకలో ఉత్సాహంగా పడవ పోటీలు

నాగాయలంక, అవనిగడ్డగ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కృష్ణాజిల్లాలోని నాగాయలంక కేంద్రంగా 3 రోజులపాటు నిర్వహించే పడవ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సంప్రదాయ పోటీలను ఆదివారం నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రం పుష్కరస్నాన ఘట్టం వద్ద శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి పర్యాటకశాఖ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు కె.జయరామిరెడ్డి ప్రారంభించారు. తొలిరోజు కోల పడవల పోటీలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కృష్ణా-గుంటూరు జిల్లాలు పోటాపోటీగా తలపడ్డాయి. మొదటి దఫా పోటీల్లో వెంకటేశ్వరరావు జట్టు (నాగాయలంక), రెండో దఫాలో బి.వెంకటేశ్వరరావు జట్టు (నాగాయలంక), మూడో దఫా పోటీల్లో నాగేశ్వరప్రసాద్ జట్టు (విశ్వనాథపల్లి), నాలుగో దఫా పోటీల్లో బి.సుబ్రహ్మణ్యం జట్టు (పెనుమూడి) ప్రథమ స్థానంలో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. వీరు సోమవారం జరిగే చివరి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా జయరామిరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పడవల పోటీలకు కృష్ణా జిల్లాలోని నాగాయలంక కేంద్రంగా మారుతుందని, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

పడవ పోటీలో కృష్ణా- గుంటూరు జట్లు



36300 పాయింట్లు కీలకం!



సమీక్ష : కంపెనీల త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మదుపర్లు గత వారం ఆచితూచి అడుగేశారు. ఫలితంగా సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. చమురు ధరలు పెరగడం ప్రభావం చూపింది. అమెరికా- చైనా వాణిజ్య చర్చలు పురోగతి సాధించొచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా మారాయి. దేశీయంగా చూస్తే.. ఆర్థిక గణాంకాలు మిశ్రమంగా నమోదయ్యాయి. ప్రత్యక్ష పన్ను వసూళ్లు 14.4 శాతం వృద్ధి చెందగా.. ద్రవ్యలోటు, లక్ష్యం కంటే 15 శాతం అధికంగా నమోదైంది. జీఎస్‌టీ మండలి నిర్ణయాలు కలిసొచ్చాయి. అంతర్జాతీయంగా చూస్తే.. వడ్డీ రేట్ల పెంపుపై దూకుడుగా వెళ్లబోమని ఫెడ్ ఛైర్మన్ పావెల్ పునరుద్ఘాటించడంతో మార్కెట్లు ముందుకెళ్లాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 0.9 శాతం పెరిగి 36,010 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 0.6 శాతం లాభంతో 10,795 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఎఫ్ఎమ్‌సీజీ, మన్నికైన వినిమయ వస్తువులు, ఆరోగ్య సంరక్షణ షేర్లు లాభపడగా, చమురు- గ్యాస్, లోహ, యంత్ర పరికరాల స్క్రిప్‌లు డీలాపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.573 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.1130 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:5గా నమోదు కావడం.. మార్కెట్లలో కొంత బలహీనతను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } అధిక స్థాయిల వద్ద స్థిరీకరించుకోవడంతో గత వారం మార్కెట్లు స్వల్ప లాభాలు నమోదు చేశాయి. 35500- 35350 పాయింట్ల శ్రేణి దిగువకు చేరితే.. నష్టాల బాట పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్లకు 36,300 పాయింట్ల స్థాయి చాలా కీలకం. ఈ స్థాయి అధిగమిస్తేనే.. లాభాలు నిలబడొచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ గణాంకాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. దేశీయంగా ఈ వారం రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్ఐఐటీ టెక్నాలజీస్, కేపీఐటీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్, డీసీబీ బ్యాంక్, సైయంట్, ఎల్ అండ్ టీ టెక్ వంటి దిగ్గజ సంస్థలు ఫలితాలు వెలువరించనున్నాయి. ఈ ప్రభావం ఆయా షేర్లపై కనిపించొచ్చు. గత శుక్రవారం మార్కెట్లు ముగిసిన అనంతరం వెలువడిన పారిశ్రామికోత్పత్తి గణాంకాల ప్రభావం నేడు ఉండొచ్చు. ఈ వారంలోనే రిటైల్, టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కానున్నాయి. అమెరికా- చైనాల మధ్య వాణిజ్య చర్చలు ఫలప్రదం కావొచ్చన్న అంచనాలు, ఒపెక్ ఉత్పత్తి కోతతో సరఫరా తగ్గొచ్చన్న వార్తలతో ముడిచమురు కదలికలు కీలకం కానున్నాయి. ముడిచమురు ధరలు మరింత పెరిగితే దేశీయ మదుపర్ల సెంటిమెంట్ దెబ్బతినే అవకాశం ఉంది. డాలరుతో పోలిస్తే రూపాయి కదలికలు, ఎఫ్ఐఐ, డీఐఐల పెట్టుబడుల ధోరణి వంటివి కీలకం కానున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా ప్రభుత్వ ప్రతిష్టంభనకు సంబంధించిన పరిణామాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. 15న బ్రెగ్జిట్‌పై జరగనున్న ఓటింగ్ కీలకం కానుంది. 14న వెలువడనున్న చైనా ఎగుమతి, దిగుమతి గణాంకాల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,744, 35,382, 35,010;
తక్షణ నిరోధ స్థాయిలు: 36,270, 36,554, 36,700

మార్కెట్లు 35,500- 35,350 శ్రేణి దిగువకు చేరితే మరిన్ని నష్టాలకు ఆస్కారం ఉంది. కీలకమైన 36,300 పాయింట్ల ఎగువన ముగిస్తే లాభాలు నిలబడొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



కోడిగుడ్లు



13న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	433	వరంగల్	435
చిల్లరగా (ఒక గుడ్డు)	5.00	విశాఖపట్నం	445
బెంగళూరు	445	చెన్నై	450
14వ తేదీకి		చిత్తూరు	443
విజయవాడ/గోదావరి	443	నమక్కల్	435

ఫలితాలే నడిపిస్తాయ్

● ఇన్ఫీ గణాంకాలతో కొంత నిరుత్సాహం ● ఎఫ్ఎమ్‌సీజీ, ఫార్మా షేర్లకు సానుకూలం ● యంత్రపరికరాల స్క్రిప్‌లకు ప్రతికూలం
● గురువారం ఆర్ఐఎల్ ఫలితాలు ● 10620-10900 మధ్య నిఫ్టీ చలనం ● విశ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

ఇన్ఫోసిస్ ఫలితాలు నిరుత్సాహ పరచిన కారణంగా దేశీయ సూచీలు సోమవారం బలహీనంగా ప్రారంభం కావొచ్చు. అయితే 'షేర్ల బైబ్యాక్', ఆదాయ అంచనాలను మెరుగ్గా ప్రకటించడం వల్ల ఇన్ఫీ షేర్లు మరీ ఎక్కువగా నష్టపోకపోవచ్చు. ఈ వారం ఫలితాలు వెల్లడించనున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యునిలీవర్, విప్రో, జీ ఎంటర్‌టైన్‌మెంట్‌లపై మదుపర్లు దృష్టి సారించవచ్చు. ఆర్థిక రంగ సంస్థల ఫలితాలు బాగుంటాయనే అంచనాలు, సూచీలకు మద్దతు నిస్తాయని బ్రోకరేజీ సంస్థలు అంటున్నాయి. నిఫ్టీ-50 ఈ వారం 10620-10900 మధ్య కదలాడొచ్చు. గత శుక్రవారం విడుదలైన పారిశ్రామికోత్పత్తి సూచీ గణాంకాలతో పాటు ఈవారం వెల్లడయ్యే ద్రవ్యోల్బణ గణాంకాలు ప్రభావం చూపుతాయి. అమెరికా-చైనా వాణిజ్య చర్చలు, అంతర్జాతీయ మార్కెట్లు కూడా ప్రభావం చూపొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- ఎంపిక చేసిన **బ్యాంకు** షేర్లలో కదలికలు కనిపించవచ్చు. ఫలితాలు ప్రకటించనున్న బ్యాంకుల ఆస్తుల నాణ్యత వివరాలను మదుపర్లు నిశితంగా గమనించవచ్చు. యెస్ బ్యాంక్ కొత్త ఎండీ, సీఈఓ నియామక వార్తలను మదుపర్లు పరిశీలించవచ్చు.
- అక్టోబరు-డిసెంబరు ఫలితాల కోసం మదుపర్లు ఎదురుచూస్తున్న నేపథ్యంలో **వాహన** రంగ షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి చలించవచ్చు. ప్రయాణికుల వాహనాల ధరల్లో మార్పులపై మార్కెట్ దృష్టి సారించే అవకాశం ఉంది.
- గ్రామీణ ఆదాయాలు పెరగడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చన్న అంచనాల నేపథ్యంలో **ఎఫ్ఎమ్‌సీజీ** షేర్లు ఈ వారం రాణించవచ్చు. హెచ్‌యూఎల్ ఫలితాలను మార్కెట్ వర్గాలు పరిశీలించే అవకాశం ఉంది.
- **లోహ** కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. అతిపెద్ద లోహ తయారీదారు అయిన చైనా తన జీడీపీ అంచనాలను(2019) 6.5 శాతం నుంచి 6-6.5 శాతానికి తగ్గించడం ఇందుకు నేపథ్యం. చైనా-అమెరికాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధం వల్ల చైనాతో పాటు దేశీయంగా కూడా గిరాకీ తగ్గే అవకాశం ఉంది. కంపెనీల ఫలితాలపైనా మార్కెట్ ఓ కన్నేయవచ్చు.
- డిసెంబరు త్రైమాసిక ఫలితాలతో పాటు, యాజమాన్యాల వ్యాఖ్యలపై మదుపర్ల దృష్టి పడనున్న నేపథ్యంలో **ఫార్మా** షేర్లు తమ లాభాలు కొనసాగించొచ్చు.
- **సిమెంటు** కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి కదలాడవచ్చు. ఈ రంగానికి సంబంధించి ఎటువంటి వార్తలూ లేనందున కీలక సూచీలతో పాటే ఈ షేర్లూ ట్రేడవవచ్చు. ఫలితాల కారణంగా ఎంపిక చేసిన షేర్లలో చలనాలుండొచ్చు.
- ప్రభుత్వ రంగ **చమురు** (అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్) కంపెనీలు ఈ వారం చాలా తక్కువ శ్రేణిలో కదలాడొచ్చు. ఓఎన్‌జీసీ వంటి అప్‌స్ట్రీమ్ కంపెనీలు మాత్రం కొంత సానుకూల ధోరణితో; హెచ్‌పీసీఎల్ వంటి డౌన్‌స్ట్రీమ్ కంపెనీలు బలహీన ధోరణితో చలించవచ్చు. గురువారం ఫలితాలను ప్రకటించబోయే రిలయన్స్ ఇండస్ట్రీస్‌పై మదుపర్లు దృష్టి సారించవచ్చు.
- గురువారం వెల్లడయ్యే రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఫలితాలను బట్టి **టెలికాం** షేర్లు చలించవచ్చు. టారిఫ్ వ్యూహాలపై కంపెనీ యాజమాన్యం చేసే వ్యాఖ్యలు కీలకం కానున్నాయి.
- **యంత్రపరికరాల** షేర్లు నష్టపోయే అవకాశం ఉంది. నవంబరులో పారిశ్రామిక వృద్ధి క్షీణించడమే ఇందుకు కారణం. ఆర్డర్లు తక్కువగా ఉన్నందున సీమెన్స్ షేర్లు డీలా పడొచ్చు.

సిమెంట్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1458.65	1475.30	1442.10
అంబుజా సిమెంట్స్	212.85	215.50	210.20
ఇండియా సిమెంట్స్	87.20	89.10	85.40
శ్రీ సిమెంట్	15913.20	16570.40	15491.40
అల్ట్రాటెక్ సిమెంట్	3770.20	3891.40	3690.50
చమురు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బీపీసీఎల్	337.30	342.30	332.00
హెచ్‌పీసీఎల్	233.50	237.40	229.40
ఐఓసీఎల్	131.20	132.20	129.80
ఓఎన్‌జీసీ	144.65	146.50	142.80
ఆయిల్ ఇండియా	174.55	176.50	172.80
టెలికాం	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భారతీ ఎయిర్‌టెల్	335.10	342.10	325.50
ఆర్‌కామ్	13.70	14.20	13.40
ఆర్ఐఎల్	1098.05	1125.40	1075.00
టాటా కమ్యూనికేషన్స్	516.70	532.70	500.10
వొడాఫోన్ ఐడియా	36.90	37.70	36.20
యంత్రపరికరాలు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భెల్	68.55	69.90	67.40
సీజీ పవర్	44.65	46.20	43.60
ఎల్ అండ్ టీ	1,369.60	1,407.70	1,342.00
థెర్మాక్స్	1,149.90	1,161.40	1,139.00
సీమెన్స్	1,057.85	1,084.70	1,038.40

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
యాక్సిస్ బ్యాంక్	666.50	674.70	654.10
బ్యాంక్ ఆఫ్ బరోడా	121.15	125.80	117.30
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2111.90	2130.60	2098.60
ఐసీఐసీఐ బ్యాంక్	378.55	384.30	372.40
పీఎన్‌బీ	80.65	82.10	79.70
ఎస్‌బీఐ	302.75	308.60	298.10
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అశోక్ లేలాండ్	94.30	96.20	92.70
బజాజ్ ఆటో	2720.95	2758.00	2682.30
హీరో మోటోకార్ప్	2899.25	2964.40	2852.50
ఎం అండ్ ఎం	727.90	741.80	714.30
మారుతీ సుజుకీ	7320.50	7452.20	7216.20
టాటా మోటార్స్	180.30	190.80	174.10
ఎఫ్ఎమ్‌సీజీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బ్రిటానియా ఇండస్ట్రీస్	3096.85	3134.90	3060.60
డాబర్ ఇండియా	421.65	425.10	416.90
గోద్రేజ్ కన్జూమర్ ప్రొడక్ట్స్	778.95	788.70	765.70
హెచ్‌యూఎల్	1769.40	1811.30	1737.60
ఐటీసీ	295.35	298.80	289.80
మారికో	381.45	393.80	373.90
లోహ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హిందాల్కో ఇండస్ట్రీస్	205.85	209.90	202.00
జిందాల్ స్టీల్	148.80	154.30	145.30
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	288.80	297.50	282.10
సెయిల్	52.20	53.30	51.30
టాటా స్టీల్	474.20	489.10	464.60
వేదాంతా	196.60	199.90	193.30
ఔషధ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అరబిందో ఫార్మా	769.85	781.60	757.60
సిప్లా	510.20	523.20	501.70
డాక్టర్ రెడ్డీస్	2588.15	2623.80	2562.20
లుపిన్	839.35	850.40	822.60
ఫైజర్	2761.15	2794.10	2713.10
సన్‌ఫార్మా	444.40	453.40	437.10

ఈ వారం బోర్డు సమావేశాలు

నేడు(14న): ఐబీ వెంచర్స్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, టాటా మెటాలిక్స్
రేపు: జీ ఎంటర్‌టైన్‌మెంట్, టీవీ18 బ్రాడ్‌కాస్ట్, డెన్ నెట్‌వర్క్స్, నెట్‌వర్క్ 18, ఎంసీఎక్స్, కేపీఐటీ టెక్నాలజీస్, ట్రైడెంట్
16న: మైండ్ ట్రీ, ఫిలిప్స్ కార్బన్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్, డీసీబీ బ్యాంక్, హెచ్‌టీ మీడియా
17న: రిలయన్స్ ఇండస్ట్రీస్, సైయెంట్, హిందుస్థాన్ యునిలీవర్, ఫెడరల్ బ్యాంక్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ, మాస్టెక్, ర్యాలీస్
18న: విప్రో, ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, ముత్తూట్ క్యాపిటల్, ఎన్ఐఐటీ టెక్నాలజీస్, ధనలక్ష్మీ బ్యాంక్, ఎస్‌బీఐ లైఫ్
19న: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సౌత్ ఇండియన్ బ్యాంక్

9 రోజుల్లో రూ.3600 కోట్లు వెనక్కి

జనవరిలో నికర విక్రేతలుగా ఎఫ్‌పీఐలు

దిల్లీ: మన ఈక్విటీ మార్కెట్ల నుంచి ఈనెలలో గత 9 ట్రేడింగ్ రోజుల్లోనే విదేశీ మదుపర్లు రూ.3,600 కోట్లకు పైగా నిధులు వెనక్కి తీసుకున్నారు. తద్వారా మన దేశంపై అప్రమత్తత ధోరణి కొనసాగిస్తున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరుల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) మొత్తం రూ.8,584 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. డిపాజిటరీల సమాచారం మేరకు.. ఈ నెల 1-12 తేదీల మధ్య ఈక్విటీల ఎఫ్‌పీఐలు రూ.3,677 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ఇదే సమయంలో రుణ మార్కెట్లలోకి మాత్రం రూ.1,872 కోట్లు చొప్పించారు.

ముద్రా మొండి బకాయిలు
రూ.11,000 కోట్లు



దిల్లీ: చిన్నపాటి వ్యాపార/వాణిజ్య సంస్థలకు సహకరించేందుకు మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన్‌మంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) పథకం కింద ఇస్తున్న రుణాల్లో మొండిబకాయిలు రూ.11,000 కోట్లకు చేరాయని పేర్కొంటూ, ఆర్థిక శాఖను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితే కొనసాగితే భవిష్యత్తులో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) అధికంగా వచ్చే విభాగంలో ముద్ర చేరడం కచ్చితమేనని పేర్కొంది. ఒకపక్క ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ రుణ సంక్షోభం వల్ల బ్యాంకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. ఒక్క ఇండస్ఇండ్ బ్యాంక్ అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి రూ.255 కోట్లను ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ మొండిబకాయిల కోసమే కేటాయించాల్సి రావడం గమనార్హం. సెప్టెంబరు త్రైమాసికంలోనూ రూ.275 కోట్లను కేటాయించాల్సి వచ్చింది. ఇలాంటి దశలోనే, ఆర్‌బీఐ నుంచి ముద్ర పథకం రుణాలపైనా హెచ్చరికలు రావడం పీఎంఎంవై 2017-18 వార్షిక నివేదిక ప్రకారం, ఆ ఆర్థిక సంవత్సరంలో పీఎంఎంవై కింద ఇచ్చిన మొత్తం రుణాలు రూ.2.46 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో 40 శాతం మహిళలకు, 33 శాతాన్ని ఆయా సామాజిక వర్గాలకు రిజర్వేషన్ కింద జారీ చేశారు. మొత్తం 4.81 కోట్ల మందికి పైగా ఈ పథకం కింద రుణాలు పొందారు. ఇందులో రూ.11,000 కోట్లు మొండి బకాయిలుగా తేలాయి.

ఇదీ పథకం

2015 ఏప్రిల్ 8న ప్రారంభమైన ముద్ర పథకం కింద సూక్ష్మ, చిన్నపాటి వ్యాపార/వాణిజ్య సంస్థలకు రూ.10 లక్షల వరకు రుణాలను బ్యాంకులు మంజూరు చేయాల్సి ఉంటుంది. శిశు విభాగం కింద రూ.50,000 వరకు, రూ.50,001-5 లక్షల వరకు కిశోర్ కింద, రూ.5,00,001-10 లక్షల వరకు తరుణ్ విభాగం కింద రుణాలను ఈ పథకంలో భాగంగా మంజూరు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సెంబ్‌కార్ప్ 2 కాలుష్య నియంత్రణ యూనిట్లు

రూ.1,000 కోట్ల పెట్టుబడి

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 2,640 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు విద్యుత్ ప్లాంట్ల వద్ద రూ.1000 కోట్లకు పైగా పెట్టుబడితో, రెండు కాలుష్య నివారణ (ఫ్లూయి గ్యాస్ డీసల్ఫ్యూరైజేషన్ -ఎఫ్‌జీడీ) యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా (ఎస్ఈఐఎల్) ప్రకటించింది. పర్యావరణ నిబంధనలు అందుకోవడంలో భాగంగా వీటిని ఏర్పాటు చేయనుంది. విద్యుత్ ప్లాంట్ల ఉద్గారాలను తగ్గించి, అధిక సామర్థ్యంతో పనిచేయడానికి ఎఫ్‌జీడీలు దోహదపడతాయి. సల్ఫర్ డయాక్సైడ్ ఉద్గారాలను నియంత్రించడంతో పాటు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) విధించిన నిబంధనలు అందుకోవడానికి ఇవి తోడ్పడతాయి. కంపెనీ ఎఫ్‌జీడీ యూనిట్లు ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉండటంతో పాటు వీటి కోసం టెండర్లను సైతం ఆహ్వానించింది. సింగపూర్ కేంద్రంగా పనిచేసే సెంబ్‌కార్ప్ గ్రూప్‌నకు ఎస్ఈఐఎల్ అనుబంధ సంస్థ.

భారత్‌లోకి టయోటా బాలెనో

దిల్లీ: సుజుకీ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ మోడల్ బాలెనో కారులో కొత్త వెర్షన్‌ను మన దేశంలో విడుదల చేయడానికి జపాన్ వాహన దిగ్గజం టయోటా సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) ద్వితీయార్ధంలో ఈ మోడల్ విడుదల కావొచ్చని సంబంధిత వర్గాల సమాచారం. సుజుకీ భారత విభాగమైన మారుతీ సుజుకీ ప్రస్తుతం విక్రయిస్తున్న బాలెనో మోడల్‌కు ప్రజాదరణ లభించడంతో, టయోటా కూడా తమ ప్రత్యేక ఫీచర్లను ఈ మోడల్‌లో ప్రవేశపెట్టనుంది. గతేడాది మార్చిలో.. సుజుకీ, టయోటాలు భారత విపణిలో హైబ్రిడ్, ఇతర కార్లను ఇచ్చిపుచ్చుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఒప్పందం ప్రకారం.. సుజుకీ బాలెనో, బ్రెజాలను టయోటాకు సరఫరా చేస్తుంది. ఇదే సమయంలో టయోటా సెడాన్ కరోలాను సుజుకీకి ఇవ్వనుంది. టయోటా భారత విభాగం టయోటా కిర్లోస్కర్‌ను సంప్రదించగా.. కారు విడుదల సమయంపై స్పష్టత ఇవ్వలేదు. 'టయోటా-సుజుకీ భాగస్వామ్యంలో భాగంలో ఇరు కంపెనీలు సొంత బ్రాండ్లు, మోడళ్ల కింద కార్లను సరఫరా చేసుకోనున్నాయి. ఈ సమయంలో అంతకు మించి ఏమీ చెప్పలేం' అని టయోటా కిర్లోస్కర్ మోటార్ ఉపాధ్యక్షుడు అతుషషి ఓకి పేర్కొన్నారు.

పామోలిన్‌లో లాభాలు స్వీకరించొచ్చు


కమొడిటీస్ ఈ వారం

● బంగారం, వెండి



పసిడి కాంట్రాక్టు గతవారం రూ.31,529 వద్ద సానుకూలంగా ఆరంభమైంది. రూ.31,448 వద్ద వారం కనిష్ఠానికి దిగివచ్చాక.. కొనుగోళ్లు వెల్లువెత్తడంతో కీలక స్థాయైన రూ.31,888ని అధిగమించింది. ఆ తర్వాత కూడా జోరు కొనసాగించి రూ.32,135 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. చివరకు 1.22% లాభంతో రూ.31,915 వద్ద స్థిరపడింది. గత శుక్రవారం వెలువడిన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల ప్రభావం పసిడి కాంట్రాక్టుపై పెద్దగా లేనందున రూ.32,217 వరకు లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అలాగే రూ.31,560 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, రూ.31730- 31,888 మధ్య కొత్తగా లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.31,560 దిగువకు వస్తే మాత్రం లాంగ్ పొజిషన్ల జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం. అమెరికా ప్రభుత్వం పాక్షికంగా మూతబడటానికి సంబంధించిన పరిణామాలపై ఓ కన్నేసి ఉంచాలి. ఆ దేశం విడుదల చేసే కీలక ఆర్థిక గణాంకాల ప్రభావం కూడా పసిడి కాంట్రాక్టుపై ఉంటుంది. ఫెడరల్ రిజర్వ్ అధికారులు చేసే వ్యాఖ్యలపైనా దృష్టి పెట్టాలి. వెండి మార్చి కాంట్రాక్టు గతవారం రూ.39,224 వద్ద ఆరంభమైంది. అనంతరం అమ్మకాల ఒత్తిడికి లోనై రూ.38,889 కి దిగివచ్చింది. ఆ తర్వాత పుంజుకుని రూ.39,761 స్థాయికి వెళ్లింది. అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో మళ్లీ దిద్దుబాటుకు లోనయ్యింది. చివరకు 0.29 శాతానికి లాభాన్ని పరిమితం చేసుకొని రూ.39,336 వద్ద ముగిసింది. సాంకేతికంగా కాంట్రాక్టు ప్రతికూల ధోరణిలో ఉంది. అందువల్ల రూ.38,896 దిగువకు రాకుంటేనే లాంగ్ పొజిషన్ల వైపు మొగ్గు చూపాలి. ఇప్పటికే లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.39,548- 39,984 మధ్య లాభాలు స్వీకరించాలి. తక్కువ రిస్క్‌తో ట్రేడ్ చేసే మదుపర్లు షార్ట్ సెల్ చేసేందుకు రూ.39,984 వరకు వేచిచూడటం ఉత్తమం.

● ప్రాథమిక లోహాలు



రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఓవర్ సోల్డ్ పరిధిలో ఉన్నప్పటికీ, మరోసారి రూ.411 స్థాయికి దిగి వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ స్థాయి వద్ద కొనుగోళ్లకు మొగ్గు చూపడం మంచి వ్యూహం అవుతుంది. ఎందుకంటే ఏ చిన్న సానుకూల వార్త వచ్చినా ఇక్కడ నుంచి కాంట్రాక్టు పుంజుకునే అవకాశం ఉంది. గత వారం లాంగ్ పొజిషన్లు తీసుకున్న ట్రేడర్లు రూ.408కి స్టాప్‌లాస్ సవరించుకోవడం మంచిది. సీసం ఫిబ్రవరి కాంట్రాక్టుకు ఈవారం అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల రూ.137.85 స్థాయికి దిగువన లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. ఒకవేళ రూ.137 కంటే కిందకు రాకుంటే లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచిదే. అయితే రూ.133 వద్ద స్టాప్ లాస్ తప్పక పెట్టుకోవాలి. జింక్ జనవరి కాంట్రాక్టు ఈవారం బలహీనంగా కనిపిస్తోంది. లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.172.25 దరిదాపులో స్టాప్‌లాప్ పెట్టుకోవాలి. గత 11 వారాలుగా ప్రతికూల ధోరణిలో కొనసాగినందున ఈవారం అల్యూమినియం జనవరి కాంట్రాక్టుకు కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ.126.45 వద స్టాప్‌లాస్ పెట్టుకుని, రూ.128.50 కంటే పైన కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. నికెల్ జనవరి కాంట్రాక్టును ఈవారం నుంచి కొనుగోలు చేయడం ప్రారంభించొచ్చు. అయితే రూ.734 వద్ద స్టాప్‌లాస్ తప్పక పరిగణించాలి.

● ఇంధన రంగం

ముడి చమురు జనవరి కాంట్రాక్టు ఈవారం కూడా రాణించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. రూ.3,542 నుంచి కొత్తగా లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. ఉష్ణోగ్రత అంచనాల్లో మార్పులు చోటుచేసుకుంటే సమీపకాలంలో సహజవాయువు జనవరి కాంట్రాక్టు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. ఓవర్‌సోల్డ్ పరిధిలో ఉన్నందున ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లొచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) జనవరి కాంట్రాక్టు ఈవారం సానుకూలంగా కదలాడొచ్చు. అయినా అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ ఉత్తమం. సమీపకాల నిరోధ స్థాయి వద్ద షార్ట్ సెల్లింగ్ చోటుచేసుకునే అవకాశం ఉండటమే ఇందుకు కారణం. గతవారం లాభాలు స్వీకరించని ట్రేడర్లు కూడా. . ఈవారం కొన్ని పొజిషన్లకు లాభాలు స్వీకరించి, మిగిలిన వాటికి స్టాప్ లాస్ పెట్టుకోవాలి.



– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	409.20	415.90	1.64
సీసం (జనవరి)	136.20	140.20	2.94
జింక్ (జనవరి)	172.15	176.40	2.47
అల్యూమినియం (జనవరి)	129.85	128.80	(0.81)
నికెల్ (జనవరి)	773.00	804.60	4.09
ముడి చమురు (జనవరి)	3,381	3,629	7.34
సహజ వాయువు (జనవరి)	209.70	216.50	3.25
సీపీఓ (జనవరి)	532.20	545.20	2.44

బ్లడ్ క్యాన్సర్ ఔషధాల్లోకి లుపిన్

దిల్లీ: క్యాన్సర్, జీవక్రియ రుగ్మతల నివారణ ఔషధాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఔషధ సంస్థ లుపిన్ ప్రెసిడెంట్ ఎన్.డి.డి.డి. రాజ్ కాంబోజ్ వెల్లడించారు. కొత్త ఔషధాలను ఆవిష్కరించే కార్యక్రమంలో భాగంగా ఇవి చేపట్టినట్లు తెలిపారు. బ్లడ్‌క్యాన్సర్ నివారణ ఔషధాన్ని ఆవిష్కరించడంతో పాటు, విక్రయాలు జరిపేందుకు అంతర్జాతీయ ఔషధ సంస్థ ఆబ్‌వీతో ఇటీవలే లుపిన్ ఒప్పందం చేసుకుంది. క్యాన్సర్, వ్యాధినిరోధకశక్తి, జీవక్రియ రుగ్మతల వంటి భిన్న ఆరోగ్యపరమైన అంశాలపై పరిశోధనలు జరిపి, వినూత్న ఔషధాలను ఆవిష్కరించే క్రమంలో ఉన్నట్లు రాజ్ వివరించారు. రాబోయే 2-3 ఏళ్లలో సరికొత్త ఔషధాలను తొలిసారిగా ఆవిష్కరించాలన్నది లక్ష్యంగా తెలిపారు. మూత్రపిండాల వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ ఔషధాలను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు.

జే&కే బ్యాంక్ లాభంలో 43% వృద్ధి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్ (జే అండ్ కే బ్యాంక్) రూ.103.75 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2017-18 ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.72.47 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 43 శాతం అధికం. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.1790.77 కోట్ల నుంచి రూ.2,184.22 కోట్లకు పెరిగింది.. మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 10.08 శాతం నుంచి 9.94 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 4.29 శాతం నుంచి 4.59 శాతానికి పెరిగాయి. రెండో త్రైమాసికంతో పోలిస్తే ఎన్‌పీఏ కవరేజీ నిష్పత్తి 65.82 శాతానికి తగ్గింది.

గోడ గొడవతో అమెరికా కుదేలు

- ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- వారానికి రూ.8,400 కోట్లు ఆవిరి
- వేతనాల్లేక ఫెడరల్ ఉద్యోగుల ఇక్కట్లు
- పూట గడవడానికి టీవీలు అమ్ముకుంటున్న దీనస్థితి
- విమానాశ్రయాల భద్రతకు పొంచి ఉన్న ముప్పు




వాషింగ్టన్: సరిహద్దు గోడ గొడవ అగ్రరాజ్యం అమెరికాకు ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తోంది. ప్రభుత్వ పాక్షిక షట్‌డౌన్ ప్రభావం కేవలం ఉద్యోగులకు పరిమితం కావడం లేదు. దేశవ్యాప్తంగా ఆర్థిక, రవాణా, భద్రత, వ్యవసాయం వంటి అన్ని రంగాలను తాకుతోంది.

అమెరికాలో ప్రభుత్వం మూతపడటం ఇదే తొలిసారి కాదు. 1976 నుంచి ఇప్పటివరకు 21 సార్లు ఇలా జరిగింది. సుదీర్ఘకాలం కొనసాగిన షట్‌డౌన్ మాత్రం ఇదే. గతంలోనూ ప్రభుత్వం మూతపడినప్పుడు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడింది. మునుపటితో పోలిస్తే ఈ దఫా మాత్రం ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంటోందని ఆర్థికరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గోడ సొమ్ము 5 వారాల్లో ఆవిరి!

షట్‌డౌన్ కారణంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ నుంచి వారానికి సుమారు రూ.8,400 కోట్ల సంపద ఆవిరవుతోందన్నది ఆర్థిక రంగ నిపుణుల అంచనా. ప్రభుత్వం మూతపడి ఇప్పటికే మూడు వారాలవుతోంది. అంటే రూ.25,200 కోట్లు నష్టపోవాల్సి వచ్చిందన్నమాట. మరో రెండు వారాలు పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ లెక్క రూ.42 వేలకోట్లకు చేరుతుంది. గోడ నిర్మాణం కోసం ట్రంప్ డిమాండ్ చేస్తున్న నిధుల కంటే ఇలా 5 వారాల్లో నష్టపోతున్న మొత్తం ఎక్కువ కావడం గమనార్హం.



23 రోజులు — షట్‌డౌన్ ప్రారంభమై ఆదివారం నాటికి..

8 లక్షలు — వేతనాలకు దూరమైన ఫెడరల్ ఉద్యోగుల సంఖ్య

1.2 బిలియన్ డాలర్లు — ప్రతివారం ఆవిరవుతున్న సంపద (రూ.8,400 కోట్లు)

5.7 బిలియన్ డాలర్లు — గోడ కోసం ట్రంప్ డిమాండ్ చేస్తున్న మొత్తం (రూ.39,900 కోట్లు)

పరిశోధనలకు బ్రేక్

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా', జాతీయ మహాసముద్ర-వాతావరణ పరిశోధన సంస్థ(ఎన్‌వోఏఏ) వంటి కీలక సంస్థల్లో పరిశోధనలు నిలిచిపోయాయి. శాస్త్రవేత్తలెవరూ సదస్సులకు హాజరవ్వడం లేదు. పరిశోధనలకు నిధులు సమకూర్చే నేషనల్ సైన్స్ ఫౌండేషన్ ప్రస్తుతం తమకు అందుతున్న ప్రతిపాదనలను పరిశీలించడం లేదు.

పర్యాటక రంగం కుదేలు

అమెరికాలో పర్యాటక రంగానికి ప్రముఖ స్థానముంది. దేశవ్యాప్తంగా 400 జాతీయ పార్కుల ద్వారా ఖజానాకు రోజుకు 18 మిలియన్ డాలర్లు అందేవి. షట్‌డౌన్ కారణంగా జనం పార్కులకు వెళ్లట్లేదు. వాటిలో చాలారకాల సేవలు నిలిచిపోయాయి.

ఇంట్లో సామగ్రి అమ్ముకుంటున్నారు

ఫెడరల్ ఉద్యోగులు అద్దె, తాకట్టు చెల్లింపులు, గృహరుణాల కింద నెలనెలా చెల్లించాల్సిన మొత్తం విలువ 438 మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని స్థిరాస్తి సంస్థ 'జిలో' అంచనా వేసింది. వేతనాలు అందకపోవడంతో ఈ మొత్తాన్ని వారు చెల్లించే అవకాశాలు దాదాపు శూన్యం! ఫెడరల్ ఉద్యోగుల్లో 20 శాతంమంది వాషింగ్టన్ డి.సి ప్రాంతంలోనే ఉంటారు. ప్రస్తుతం అక్కడి రెస్టారెంట్లు కస్టమర్లు లేక బోసిపోతున్నాయి. టాక్సీలు రోడ్డెక్కడం లేదు. ఎప్పుడూ రద్దీగా ఉండే రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. చాలామంది ఉద్యోగులు పూట గడవడం కోసం ఇంట్లోని సామాన్లను అమ్ముకుంటున్నారు. టీవీలు, టైర్లు, ఖరీదైన జాకెట్ల వంటి వస్తువులను విక్రయానికి ఉంచుతుండటం వారి దీనస్థితికి అద్దం పడుతోంది.

పరిహారం అందని రైతులు


చైనాతో ట్రంప్ వాణిజ్య యుద్ధం కారణంగా ఇప్పటికే అమెరికాలో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. షట్‌డౌన్‌తో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లయింది వారి పరిస్థితి. సోయాబీన్ ధరల అనూహ్య పతనం కారణంగా నష్టపోతున్న రైతులకు పరిహారం ఇస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం పరిహారాన్ని ఆపేశారు. విత్తనాలు, పశువుల దాణా కొనుగోలుకు ప్రభుత్వ రుణాలు నిలిచిపోయాయి.

పెళ్లిళ్లూ ఆగిపోయాయ్

షట్‌డౌన్ ప్రభావం పెళ్లిళ్లపై కూడా పడింది. రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడంతో చాలామంది వివాహాలను వాయిదా వేసుకున్నారు. మరికొంతమంది మాత్రం ముందుగా నిర్ణయించుకున్న తేదీల్లో వివాహ వేడుకలు జరుపుకొంటున్నారు. ప్రభుత్వ సేవలు పునఃప్రారంభమైన తర్వాత వివాహాలను చట్టప్రకారం నమోదు చేసుకుంటామని చెబుతున్నారు. వాషింగ్టన్ డి.సి మేయర్ మురియెల్ బౌసర్ పెళ్లిళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకుగాను వాటి నమోదుకు వీలుకల్పిస్తూ శుక్రవారం అత్యవసర ఆదేశాలు జారీ చేశారు.

అసలేం జరిగింది?

అక్రమ వలసలను అడ్డుకునేందుకుగాను మెక్సికోతో సరిహద్దుల్లో గోడ నిర్మాణం అత్యావశ్యకమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నొక్కిచెప్తున్నారు. అందుకోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకు కాంగ్రెస్ ససేమిరా అనడం, గోడకు నిధులు కేటాయించని బడ్జెట్‌ను తాను ఆమోదించబోనని ట్రంప్ భీష్మించుకొని కూర్చోవడం కారణంగా గత నెల 22 నుంచి పలు ప్రభుత్వ విభాగాలకు నిధులు నిలిచిపోయాయి. ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది.



విమానాశ్రయాల్లో ఇక్కట్లు

అమెరికా విమానాశ్రయాల్లో ప్రయాణికులను తనిఖీ చేసే 'ట్రాన్స్‌పోర్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్(టీఎస్ఏ)' ప్రభుత్వ విభాగమే. వేతనాల చెల్లింపు లేకపోవడంతో టీఎస్ఏ ఉద్యోగులు చాలామంది విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో విమానాశ్రయాల్లో తనిఖీలు ఆలస్యమవుతున్నాయి. ప్రయాణికులు గంటలకొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. సిబ్బంది కొరతతో తనిఖీలు తూతూమంత్రంగా సాగే అవకాశముందని.. ఫలితంగా విమానాశ్రయాల భద్రతకు ముప్పు ఏర్పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



అకృత్యకాండ

- బాలికపై మూడేళ్లుగా పలువురి అత్యాచారం!
- తొలుత మత్తు మందు ఇచ్చి బంధువు అఘాయిత్యం
- సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి స్నేహితులకు చేరవేత
- దీని ఆసరాగా బెదిరిస్తూ దురాగతానికి పాల్పడిన నిందితులు
- హైదరాబాద్‌లో ఆలస్యంగా వెలుగులోకి
- ముగ్గురి అరెస్ట్


నిందితుడు రాజేశ్‌ముద్దా

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాజధానిలో చోటు చేసుకున్న ఘోరం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తొలుత ఓ యువకుడు సమీప బంధువైన బాలికకు మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేయడం.. ఆ విషయం తెలిసిన అతడి స్నేహితులు ఒకరి తర్వాత మరొకరు మూడేళ్లుగా అఘాయిత్యానికి పాల్పడుతున్న దురాగతం ఆదివారం బహిర్గతమైంది. హైదరాబాద్‌లోని పాతబస్తీ కామాటిపురా పోలీసుస్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి కామాటిపురా మురళీనగర్‌లో ఉంటూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతని కుమార్తె(16) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే ఇంట్లో పైఅంతస్తులో వ్యాపారి సోదరి కుమారుడు రాజేశ్‌ముద్దా అలియాస్ రాజు ఉండేవాడు. జగదీశ్ మార్కెట్‌లో ఓ దుకాణంలో పనిచేసేవాడు. 2015లో ఓరోజు వ్యాపారి కుమార్తెకు మత్తు మందు కలిపిన శీతలపానీయం ఇచ్చి అత్యాచారం చేశాడు. ఆ సమయంలో కొన్ని దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. కొంతకాలం తర్వాత బాలిక కుటుంబీకులతో వచ్చిన విభేదాల కారణంగా మకాం మార్చేశాడు.

మద్యం మత్తులో స్నేహితులకు

ఓసారి మద్యం సేవించిన క్రమంలో విషయాన్ని తన స్నేహితులు శుభం వ్యాస్(25), అభిజిత్(24)కు చెప్పడమే కాక తన సెల్‌ఫోన్‌లోని దృశ్యాలను వారికి పంపాడు. వాటిని తమ ఫోన్లలో నిక్షిప్తం చేసుకున్న వ్యాస్, అభిజిత్ బాలికను బెదిరించి ఒకరి తర్వాత మరొకరు వీలు చిక్కినప్పుడల్లా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. విషయం బయటికి చెబితే కుటుంబసభ్యులను చంపుతామని బెదిరించడంతో బాలిక మిన్నకుండిపోయింది. ఇటీవలికాలంలో వేధింపులు అధికం కావడంతో తల్లిదండ్రులకు చెప్పింది. గత నెల 24న బాధిత కుటుంబం కామాటిపురా పోలీసులను ఆశ్రయించడంతో విషయం బహిర్గతమైంది. తనపై పలువురు అత్యాచారం చేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అదే నెల 31న అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

బాధితురాలి బంధువుల ఆందోళన

కేసు దర్యాప్తులో పారదర్శకత కొరవడిందని బాధితురాలికి మద్దతుగా పలువురు ఆదివారం మురళీనగర్‌తోపాటు ఠాణా ఎదుట ఆందోళన చేపట్టారు. మరో నిందితుడు విజయ్‌కుమార్ (25)ను కేసులో సాక్షిగా చేర్చారని, మరికొందరు నిందితులను పట్టుకోలేదంటూ ఆందోళనకారులు నిరసనకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దక్షిణ మండలం, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీలు రఫీక్, చైతన్యకుమార్ బృందం ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించారు. ఇప్పటికే అరెస్టయిన ముగ్గురు నిందితులతోపాటు విజయ్‌కుమార్, మరో ఏడుగురు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు ఈ సందర్భంగా వెల్లడించింది. మరోమారు కేసు దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. బాధితుల ఆందోళన నేపథ్యంలో కేసు దర్యాప్తు బాధ్యతను ఏసీపీ శ్రీదేవికి అప్పగిస్తున్నట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు.

పెళ్లి కానుక ఈ నెలలోనే

- 29,385 జంటలు అర్హులుగా గుర్తింపు
- నియోజకవర్గ కేంద్రాల్లో పంపిణీ

ఈనాడు డిజిటల్ - అమరావతి

కొత్త జంటలకు పెళ్లి కానుకలు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది ఏప్రిల్ 20 నుంచి అక్టోబర్ 30 మధ్య వివాహం చేసుకొని 'చంద్రన్న పెళ్లి కానుక' సాయం పొందని వారికి అతిథుల సమక్షంలో కానుక ఇవ్వాలని నిర్ణయించింది. లబ్ధిదారులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేరుతో ప్రత్యేక ఆహ్వానాన్ని పంపనున్నారు. జనవరి చివరి వారంలో కానుకను అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నిర్దేశిత కాలంలో వివాహం చేసుకొని పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోక లబ్ధిపొందలేని వారికి నవంబర్ 1 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించింది. మండల వెలుగు కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించింది. ఇలా 30 వేల దరఖాస్తులు అందాయి. వీటిని వివిధ శాఖల మండల వసతి గృహ అధికారులతో తనిఖీ చేయించిన ప్రభుత్వం 29,385 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తించింది. వీరందరికీ ఒకేసారి సాయం అందించనుంది. ఇందుకు రూ.120 కోట్లు వ్యయం కానుంది.



దివ్యాంగులకు రూ.లక్ష
ఎస్టీలు, మైనారిటీలకు రూ.50 వేలు
ఎస్సీలకు రూ.40 వేలు
బీసీలకు రూ.35 వేల చొప్పున
పెళ్లికానుక అందజేస్తారు

పెళ్లి కానుక పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వేడుకగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. లబ్ధిదారులందరినీ నియోజకవర్గ కేంద్రానికి పిలిచి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సాయాన్ని అందిస్తారు. కొత్త జంటలకు భోజనాన్ని పెట్టించనున్నారు.

జిల్లాల వారీగా లబ్ధిదారులు

జిల్లా	ఎస్సీలు	ఎస్టీలు	బీసీలు	దుల్హన్	దివ్యాంగులు	భవన నిర్మాణ కార్మికులు
అనంతపురం	142	637	1420	436	76	0
చిత్తూరు	67	537	781	268	26	0
తూర్పుగోదావరి	214	1,161	1,729	58	70	33
గుంటూరు	159	850	812	472	49	12
కృష్ణా	77	796	1,004	216	33	8
కర్నూలు	107	1,174	2,049	844	80	2
ప్రకాశం	84	653	787	278	29	4
నెల్లూరు	98	622	604	207	34	3
శ్రీకాకుళం	183	258	1,313	7	35	0
విశాఖపట్నం	405	240	1,394	0	52	9
విజయనగరం	174	227	1,150	12	43	0
పశ్చిమగోదావరి	64	904	1,177	93	49	4
కడప	56	489	664	550	31	0
మొత్తం	1,830	8,548	14,884	3,441	607	75

లద్దాఖ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద సౌర విద్యుత్ కేంద్రం

2023 కల్లా నిర్మాణం పూర్తి

దిల్లీ: పర్వతాలు, సరస్సులు, ప్రకృతి సోయగాలతో కనువిందు చేసే లద్దాఖ్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన సౌర విద్యుత్ కర్మాగారం ఏర్పాటు కానుంది. 25వేల ఎకరాల్లో ఐదు వేల మెగావాట్ల సామర్థ్యంతో దీన్ని నిర్మించనున్నారు. ఒకే ప్రాంతంలో ఇంత భారీ విస్తీర్ణంలో ఇప్పటివరకూ ఏ సౌర విద్యుత్ కర్మాగారామూ ఏర్పాటు కాలేదు. జమ్మూకశ్మీర్‌లోనే ఉన్న కార్గిల్‌లో 12.5 వేల ఎకరాల విస్తీర్ణంలో 2,500 మెగావాట్ల సామర్థ్యంతో మరొకదాన్ని నిర్మించనున్నారు. ఈ రెండు కర్మాగారాల ద్వారా ఏటా 12,750 టన్నుల మేర కర్బన ఉద్గారాలను తగ్గించుకునే అవకాశం ఉంది. స్థానిక ప్రజలకు జీవనోపాధి కలగడంతోపాటు సంవత్సరంలో ఏడెనిమిది నెలలు విద్యుత్ కోసం డీజిల్ జనరేటర్లపై ఆధారపడాల్సిన అగత్యం తప్పుతుంది. కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలోని భారత సౌర విద్యుత్ సంస్థ (ఎస్ఈసీఐ) ఈ కర్మాగారాల నెలకొల్పనకు కృషి చేస్తోంది. రూ.45వేల కోట్ల అంచనా వ్యయంతో 2023 కల్లా వీటిని నిర్మించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. లద్దాఖ్‌లోని హన్లెఖాల్డో, కార్గిల్‌లోని సురుల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. లద్దాఖ్‌లో ఉత్పత్తైన విద్యుత్‌ను హరియాణాలోని కైథల్‌కు సరఫరా చేస్తారు. ఇందుకోసం లెహ్-మనాలీ మార్గం వెంబడి 900 కి.మీ.ల మేర లైన్ వేయనున్నారు. కార్గిల్ ప్రాజెక్టును శ్రీనగర్‌కు సమీపంలోని న్యూ వాన్‌పోలో ఉన్న గ్రిడ్‌తో అనుసంధానిస్తారు. ఈ ప్రాజెక్టులకు కేటాయించిన భూములపై లెహ్, కార్గిల్ పర్వత ప్రాంత అభివృద్ధి మండళ్లకు ఏటా హెక్టారుకు రూ.1200 (3% వార్షిక పెంపు) చొప్పున అద్దె రూపంలో ఆదాయం వస్తుందని ఎస్ఈసీఐ డైరెక్టర్ (పవర్ సిస్టమ్స్) ఎస్కే మిశ్ర తెలిపారు.

చందమామపై రాత్రి ఉష్ణోగ్రత లెక్క తేలుతుంది

బీజింగ్: చంద్రుడిపై రాత్రి సమయంలో నమోదయ్యే శీతల ఉష్ణోగ్రతను చైనా రోవర్ చాంగే-4 నిర్ధరించనుంది. దీని ద్వారా జాబిల్లి ఉపరితల తీరుతెన్నులపై కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. చందమామ పరిభ్రమణ కాలం, భ్రమణ కాలం ఒకేలా ఉంటుంది. అందువల్ల భూమి మీద నుంచి చూసినప్పుడు జాబిల్లికి సంబంధించిన ఒకవైపు మాత్రమే ఎప్పుడూ కనపడుతుంది. ఆవలి భాగం కనిపించదు. ఈ భాగం గుట్టుమట్లు విప్పేందుకు చాంగే-4 పేరుతో ల్యాండర్‌ను, రోవర్‌ను చైనా పంపింది. జాబిల్లిపై పగటి సమయం నిడివి భూమి మీద 14 రోజులతో సమానం. రాత్రి వ్యవధి కూడా ఇలానే ఉంటుంది. అయితే పగలు, రాత్రి మధ్య ఉష్ణోగ్రత వైరుధ్యాలు అసాధారణంగా ఉంటాయి. పగటివేళ అవి 127 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోవచ్చని, రాత్రివేళ కనిష్ఠంగా మైనస్ 183 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు శాస్త్రవేత్తల్లో ఉన్నాయి. అయితే వీటికి సంబంధించి కచ్చితమైన డేటా లేకుంటే చంద్రుడిపై రాత్రివేళ ఎంత శీతలంగా ఉంటుందన్నది మనకు తెలియదని చైనా అంతరిక్ష పరిశోధకుడు ఝూంగ్ హి చెప్పారు. ఉష్ణోగ్రత వైరుధ్యాలను చాంగే-4 కొలుస్తుందని, తద్వారా చంద్రుడి ఉపరితలం లక్షణాల గురించి అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. చందమామ రాత్రి వేళలోకి జారిపోయినప్పుడు సౌరశక్తి అందుబాటులో ఉండనందువల్ల ఈ వ్యోమనౌకను 'నిద్రాణ స్థితి'లో ఉంచుతామన్నారు. అయినా ఆ స్థితిలో రేడియోధార్మిక ఐసోటోప్ ద్వారా ఉష్ణాన్ని విడుదల చేసి, ఆ వేడిని శక్తిగా మారుస్తామని తెలిపారు. ఈ శక్తిని ఉపయోగించుకొని చంద్రుడిపై రాత్రివేళ ఉష్ణోగ్రతను కొలిచే యంత్రాలను పనిచేయిస్తామని చెప్పారు.

హవాలా మార్గాల్లో హాంకాంగ్‌కు రూ.120 కోట్ల తరలింపు

మహారాష్ట్రలో సహకార సంఘం మాజీ మేనేజర్ అరెస్టు

దిల్లీ: హవాలా మార్గాల్లో హాంకాంగ్‌లోని డొల్ల కంపెనీలకు రూ.120 కోట్ల మేర తరలించిన ఆరోపణలపై మహారాష్ట్రలో ఓ సహకార సంఘం మాజీ మేనేజర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసింది. అహ్మద్‌నగర్ జిల్లాలోని 'రేణుకామాత మల్టీ-స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ క్రెడిట్ సొసైటీ' మాజీ మేనేజర్ మచింద్ర ఖడే పలు బ్యాంకు ఖాతాల ద్వారా నగదు అక్రమ చలామణికి పాల్పడినట్లు ఈడీ అధికారులు ఆరోపించారు. వజ్రాలు దిగుమతి చేసుకుంటున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించడం ద్వారా అతడు భారీగా నిధులను హాంకాంగ్‌కు చేరవేశాడని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నిందితుడు పలువురు ఖాతాదారుల సంతకాలతో కూడిన ఖాళీ 'రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్(ఆర్‌టీజీఎస్)' పత్రాలను సేకరించాడని, అవసరంలో ఉన్నవారి నుంచి కమీషన్ తీసుకుంటూ ఆ పత్రాల ద్వారా నిధులను దేశం వెలుపలికి పంపించాడని వివరించారు. ఖడేను అరెస్టు చేసినట్లు ఆదివారం వెల్లడించారు.

బంగ్లాదేశ్‌లో వస్త్ర పరిశ్రమల కార్మికుల సమ్మె తీవ్రం

నిరసనకారులు, పోలీసులకు మధ్య ఘర్షణ

ఢాకా: బంగ్లాదేశ్‌లో దుస్తుల పరిశ్రమ కార్మికుల సమ్మె ఉద్ధృతమవుతోంది. తమకు నామ మాత్రపు వేతనం చెల్లిస్తున్నారంటూ బంగ్లాదేశ్‌లో వేల మంది దుస్తుల పరిశ్రమ కార్మికులు వారం రోజుల నుంచీ సమ్మె చేస్తున్నారు. ఆదివారం నాడు వారు తమ నిరసన కార్యక్రమాలను కొనసాగించడంతో దేశంలోని దాదాపు 52 కర్మాగారాల్లో పనులు నడవలేదు. ఆదివారం నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, పోలీసులకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఆందోళనకారుల గుంపులను చెదరగొట్టేందుకు పోలీసులు నీటి ఫిరంగులు, బాష్పవాయుగోళాలను ప్రయోగించాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో రెడీమేడ్ దుస్తుల తయారీ పరిశ్రమ విస్తృతంగా పరిఢవిల్లుతోంది. లక్షల మంది దర్జీపనివారు తక్కువ వేతనాలకే ఇక్కడి దుస్తుల ఫ్యాక్టరీల్లో పని చేస్తుంటారు.



గాలిపటం.. గరుడ రాజసం!

సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో ఆదివారం తిరుపతి నగరంలోని తితిదే మైదానంలో గాలిపటాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పతంగులను ఎగరవేశారు. వివిధ ఆకారాల్లో రూపొందించిన ఆయా గాలిపటాలు ఆకాశంలో ఎగురుతూ చూపరులను అలరించాయి. వాటిల్లో గరుడ రూపంలో ఉన్న ఓ పతంగం ఇలా తిరుగిరులకు రక్షణగా, వాటిని పర్యవేక్షిస్తూ విహరిస్తున్నట్లు గోచరించి ఆకట్టుకుంది. - ఈనాడు, తిరుపతి

ఆసుపత్రిపాలైన వృద్ధులకు అదనపు ఆహారంతో చక్కబడిన ఆరోగ్యం!

లండన్: రోజుకు అదనంగా ఓ భోజనాన్ని అందచేసినందుకు బ్రిటన్‌లోని ఆసుపత్రుల్లో ఉన్న వేల మంది వయోవృద్ధ రోగుల ప్రాణాలు నిలబడ్డాయి. బ్రిటన్‌లోని పలు ఆసుపత్రుల్లో అనారోగ్యపీడితులైన వృద్ధులకు అదనంగా ఓ భోజనాన్ని అందచేసినట్లు ఆరోగ్యరంగ నిపుణులు వెల్లడించారు. దీంతో, ఆహారం, పోషకవిలువలు చాలక ఆసుపత్రిలోనే వారు తనువుచాలించే అవకాశాలు దాదాపుగా తగ్గిపోయాయి. జాతీయ వైద్య సేవ(ఎన్‌హెచ్ఎస్) కింద ఈ పథకాన్ని రెండేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా ప్రభుత్వం చేపట్టింది. ముఖ్యంగా తుంటిఎముక విరిగిపోయి ఆసుపత్రిపాలైన వారికి ఇలా ఆహారాన్ని అందచేయడం వల్ల ఎంతో మెరుగుదల కనిపించింది. తుంటిఎముక విరిగి ఆసుపత్రి వార్డుల్లో చేరిన వయోవృద్ధులు కోలుకుంటున్న తరుణంలో తగినంత పౌష్టికాహారాన్ని స్వీకరించలేకపోతున్నారు. దీంతో అలాంటి వారిలో చాలామంది శస్త్రచికిత్స పూర్తయిన నెల రోజుల్లోపలే మరణిస్తున్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం చిత్తశుద్ధి సేవాభావం మెండుగా ఉన్న పౌష్టికాహార నిపుణులకు ప్రత్యేకంగా ఆయా వార్డుల్లోని వృద్ధరోగులకు ఆహారం అందించే బాధ్యతను అప్పగించింది.

ఐటీ వినియోగంతో పాలనలో పారదర్శకత

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాలనలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విస్తృత వినియోగంతో పారదర్శకతకు అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, చీఫ్ స్టాటిషియన్ ఆఫ్ ఇండియా ప్రవీణ్ శ్రీవాత్సవ అన్నారు. ప్రభుత్వంలో వివిధ విభాగాలు ఐటీని వినియోగించడం విస్తృతంగా పెరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ (ఎంఓఎస్‌పీఐ), ఏఐఎంసీఎస్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన బిగ్‌డేటా ఎనాలసిస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పనితీరు సామర్థ్యాన్ని పెంచడానికి ఐటీ, కొత్త సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుందన్నారు.

లండన్ అవకాశాన్ని కాదన్న జస్టిస్ ఎ.కె. సిక్రీ

కాంగ్రెస్ అభ్యంతరాల నేపథ్యంలో నిర్ణయంలో మార్పు



దిల్లీ: కామన్‌వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రల్ ట్రైబ్యునల్ (సీఎస్‌ఏటీ)లో అధ్యక్ష లేదా సభ్యుడి స్థానానికి తన పేరును నామినేట్ చేసేందుకు కేంద్రానికి తెలిపిన అంగీకారాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. కె. సిక్రీ ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ప్రభుత్వానికి సిక్రీ లేఖరాసినట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. డిసెంబర్ తొలివారంలో సీఎస్‌ఏటీ పదవికి జస్టిస్ సిక్రీ పేరు నామినేట్ చేస్తామని కేంద్రం ముందుకు వచ్చిందని, అప్పుడే ఆయన అంగీకారం తెలిపారని వివరించాయి. కామన్‌వెల్త్ దేశాల ప్రభుత్వాల మధ్య సహకారం కోసం 1965లో కామన్‌వెల్త్ సెక్రటేరియట్ ఏర్పాటైంది. ఇందులోని కాంట్రాక్టులపై తలెత్తే వివాదాలను సీఎస్‌ఏటీ పరిష్కరిస్తుంది. దీనిలో అధ్యక్షుడు సహా ఎనిమిది మంది సభ్యులు ఉంటారు.

సిక్రీ నామినేషన్ గురించి కేంద్రం సీఎస్‌ఏటీకి సమాచారం ఇచ్చినట్లు ఆదివారం తొలుత వార్తలు వచ్చాయి. ఈ పరిణామంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సీనియర్ నాయకుడు అహ్మద్ పటేల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి వర్మను తొలగించాలని నిర్ణయించిన కమిటీలో జస్టిస్ సిక్రీ సభ్యుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ఆ కమిటీలో ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఉన్నారు. ఆలోక్‌ను తొలగించాలని మోదీ అభిప్రాయపడగా.. ఖర్గే విభేదించారు. ఈ దశలో జస్టిస్ సిక్రీ ఓటు కీలక పాత్ర పోషించింది. ఆయన కూడా ఆలోక్ తొలగింపునకే మొగ్గు చూపారు. దీంతో ఆలోక్ ఉద్వాసనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో జస్టిస్ సిక్రీ పేరును సీఎస్‌ఏటీకి నామినేట్ చేయడంపై మోదీ ప్రభుత్వం సంజాయిషీ ఇచ్చుకోవాలని అహ్మద్ పటేల్ ట్విటర్‌లో వ్యాఖ్యానించారు. ''న్యాయపు త్రాసును తమకు అనుగుణంగా మార్చుకుంటున్నారు. రఫేల్ ఒప్పందంలోని అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మోదీ దేనికీ వెనుకాడరు. ఆ భయంతోనే కీలక సంస్థలను ఆయన ధ్వంసం చేస్తున్నారు'' అని రాహుల్ ట్వీట్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో వివాదానికి దూరంగా ఉండాలని నామినేషన్‌కు తెలిపిన అంగీకారాన్ని జస్టిస్ సిక్రీ ఉపసంహరించుకున్నారని ఆయన సన్నిహితులు తెలిపారు. సీఎస్‌ఏటీ సభ్యుడు లండన్‌లో ఏడాదికి రెండు లేదా మూడు విచారణలకు హాజరుకావాల్సి ఉంటుందని, ఈ పదవికి వేతనమేమీ రాదని వివరించారు. ఈ వ్యవహారంపై కేంద్ర న్యాయ శాఖ ఇంకా స్పందించలేదు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సిక్రీ మార్చి 6న పదవీ విరమణ చేయనున్నారు.

విపక్షాలు కుటుంబ సామ్రాజ్యాలు

- వారివి ఓటు బ్యాంకు రాజకీయాలు
- ప్రజలకు అధికారం ఇచ్చేది భాజపా ఒక్కటే
- ప్రధాని మోదీ వ్యాఖ్యలు

దిల్లీ: ప్రతిపక్షాలవి వారసత్వ, అవకాశవాద రాజకీయాలని; అవన్నీ కుటుంబ సామ్రాజ్యాలను విస్తరింపజేసుకోవాలని ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. భాజపా మాత్రం ప్రజలకు అధికారం ఇవ్వడానికి కృషి చేస్తోందని అన్నారు. ఆదివారం తమిళనాడుకు చెందిన అయిదు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని పార్టీ బూత్‌స్థాయి కార్యకర్తలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎస్పీ-బీఎస్పీల మధ్య పొత్తు కుదిరిన నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యకు ప్రాధాన్యం ఏర్పడింది. ''ఒకవైపు మన అభివృద్ధి ప్రణాళిక ఉంది. అటువైపు అవకాశవాద, వారసత్వ రాజకీయాలు ఉన్నాయి. మన ప్రణాళికను మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఈ ఎన్నికలు అవకాశం కల్పిస్తాయి. మనది అందరి అభివృద్ధిని ఆకాంక్షించే అజెండా. వారిది విభజన వాదం, ఓటు బ్యాంకు రాజకీయాలు'' అని విమర్శించారు. భాజపా కార్యకర్తలకు దేశ ప్రయోజనాలే ముఖ్యమని, వ్యక్తిగత స్వార్థంతో పనిచేయరని అన్నారు. సామాజికవర్గానితో సంబంధం లేకుండా వారు పార్టీలో ఏ స్థాయికైనా చేరవచ్చని చెప్పారు. ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను చూసి అసూయ చెందుతున్న విపక్షాలు లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. మొదటిసారి ఓటర్లంతా తమ తొలి ఓటును భాజపాకు వేసేటట్టు చూడాలని కార్యకర్తలను కోరారు. వచ్చే ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని, ఈ విజయానికి జెండా మోసే కార్యకర్తలే తప్ప, మోదీయో మరో నాయకుడో కారణం కాదని అన్నారు.

గురు గోవింద్ సింగ్ స్మారక రూ.350 వెండి నాణెం విడుదల



రూ.350 వెండి నాణేన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పక్కన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న కర్తార్‌పుర్ సాహిబ్‌ను దేశ విభజన సందర్భంగా భారత్‌లో చేర్చకపోవడం కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పిదమని మోదీ విమర్శించారు. ఆదివారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సిక్కుల పదో గురువు.. గురు గోబింద్ సింగ్ 350వ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం రూ.350 వెండి నాణేన్ని విడుదల చేశారు. సిక్కు మత వ్యవస్థాపకుడు గురు నానక్ 1469 ఏప్రిల్ 5న నానక్ సాహిబ్ (ప్రస్తుతం పాక్‌లో ఉంది) జన్మించగా, చివరి నాలుగేళ్లు కర్తార్‌పుర్‌లో గడిపారు. 1539 సెప్టెంబరు 22న అక్కడే కన్నుమూశారు. సిక్కులకు ఎంతో పవిత్రమైన ఈ ప్రాంతం భారత సరిహద్దుకు కేవలం కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉందని మోదీ చెప్పారు. అక్కడికి వెళ్లడానికి వీల్లేకపోవడంతో దుర్బిణి సాయంతో అక్కడి గురుద్వారాను దర్శించుకుంటున్నారని చెప్పారు. 1947లో దేశవిభజన సమయంలోనే దాన్ని భారత్‌లో కలిపి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదని అన్నారు. ప్రస్తుతం కర్తార్‌పుర్ నడవా ఏర్పాటు చేయడంతో భక్తులు అక్కడికి వెళ్లడానికి వీలు కలిగిందని తెలిపారు. గురు నానక్‌గానీ, గురు గోబింద్‌గానీ న్యాయం వైపు ఉండాలని బోధించారని అన్నారు. 1984 నాటి సిక్కుల ఊచకోతలో బాధితులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్ పాల్గొన్నారు.

చైనా సరిహద్దుల్లో 44 వ్యూహాత్మక రహదారులు

దిల్లీ: చైనా సరిహద్దుల వెంబడి 44 వ్యూహాత్మక రహదారుల నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటికితోడు పాకిస్థాన్‌తో సరిహద్దు కలిగిన పంజాబ్, రాజస్థాన్‌లో 2100 కి.మీ. మేర రోడ్లు వేయనుంది. కేంద్ర ప్రజాపనుల శాఖ (సీపీడబ్ల్యూడీ) వార్షిక నివేదికలో ఈవివరాలు పొందుపరిచారు. వ్యూహాత్మక రోడ్ల నిర్మాణానికి రూ. 21,040కోట్లు అవసరమవుతాయని అంచనా.

చొరవచూపి ఇంజినీరును కాపాడిన వైమానిక దళం

లద్దాఖ్: మంచుముద్దలా మారిన ఇక్కడి జన్‌స్కర్ నది ఉపరితలం మీద అడుగు వేసి ఒక్కసారిగా మంచుఫలకం కదిలిపోవడంతో అడుగునే ఉన్ననీళ్లల్లోకి పడిపోయిన ఓ ఇంజినీర్‌ను వైమానిక దళ సిబ్బంది వెంటనే రక్షించారు. ముంబయికి చెందిన సాగర్ అనే ఓ ఇంజినీరు తన బృందంతో కలిసి గడ్డకట్టిన నదిమీదుగా ప్రయాణించాల్సి వచ్చింది. ఆయన ముందున్న నలుగురైదుగురు సురక్షితంగా దాటడంతో వారి అడుగుజాడలను సాగర్ అనుసరించారు. ఉన్నట్టుండి పెళుసుగా ఉన్న మంచు ఫలకం కుంగిపోయింది. ఒళ్లు గడ్డకట్టించే చన్నీళ్లలోకి కూరుకుపోతున్న అతడిని అటుగా వెళుతున్న భారత వైమానిక దళ (ఐఏఎఫ్) అధికారుల బృందం చూసింది. వెంటనే ఆ బృందం సభ్యులు అక్కడికి పరుగున వచ్చేశారు. తమ వద్ద ఉన్న సామగ్రి సాయంతో అతడిని మంచు నీటి లో సమాధికాకుండా నిలువరించారు. తన ప్రాణాలు కాపాడిన వైమానిక దళ అధికారులకు బాధితుడు ట్విటర్‌లో కృతజ్ఞతలు తెలిపారు.

శివసేనను చిత్తు చేసేవారు ఇంకా పుట్టలేదు: ఉద్ధవ్ ఠాక్రే

ముంబయి: శివసేనను చిత్తు చేసేవారు ఇంకా పుట్టలేదని ఆ పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ప్రధాని మోదీని కొందరు నేతలు విష్ణువు అవతారంగా వర్ణిస్తున్నారని, ఆయన మాత్రం అయోధ్యలో రామమందిరం నిర్మించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పొత్తుపై భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో ఠాక్రే ఈ వ్యాఖ్యలు చేశారు.



జమ్మూకశ్మీర్‌లో హిమపాతం వల్ల రహదారులపై ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై మంచును ఆదివారం బుల్డోజర్ సాయంతో ఇలా తొలగించారు.



బీజింగ్‌లో జిన్ అనే 25ఏళ్ల చైనా యువతి ఏర్పాటు చేసిన 'యాంగర్ రూమ్'. మన కోపాన్ని ఇక్కడున్న పాత టీవీలు, గడియారాలు, టెలిఫోన్లు, బొమ్మలు, గాజు సీసాలపై చూపించొచ్చు.



కేరళలోని శబరిమల దేవాలయం భక్తులతో ఇలా కిటకిటలాడుతోంది. సోమవారం జరుగబోయే మకరవిళక్కు ఉత్సవం కోసం ట్రావెన్‌కోర్ దేవస్థాన మండలి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

యూపీలో కాంగ్రెస్ ఒంటరి పోరు

- ఎస్పీ-బీఎస్పీల పొత్తు నేపథ్యంలో ప్రత్యామ్నాయ వ్యూహం సిద్ధం
- కలిసొచ్చే పార్టీలకు స్నేహ హస్తం

లఖ్‌నవూ/దుబాయి: కీలకమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల వ్యూహాన్ని అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమయింది. తమను కలుపుకోకుండా ఎస్పీ-బీఎస్పీలు పొత్తు కుదుర్చుకున్న దరిమిలా ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేసింది. మొత్తం అన్ని స్థానాల్లో ఒంటరి పోరు చేయాలని నిర్ణయించడంతో పాటు, కలిసివచ్చే పార్టీల మద్దతు స్వీకరించడానికీ సిద్ధమయింది. వచ్చే నెల నుంచే పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు. ''మేం ఉత్తర్‌ప్రదేశ్ ప్రజలకు చేయాల్సింది ఎంతో ఉంది. మా నిర్ణయాలు మాకు ఉంటాయి'' అని ఆయన ప్రకటించారు. ఒక్క ఫిబ్రవరి నెలలోనే ఆయన రాష్ట్రవ్యాప్తంగా 13 బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఆరు లోక్‌సభ నియోజకవర్గాలను ఓ జోన్‌గా గుర్తించి, మొత్తం 80 లోక్‌సభ నియోజకవర్గాలను 13 జోన్లుగా విభజించి, ఈ బహిరంగ సభలను నిర్వహించనున్నారు.

మొత్తం 80 చోట్లా పోటీ: ఆజాద్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఉత్తర్‌ప్రదేశ్ ఇన్‌ఛార్జి గులాం నబీ ఆజాద్ ఆదివారం లఖ్‌నవూ వచ్చి అనుసరించాల్సిన కార్యాచరణపై రాష్ట్ర నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు రాజ్ బబ్బర్ ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆజాద్ విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 80 స్థానాల్లోనూ పోటీ చేస్తామని చెప్పారు. అదే సమయంలో భావసారూప్యం ఉన్న పార్టీల సహాయం తీసుకుంటామని తెలిపారు. ఎస్పీ-బీఎస్పీ పొత్తులో కాంగ్రెస్ కూడా ఉండాలని భావించామని, కానీ వారికి ఇష్టంలేకపోతే తామేమి చేయగలమని అన్నారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 21 సీట్లు వచ్చాయని, ఇప్పుడు రెట్టింపు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పొత్తు కుదరనందుకు కార్యకర్తల్లో అసంతృప్తి ఏమీ లేదని, పైగా అన్ని స్థానాల్లో పోటీ చేసే అవకాశం వచ్చిందంటూ ఆనందిస్తున్నారని చెప్పారు.

బీఎస్పీ, ఎస్పీ నేతలపై అమిత గౌరవం

బీఎస్పీ, ఎస్పీ నేతలంటే తనకు అమిత గౌరవమని రాహుల్ గాంధీ అన్నారు. శనివారం ఆయన దుబాయిలో విలేకరులతో మాట్లాడుతూ ఆ రెండు పార్టీల మధ్య కుదిరిన పొత్తులపై స్పందించారు. ఆ పొత్తులో కాంగ్రెస్‌కు భాగస్వామ్యం లేనందుకు అసంతృప్తి ఏమీ లేదని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రజలకు కాంగ్రెస్ చేయాల్సింది ఎంతో ఉంది. ''భాజపా అధికారంలోకి రానంతవరకు ఎవరు ఎవరితో పొత్తుపెట్టుకున్నా ఇష్టమే. భాజపాకు దాని సీట్లను దానికి దక్కకుండా చేయడమే అంతిమ లక్ష్యం. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వారు (ఎస్పీ-బీఎస్పీ నేతలు) కొంత తప్పుడు సమాచారం ఇచ్చారు.'' అని అన్నారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌పై అనుచిత విమర్శలు చేశారంటూ జాతీయ మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసుపై రాహుల్ స్పందించారు. ''ప్రధాని మోదీ రూ. 30 వేల కోట్ల ప్రజాధనాన్ని అనిల్ అంబానీకి కట్టబెట్టారు. దీనిపై లోక్‌సభలో ఆయన సమాధానం చెప్పకుండా రక్షణ మంత్రితో సమాధానం చెప్పించారు.



రక్షణ మంత్రి మహిళ కావడం యాదృచ్ఛికం. ఆ స్థానంలో పురుషుడు ఉన్నా నేను ఇదే విమర్శలు చేసేవాడినన్నారు. శబరిమల వ్యవహారంపై ప్రజలే నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఆలయ సంప్రదాయాలు కాపాడాలన్న వాదనలో నిజముందని, అదే సమయంలో మహిళలకు సమాన హక్కులు లభించాల్సి ఉందని తెలిపారు.

షార్జా పాలకుడితో భేటీ

భారత్‌కు తిరుగు ప్రయాణమయ్యే ముందు ఆదివారం రాహుల్ గాంధీ షార్జా పాలకుడు సుల్తాన్ బిన్ మహమ్మద్ అల్ కాసిమితో భేటీ అయ్యారు.

ప్రపంచబ్యాంకు అధ్యక్ష పదవి రేసులో..

- కిమ్ రాజీనామా నేపథ్యంలో ఏప్రిల్‌లో ఎన్నిక



ఇవాంకా ట్రంప్



నిక్కీ హేలీ


వాషింగ్టన్: ప్రపంచబ్యాంకు అధ్యక్ష పదవికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకాట్రంప్, ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీహేలీ పోటీ పడబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అమెరికా అంతర్జాతీయ వ్యవహారాల ఆర్థికశాఖ కార్యదర్శి డేవిడ్ మల్‌పాస్, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు మార్క్ గ్రీన్ పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న జిమ్‌యాంగ్ కిమ్ పదవీకాలం మరో మూడేళ్లకుపైగా ఉన్నప్పటికీ, అనూహ్యంగా ఆయన రాజీనామా చేయడంతో కొత్త వ్యక్తి నియామకం తప్పనిసరి అయింది. కొత్త వ్యక్తి ఎంపికకు ఫిబ్రవరిలో ప్రతిపాదనలు స్వీకరిస్తామని, ఏప్రిల్ మధ్యలో కిమ్ స్థానే కొత్త అధ్యక్షుడిని నియమిస్తామని ప్రపంచ బ్యాంకు బోర్డు తెలిపింది. ప్రపంచబ్యాంకులో అమెరికా అతిపెద్ద వ్యాపార భాగస్వామి కావడంతో రెండో ప్రపంచయుద్ధం మొదలుకొని అగ్రరాజ్యం ఎవరిని ప్రతిపాదిస్తే వారే అధ్యక్ష పదవిని అలంకరించారు. 2012లో మాత్రం ఎన్నిక అనివార్యమైంది. ఈసారి కూడా ఎన్నిక జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా తరఫున ఎవరిని ప్రతిపాదించాలనేది ఇంకా నిర్ణయంకాలేదని ఆ దేశ ఆర్థికశాఖ చెప్పింది. చాలా ప్రతిపాదనలు వచ్చాయని, రాష్ట్రాల గవర్నర్లతో మాట్లాడి అంతిమంగా ఒకరిని నిర్ణయిస్తామని తెలిపింది.

'సంకల్ప్ పత్ర'పై భాజపా ప్రజాభిప్రాయ సేకరణ

దిల్లీ: భాజపా ఎన్నికల ప్రణాళిక 'సంకల్ప్ పత్ర'పై ఆ పార్టీ ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. ఇందుకోసం 15 ఉపసంఘాలను నియమించింది. హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటయిన ఎన్నికల ప్రణాళిక రూపకల్పన కమిటీ ఆదివారం ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయింది. కమిటీ సభ్యులతో పాటు పార్టీ అధ్యక్షుడు అమిత్ షా హాజరయ్యారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోవడంతో పాటు, అన్నివర్గాల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ ఉపసంఘాలు ఏర్పాటు చేశామని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

వారణాసి నుంచి కేజ్రీవాల్ పోటీ చేయరు

లఖ్‌నవూ: వారణాసి లోక్‌సభ స్థానం నుంచి దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేయబోరని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికార ప్రతినిధి, రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్ చెప్పారు. కేజ్రీవాల్ బదులు మరో గట్టి అభ్యర్థిని బరిలోకి దింపుతామన్నారు. దిల్లీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేజ్రీవాల్ నిర్ణయించుకున్నందున వారణాసి నుంచి పోటీ చేయబోవడం లేదని స్పష్టం చేశారు. ''2019లో దిల్లీ, పంజాబ్, హరియాణా, గోవాలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో ఆప్ పోటీ చేస్తుంది. వారణాసితో పాటు పార్టీ బలంగా ఉన్న తూర్పు-పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి కూడా ఆప్ అభ్యర్థులను నిలబెడతాం. ఫిబ్రవరిలో పోటీ చేసే స్థానాలపై పూర్తి స్పష్టత వస్తుంది'' అని సంజయ్ చెప్పారు. గతంలో కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని కేజ్రీవాల్ చెప్పినట్లు వచ్చిన వార్తలపైనా సంజయ్ స్పందించారు. ఇది కేవలం దిల్లీని దృష్టిలో పెట్టుకుని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యగా తెలిపారు. భాజపాను ఓడించాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని మాత్రమే చెప్పారన్నారు.



రుద్రాక్ష ముడి

రుద్రాక్షలతో సిగముడిని ప్రత్యేకంగా అలంకరించిన ఈ సాధువు అలహాబాద్‌లోని త్రివేణీ సంగమంలో ఆదివారం ధ్యానం చేస్తూ కనిపించారు. మంగళవారం నుంచి మొదలుకాబోయే కుంభమేళా కోసం పెద్దయెత్తున ఇక్కడకు సాధువులు చేరుకున్నారు.

పెట్రోలు పంపుల్లో 10% కోటా

- గ్యాస్ ఏజెన్సీల కేటాయింపుల్లోనూ..
- ఈడబ్ల్యూఎస్‌లకు వర్తింపజేయనున్న కేంద్రం

ఈనాడు, దిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్లను మరి కొన్ని రంగాలకు విస్తరింపజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం విద్య, ఉద్యోగ రంగాలకు పరిమితమైన ఈ రిజర్వేషన్లను పెట్రోలు పంపులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపుల్లోనూ వర్తింపజేయనుంది. ''కొత్త చట్టంపై నోటిఫికేషన్ విడుదలయిన తరువాత పెట్రోలు పంపులు, వంటగ్యాస్ ఏజెన్సీల కేటాయింపుల్లో ఈడబ్ల్యూఎస్‌లకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ప్రక్రియను ప్రారంభిస్తాం'' అని ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నూతన చట్టానికి శనివారం రాష్ట్రపతి ఆమోద ముద్ర లభించగా, అందుకు అనుగుణంగా నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది.

ప్రస్తుత విధానం ఏమిటి?

ప్రభుత్వ రంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)లు ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 22.5%, ఓబీసీలకు 27% పెట్రోలు బంకులు కేటాయిస్తున్నాయి. మిగిలిన 50.5 శాతం జనరల్ కేటగిరీలకు కేటాయిస్తున్నాయి. ఇక నుంచి జనరల్ కేటగిరీలో పేదలకూ బంకుల కేటాయింపులో పదిశాతం కోటా ఉంటుంది. ఈ విధానంలోనే గ్యాస్ ఏజెన్సీల మంజూరుకు కూడా రిజర్వేషన్లు ప్రభుత్వం అమలు చేయనుంది. నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరంలలో గిరిజనులు అధిక సంఖ్యలో ఉండడంతో అక్కడ నిబంధనలు వేరుగా ఉన్నాయి. అక్కడ 70 శాతం పెట్రోలు పంపులు గిరిజనులకే ఇస్తున్నాయి. ఈ కోటాలోనే మహిళలు, రక్షణ రంగ సిబ్బందికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలవుతాయి.

రెట్టింపు కానున్న పెట్రోలు బంకులు

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 63,674 పెట్రోలు బంకులు ఉన్నాయి. ఇందులో ప్రయివేటు కంపెనీలవి 6,611 కాగా, మిగిలిన 57,063 ప్రభుత్వ రంగ సంస్థలవే. పెట్రోలు పంపుల సంఖ్యను రెట్టింపు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం మరో 55,649 పంపులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు నవంబరు 25నే ప్రకటనలు ఇచ్చాయి.

గుజరాత్‌లో నేటి నుంచి కోటా అమలు

అహ్మదాబాద్: ఈడబ్ల్యూఎస్‌లకు పది శాతం కోటాను సోమవారం నుంచి అమల్లోకి తీసుకురానున్నట్టు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది.

సీవీసీని తక్షణం తొలగించాలి: కాంగ్రెస్

దిల్లీ: కేంద్ర విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) కె. వి. చౌదరి కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ ఆరోపించారు. ఆయనను తక్షణం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించడంపై చెలరేగిన వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రఫేల్ యుద్ధవిమానాల ఒప్పందంపై దర్యాప్తునకు అవకాశం లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా సీవీసీ వ్యవహరిస్తున్నారని సింఘ్వీ ఆరోపించారు. ''సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా తరఫున సీవీసీ రాయబారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన తరఫున పైరవీలు చేస్తున్నారు. సీవీసీ ఇలా ఎందుకు చేస్తున్నారు? ఎవరి కోసం చేస్తున్నారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. నియంతృత్వ ధోరణితో దేశాన్ని పాలిస్తున్న ఇద్దరు వ్యక్తులే ఇలా చేయగలరు. రఫేల్ కుంభకోణాన్ని దాచిపెట్టేందుకు ఇలాంటి చర్యలు చేపడుతున్నారు'' అని విమర్శించారు.

భగ్గుమన్న మహారాష్ట్ర రైతాంగం!

ముంబయి: మహారాష్ట్ర రైతులు ఆగ్రహించారు. తమ పంటకు చెల్లింపుల్లో తీవ్రజాప్యానికి నిరసనలు వ్యక్తం చేసిన వారు.. చివరకు సహనం కోల్పోయి పశ్చిమ మహారాష్ట్రలోని పలు చక్కెర కర్మాగారాల కార్యాలయాలకు నిప్పంటించారు. చక్కెర కర్మాగారాల యాజమాన్యాలు రైతులకు రూ. 4,500 కోట్ల బకాయిలున్నాయి.



బొగ్గుగని సమీపాన సహాయక చర్యల కోసం అంబులెన్సులు

బొగ్గుగని కుప్పకూలి 21 మంది మృతి!

- చైనాలో దుర్ఘటన

బీజింగ్: చైనాలో బొగ్గుగని పై కప్పు కుప్పకూలిన దుర్ఘటనలో 21 మంది కార్మికులు మరణించారు. షాన్‌గిజ ప్రావిన్స్‌లోని లిజాగవు బొగ్గుగనిలో 81 మంది పనిచేస్తున్న సమయంలో పై కప్పు కూలిపోయింది. ఈ ఘటనలో 21 మంది మరణించగా 66 మందిని హుటాహుటిన హెలికాప్టర్లలో సురక్షిత ప్రాంతానికి తరలించారు.

ఛాంపియన్స్

కిదాంబి జట్టుదే కిరీటం

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో బెంగళూరు రాప్టర్స్ అదరగొట్టింది. కిదాంబి శ్రీకాంత్ సారథ్యంలోని ఆ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో టైటిల్ ఎగరేసుకుపోయింది. హోరాహోరీగా సాగిన తుది సమరంలో ఆ జట్టు ముంబయి రాకెట్స్‌ను ఓడించింది.

పీబీఎల్ ఛాంప్ బెంగళూరు ● ఫైనల్లో ముంబయిపై విజయం



బెంగళూరు

ప్రీమియర్ బ్యాడ్మింటన్ నాలుగో సీజన్‌లో బెంగళూరు రాప్టర్స్ విజేతగా నిలిచింది. ఫైనల్లో చక్కటి ప్రదర్శనతో కప్ కైవసం చేసుకుంది. ఆదివారం సొంతగడ్డపై హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో బెంగళూరు 4-3 తేడాతో ముంబయి రాకెట్స్‌పై విజయం సాధించింది. ముంబయి ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో కిమ్ జంగ్-బెర్నాడెత్ జోడీ 15-8, 15-14తో మార్కస్-లారెన్ జంటపై నెగ్గి జట్టుకు శుభారంభాన్ని అందించింది. ఆ తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో బెంగళూరు కెప్టెన్ కిదాంబి శ్రీకాంత్ 15-7, 15-10తో అంటోనెన్‌పై గెలిచాడు. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో తి ట్రాంగ్ 15-8, 15-9తో శ్రేయాన్షి పరదేశిపై నెగ్గడంతో బెంగళూరు 3-2తో ఆధిక్యాన్ని సంపాదించింది. అయితే ఆ వెంటనే జరిగిన రెండో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో ముంబయి ఆటగాడు సమీర్‌వర్మ 7-15, 15-12, 15-3తో సాయిప్రణీత్‌పై విజయం సాధించడంతో స్కోరు 3-3తో సమమైంది. ఛాంపియన్‌ను నిర్ణయించే పురుషుల డబుల్స్ పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. ప్రత్యర్థి జోడీ నుంచి పోటీ ఎదురైనా కీలక సమయంలో పాయింట్లు సాధించిన అహ్‌సాన్-హెంద్రన్ 15-13, 15-10తో జంగ్-డేలను ఓడించి బెంగళూరుకు టైటిల్ అందించారు. బెంగళూరు గత ఏడాది రన్నరప్‌గా నిలిచింది. ఈ సీజన్‌లో శ్రీకాంత్ ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో విజయాలు సాధించడం విశేషం.

భారత్ × బహ్రెయిన్

ఆసియాకప్ ఫుట్‌బాల్‌లో నేడే కీలక సమరం

రాత్రి.9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో

● ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే భారత్ నాకౌట్ దశకు అర్హత సాధిస్తుంది.

బరిలో బజ్‌రంగ్, వినీశ్

నేటి నుంచే ప్రొ రెజ్లింగ్ లీగ్

పంచకుల: ప్రొ రెజ్లింగ్ లీగ్‌కు వేళైంది. సోమవారమే ఈ లీగు షురూ. ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేతలు బజ్‌రంగ్ పునియా, వినీశ్ ఫొగాట్‌లతో పాటు అంతర్జాతీయ రెజ్లర్లు ఈ టోర్నీ బరిలో ఉన్నారు. టోర్నీ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ పంజాబ్ రాయల్స్.. ముంబయి మహారథితో పోటీపడనుంది.



న్యూజిలాండ్ పర్యటనకు శుభమన్ గిల్

ఇంకో కుర్రాడు వచ్చాడు..

● ఆస్ట్రేలియాతో వన్డేలకు విజయ్ శంకర్
● పాండ్య, రాహుల్‌ల స్థానంలో ఎంపిక

దిల్లీ

బుమ్రా, రిషబ్ పంత్, పృథ్వీ షా, మయాంక్ అగర్వాల్.. గత రెండు మూడేళ్లలో టీమ్‌ఇండియాలో చోటు దక్కించుకుని సత్తా చాటుకున్న యువ ప్రతిభావంతులు ఎంతమందో! గతంలో ఎన్నడూ లేని విధంగా యువ ప్రతిభకు పెద్ద పీట వేస్తూ.. అనేకమంది కుర్రాళ్లకు అవకాశాలు కల్పించింది భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ. ఈ కోవలోనే ఇప్పుడు మరో యువ ప్రతిభావంతుడిని టీమ్‌ఇండియాలోకి తీసుకుంది. గత ఏడాది అండర్-19 ప్రపంచకప్‌లో పృథ్వీతో పాటే వెలుగులోకి వచ్చి.. ఆ తర్వాత కూడా దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్న శుభమన్ గిల్‌ను భారత జట్టుకు ఎంపిక చేసింది. ఇప్పటికే భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కూడా సెలక్టర్ల పిలుపు అందుకున్నాడు. ఒక టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌ల స్థానంలో వీరికి అవకాశం దక్కింది. ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగే రెండో వన్డేకే విజయ్ శంకర్ టీమ్‌ఇండియాతో కలుస్తాడు. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనకూ కొనసాగుతాడు. గిల్ న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు మాత్రమే ఎంపికయ్యాడు. ఏడాదిగా గిల్ ప్రదర్శన చూస్తే.. అతను భారత జట్టులోకి రావడం ఖాయంగా కనిపించింది. ప్రధానంగా ఓపెనర్ అయిన ఈ కుడి చేతి వాటం బ్యాట్స్‌మన్ ప్రస్తుత రంజీ ట్రోఫీలో 98.75 సగటుతో 790 పరుగులు చేయడం విశేషం. నిరుడు అండర్-19 ప్రపంచకప్‌లో అతనే 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'. గత నెలలో భారత్-ఎ జట్టుతో పాటు గిల్ న్యూజిలాండ్ పర్యటనకు కూడా వెళ్లిన నేపథ్యంలో ఆ జట్టుతో వన్డే, టీ20 సిరీస్‌లకు అతడి ఎంపిక సరైన నిర్ణయమని భావిస్తున్నారు. ఇక తమిళనాడు ఆల్‌రౌండర్ విజయ్ శంకర్.. ఇప్పటికే ఐదు టీ20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. నిరుడు శ్రీలంకలో జరిగిన ముక్కోణపు టీ20 సిరీస్‌లో అవకాశం దక్కించుకున్న అతను.. ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఐతే భారత్-ఎ తరపున శంకర్ నిలకడగా రాణిస్తుండటంతో అతడికి సెలక్టర్లు మరో అవకాశం ఇచ్చారు. పాండ్య, రాహుల్‌ల స్థానంలో శంకర్‌తో పాటు మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేస్తారని వార్తలొచ్చాయి. ఐతే ఆస్ట్రేలియాతో చివరి రెండు టెస్టుల్లో అవకాశం దక్కించుకుని చక్కటి ప్రదర్శన చేసిన మయాంక్.. చిన్న గాయంతో ఇబ్బంది పడుతుండటంతో అతడిని ఎంపిక చేయలేదని సమాచారం.

రాయుడి బౌలింగ్‌పై ఫిర్యాదు



అంబటి రాయుడు చిక్కుల్లో పడ్డాడు. శనివారం ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో అతడి బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉందని అంపైర్లు ఐసీసీకి ఫిర్యాదు చేశారు. ఆసీస్‌తో తొలి వన్డేలో రాయుడు 2 ఓవర్లు వేశాడు. ఈ సందర్భంగా బౌలింగ్ యాక్షన్ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్న అనుమానంతో అంపైర్లు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు వారాల్లో బౌలింగ్ యాక్షన్ పరీక్షకు రాయుడు రావాల్సి ఉంటుందని.. ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫుట్‌బాల్ దిగ్గజం జుల్ఫికరుద్దీన్ కన్నుమూత



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భారత ఫుట్‌బాల్ స్వర్ణయుగానికి సాక్షిగా నిలిచిన ఫుట్‌బాల్ దిగ్గజం మహమ్మద్ జుల్ఫికరుద్దీన్ (82) కన్నుమూశాడు. హైదరాబాద్‌లోని పద్మారావునగర్‌లో నివాసం ఉంటున్న ఆయన ఆదివారం ఉదయం 8 గంటలకు తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన జుల్ఫికరుద్దీన్ కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో డీఎస్పీగా పనిచేసి పదవీ విరమణ పొందాడు. ఫుట్‌బాల్‌లో అద్భుత ప్రతిభ చాటిన ఆయన 16 ఏళ్లపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ (ఏపీపీ) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆయన మృతి పట్ల తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం సంతాపం వ్యక్తం చేసింది.

19 ఏళ్లకే: 1956 ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత ఫుట్‌బాల్ జట్టుకు 19 ఏళ్ల వయసులో ఎంపికై.. ఆ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా జుల్ఫికర్ రికార్డు నెలకొల్పాడు. ఆ ఒలింపిక్స్‌లో భారత్ నాలుగో స్థానం సాధించింది. ఆ తర్వాత జుల్ఫికర్ 1958 ఆసియా క్రీడల్లో పాల్గొన్న భారత జట్టుకు ఎంపికయ్యాడు. అఖిల భారత పోలీస్ క్రీడల్లో ఏపీపీ జట్టు వరుసగా తొమ్మిది స్వర్ణాలు గెలవడంలో ఆయన పాత్ర కీలకం. సారథిగా ఆంధ్రప్రదేశ్‌కు సంతోష్‌ట్రోఫీ అందించాడు. ఆటలో విశేషంగా రాణించి దేశ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు.



అభినవ్

10 ఏళ్లకే పసిడి కొట్టాడు!

పుణె: ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో 10 ఏళ్ల కుర్రాడు అభినవ్ షా సత్తా చాటాడు. ఆదివారం జరిగిన షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ విభాగంలో మెహులి ఘోష్‌తో కలిసి బరిలో దిగిన అభినవ్ స్వర్ణం కైవసం చేసుకున్నాడు. ఈ క్రీడల్లో పసిడి గెలిచిన పిన్న వయస్కుడిగా షా రికార్డు సృష్టించాడు. ఆరో తరగతి చదువుతున్న అభినవ్.. అర్హత పోటీలు, ఫైనల్లో ఆకట్టుకున్నాడు. ఫైనల్లో అతను మెహులితో కలిసి 501.7 పాయింట్లు స్కోరు చేసి బంగాల్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాడు.

దీప్తికి రజతం: ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో తెలంగాణ అథ్లెట్ దీప్తి మళ్లీ మెరిసింది. ఆదివారం జరిగిన అండర్-17 బాలికల 200మీ. పరుగులో ఆమె రజతం సొంతం చేసుకుంది. 25.26 సెకన్లలో రేసు పూర్తి చేసిన ఆమె రెండో స్థానంలో నిలిచింది. అవంతిక (24.47సె, మహారాష్ట్ర) స్వర్ణం గెలుచుకుంది. దీప్తి ఇదివరకే 100మీ. పరుగులో వెండి పతకం నెగ్గిన సంగతి తెలిసిందే.

పోరాడుతున్న పాకిస్థాన్

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్ తప్పించుకునేందుకు పాకిస్థాన్ పోరాడుతోంది. కానీ ఆ జట్టుకు కష్టమే. 381 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ మూడో రోజు, ఆదివారం ఆట ఆఖరుకు 153/3తో నిలిచింది. ఇమాముల్ హక్ (35), షాన్ మసూద్ (37), అజహర్ అలీ (15) ఔటవగా.. అసద్ షఫీక్ (48), బాబర్ అజామ్ (17) క్రీజులో ఉన్నారు. అంతకుముందు 135/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 303 పరుగులకు ఆలౌటైంది. డికాక్ (129) అద్భుత శతకం సాధించాడు.



నూతన సంవత్సరంలో మొట్టమొదటి గ్రాండ్ స్లామ్‌కు వేళైంది. సోమవారం నుంచే ఆస్ట్రేలియన్ ఓపెన్. ఫేవరెట్లు మాత్రం పాతవాళ్లే. పురుషుల విభాగంలో ఫెదరర్, జకోవిచ్ ఏదో టైటిల్‌పై కన్నేయగా.. మహిళల సింగిల్స్‌లో సెరెనా విలియమ్స్ భారీ అంచనాలతో అడుగుపెడుతోంది. సెరెనా విజేతగా నిలిస్తే అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన టెన్నిస్ ప్లేయర్‌గా ఆల్‌టైమ్ గ్రేట్ మార్గరెట్ కోర్ట్‌ను సమం చేస్తుంది. మరి 2019లో గ్రాండ్ స్లామ్ బోణీ కొట్టేదెవరో!

కొత్త ఏడాదిలో కొట్టేదెవరో..!

● ఫేవరెట్లుగా ఫెదరర్, జకోవిచ్
● టైటిల్‌పై కన్నేసిన సెరెనా
● నేటి నుంచే ఆస్ట్రేలియన్ ఓపెన్

ఉదయం 5.30 నుంచి సోని నెట్‌వర్క్‌లో...

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. ఫామ్‌లో ఉన్న రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), నొవాక్ జకోవిచ్ (సెర్బియా) మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకోవాలని ఉవ్విళ్లూరుతుండగా.. ఆండీ ముర్రే కెరీర్‌లో చివరిసారి మెల్‌బోర్న్‌లో బరిలోకి దిగుతున్నాడు. టాప్ సీడ్ జకోవిచ్, మూడో సీడ్ ఫెదరర్‌లకు అలెగ్జాండర్ జ్వెరెవ్ వంటి కుర్రాళ్ల నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. నాలుగో సీడ్ జ్వెరెవ్‌ను భవిష్యత్తు స్టార్‌గా టెన్నిస్ పండితులు ఇప్పటికే కీర్తిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రపంచ నంబర్-2 రఫెల్ నాదల్ ఫిట్‌నెస్‌పై సందేహాలు కొనసాగుతూనే ఉన్నాయి. గాయంతో సన్నాహక టోర్నీ నుంచి తప్పుకున్న నాదల్.. ఇప్పుడు తాను ఫిట్‌గానే ఉన్నానని అంటున్నాడు.

ఇస్తోమిన్‌తో ఫెదరర్ ఢీ: మెల్‌బోర్న్‌లో హ్యాట్రిక్ టైటిళ్లపై కన్నేసిన ఫెదరర్.. సోమవారం డెనిస్ ఇస్తోమిన్‌తో పోరుతో టైటిల్ వేటను ఆరంభిస్తాడు. 21వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై ఫెదరర్ ఆశలతో ఉన్నాడు. కిందటిసారి టోర్నీ నుంచి త్వరగా నిష్క్రమించిన జకోవిచ్ ఈసారి ట్రోఫీని అందుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. గాయాలు, పేలవ ప్రదర్శనతో నిరుడు టాప్-20లో చోటు కోల్పోయిన జకోవిచ్.. ఆ తర్వాత వింబుల్డన్, యుఎస్ ఓపెన్ గెలిచి టాప్ ఫామ్‌ను అందుకున్నాడు. ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకునూ చేజిక్కించుకుని జోరు మీదున్న అతడు తొలి రౌండ్లో మిచెల్ క్రుజెర్ (అమెరికా)ను ఢీకొంటాడు. 37 ఏళ్ల ఫెదరర్ నుంచే జకోవిచ్‌కు ప్రధానంగా ముప్పు పొంచి ఉంది. "నేను మంచి ఫామ్‌లో ఉన్నాను. నా ప్రత్యర్థి చాలా బాగా ఆడితేకానీ నన్ను ఓడించలేడు" అని ఫెదరర్ అన్నాడు. ఇక రెండో సీడ్ నాదల్ (స్పెయిన్) తన తొలి రౌండ్లో వైల్డ్‌కార్డ్ ఆటగాడు జేమ్స్ డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)తో తలపడతాడు. మరోవైపు జ్వెరెవ్ (జర్మనీ) తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం ఆరాటపడుతున్నాడు. మంగళవారం స్లొవేనియాకు చెందిన అల్జాజ్ బెడెన్‌తో అతడు మొదటి రౌండ్ ఆడతాడు. జ్వెరెవ్‌తో పాటు బోర్నా కోరిచ్ (క్రొయేషియా), కచనోవ్ (రష్యా), స్టెఫానో సిత్‌సిపస్ (గ్రీస్) వంటి కుర్రాళ్ల నుంచి గట్టి పోటీ తప్పదని జకోవిచ్ కూడా అన్నాడు. స్థానిక ఆటగాడు కిర్గియోస్ ఈసారైనా అదరగొట్టాలని ఆస్ట్రేలియా అభిమానులు కోరుకుంటున్నారు. ఐతే అతడికి కఠినమైన డ్రా ఎదురైంది. తొలి రౌండ్లో కిర్గియోస్.. మాజీ నంబర్-3 రోనిచ్ (కెనడా)ను ఢీకొంటాడు. నెగ్గితే రెండో రౌండ్లో మాజీ ఛాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) రెండో రౌండ్లో ఎదురుకావొచ్చు. క్వాలిఫయింగ్ పోటీ ద్వారా ప్రధాన డ్రాకు అర్హత పొందిన భారత ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తన తొలి రౌండ్లో సోమవారం టైఫో (అమెరికా)ను ఢీకొంటాడు.

ఫేవరెట్ ఆమే..: మహిళల సింగిల్స్‌లో ఏడుసార్లు ఛాంపియన్ సెరెనా విలియమ్స్ (అమెరికా) ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో కోర్ట్ రికార్డు సమం చేయాలనే పట్టుదలగా ఉన్న 37 ఏళ్ల సెరెనా.. తొలి రౌండ్లో తజానా మరియా (జర్మనీ)తో తలపడుతుంది. సెరెనా 2017లో ఇక్కడ టైటిల్ గెలిచింది. బిడ్డకు జన్మనిచ్చిన ఆమె ఆ ఏడాది మరో గ్రాండ్‌స్లామ్ ఆడలేదు. నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ బరిలోకి దిగలేదు. ఆ తర్వాత తిరిగి రాకెట్ చేతపట్టిన సెరెనా.. వింబుల్డన్, యుఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరడం ద్వారా తనలో చేవ తగ్గలేదని నిరూపించుకుంది. ఈ నేపథ్యంలోనే ఆమె మంచి అంచనాలతో బరిలోకి దిగుతోంది. టాప్ సీడ్ హలెప్ (రొమేనియా), రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ), యుఎస్ ఓపెన్ ఛాంపియన్, నాలుగో సీడ్ నవోమి ఒసాకా (జపాన్) కూడా గట్టి పోటీదారులే.





సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగిన అంతర్జాతీయ పతంగుల ఉత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను బహూకరిస్తున్న తెలంగాణ పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం. పక్కన దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఆ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ ★ పరేడ్ మైదానంలో పతంగులను ఎగురవేస్తున్న ఔత్సాహికులు

సంక్రాంతి.. నవ్యక్రాంతి కావాలి

- పతంగులు, మిఠాయిల ఉత్సవం ప్రారంభోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు - హైదరాబాద్

సంక్రాంతి మన జీవితాల్లో నవ్యక్రాంతి కావాలని. . తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలుగా విడిపోయినా సహకరించుకుని తెలుగు ప్రజల ప్రత్యేకత, భారత దేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కోరారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నాలుగో అంతర్జాతీయ పతంగుల, మిఠాయిల ఉత్సవాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాశ్చాత్య జీవనం వెంట పరుగులు తీయకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షిద్దామని అన్నారు. మన ఆరోగ్యాన్ని కాపాడే భారతీయ ఆహారాన్నే తీసుకుందామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్, కేంద్రంలో మోదీ ప్రభుత్వం పండుగలను ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. ఒకవైపు పతంగుల పోటీ.. మరో వైపు తీపి రుచుల కలయికే ఈ ఉత్సవం అని అభివర్ణించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

"మనిషి ఆశకు ప్రతిరూపాలు గాలిపటాలు.. క్రీడా స్ఫూర్తికి నిదర్శనం ఈ గాలిపటం. అది ఎంత ఎత్తుకు ఎగిరినా ఆఖరికి కిందకే వస్తుంది. అందుకే మనం మూలాలు మనం మర్చిపోకూడదు. ఆటలు, పండుగలు ప్రజల్లో సహనాన్ని పెంచుతాయి. స్నేహాన్ని పెంపొందిస్తుంది. సమైక్యతకు దారితీస్తుంది. అందుకే మన పెద్దవాళ్లు రుతువులను బట్టి పండుగలను రూపొందించి పంటలతో జోడించి నిర్వహించేవారు. ఇప్పుడేమో రుతువులు క్రమం తప్పాయి. ప్రకృతిని ప్రేమించడం అలవాటు చేసుకుంటే ప్రకృతి మనకు సహకరిస్తుంది.

తీపి వంటకాలకు ప్రత్యేకత

దేశంలో మొదటి నుంచి తీపి వంటకాలకు ఒక ప్రత్యేకత ఉంది. వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన ఒక వేదికపై ప్రత్యక్షం కావడం భారతీయ తత్వంలో ఉన్న వసుధైక కుటుంబానికి ప్రతీకగా నిలుస్తుంది. 1200 రకాల వంటకాలను ప్రదర్శించడం అరుదైన విషయం. భారతీయ పాకశాస్త్రం గురించి ఎన్నో ప్రామాణిక గ్రంథాలు ఉన్నాయి. పాశ్చాత్య వ్యామోహంలో పిజ్జాలు, బర్గర్లు అంటూ పరుగెత్తుతున్నాం. యువకులను ఒకటే కోరుతున్నా.. భారతీయ వంటకాలను రుచి చూసి అనుభవించి, ప్రోత్సహించండి. వాటిని వదలొద్దు." అని వెంకయ్య నాయుడు అన్నారు.

అంబరాన్నంటేలా సంబరం

సంక్రాంతి సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే నాలుగో అంతర్జాతీయ పతంగుల పండుగలో 19 దేశాల నుంచి 42 మంది, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 60 మంది పాల్గొన్నారు. ఇక్కడే ఏర్పాటు చేసిన రెండో మిఠాయిల ఉత్సవంలో 22 దేశాలు, 22 రాష్ట్రాల తీపి వంటకాలను దాదాపు 1200 వరకు ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో సందర్శకుల రాకతో తొలిరోజు సందడి నెలకొంది. ప్రారంభోత్సవ సమావేశంలో శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, దిల్లీలో తెలంగాణ ప్రతినిధి వేణుగోపాలచారి, ప్రపంచ పర్యాటక, సాంస్కృతిక కౌన్సిల్ అధ్యక్షుడు యూంగ్, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, జనరల్ ఆఫీసర్ కమాండెంట్ శ్రీనివాసరావు, పర్యాటక శాఖ కమిషనర్ దినకర్‌బాబు, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రానికి హోదా కల్పిస్తాం

- పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామన్నారు. ఆయన ప్రత్యేక హోదా అమలు చేయకపోతే తన స్వగ్రామమైన నీలకంఠాపురంలో అడుగు పెట్టనని, అసలు రాష్ట్రంలోనే తాను అడుగు పెట్టనని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ఆదివారం అనంతపురంలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టవర్‌క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో రఘువీరారెడ్డి ప్రసంగించారు. మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలకు అండగా ఉండేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామయ్య అలక: విగ్రహాల ఆవిష్కరణ అనంతరం అనంతపురంలో జరిగిన కురుబల మహాగర్జన సభకు కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటక మాజీ మంత్రి రేవణ్ణ మాట్లాడుతున్న సమయంలో ఇటీవల వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసిన సీఐ గోరంట్ల మాధవ్ అక్కడకు వచ్చారు. తన మద్దతుదారులతో కలిసి హడావుడి చేశారు. ఈలలు, కేకలు వేయడంతో పాటు సీఐని భుజాలపైకి ఎత్తుకున్నారు. అనంతరం వేదికపైకి వెళ్లారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అల్లరి చేయొద్దు.. అంటూ రేవణ్ణ పదే పదే చెప్పినా వినలేదు. దీంతో సభ అదుపు తప్పుతోందని భావించిన సిద్ధరామయ్య వేదిక దిగి వెళ్లిపోయారు.



రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తదితరులు



చిలకలూరిపేటలో గేదెలను పరిశీలిస్తున్న బ్రెజిల్ బృంద సభ్యులు, మంత్రి పుల్లారావు

బ్రెజిల్ సాంకేతికతతో పాడి పెంపు

- మంత్రి పుల్లారావు వెల్లడి
- చిలకలూరిపేటలో ఆ దేశ బృందంతో సమావేశం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: బ్రెజిల్ దేశానికి చెందిన పరా స్టేట్ వ్యవసాయ మంత్రి టర్కీసియో బృందం ఆదివారం చిలకలూరిపేటలో పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో సమావేశమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రెజిల్‌లో ముర్రా, ఒంగోలు జాతి ఆవులు రోజుకు 45 లీటర్ల చొప్పున పాలు ఇస్తున్నాయని, అక్కడ 16 వేల కోట్ల బ్రీడ్ ఉందని తెలిపారు. గుంటూరు జిల్లాలో నకరికల్లు ఫాం కేంద్రంగా పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు ఈ విషయమై మంత్రి ప్రత్తిపాటిని కలిసినట్లు వివరించారు. అనంతరం మంత్రి ప్రత్తిపాటి మాట్లాడుతూ బ్రెజిల్ కంటే రాష్ట్రంలోనే ఒంగోలు జాతి చాలా తక్కువగా ఉందన్నారు. ఒంగోలు జాతి ద్వారా బ్రెజిల్ ఏటా రూ.కోట్ల ఆదాయం పొందుతుందని చెప్పారు. బ్రెజిల్ సాంకేతికతను ఉపయోగించి ఏపీలో పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం స్థానిక కొత్త మార్కెట్‌యార్డులో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన గేదెలను బ్రెజిల్ నుంచి వచ్చిన బృంద సభ్యులు పరిశీలించారు. మంత్రిని కలిసిన వారిలో బ్రెజిల్ దేశానికి చెందిన ఎంబ్రాపా డైరెక్టర్ రిబ్రమార్, ఫెపా డైరెక్టర్ గుల్‌హిమా, శాస్త్రవేత్త డాక్టర్ జోస్ తదితరులు ఉన్నారు.

'దళిత సర్పంచులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి'

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో పంచాయతీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దళిత సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారని లోకల్ గవర్నమెంటు ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు ఆరోపించారు. విజయవాడలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ సుబ్బారావును కలిసి ఈ మేరకు ఆయన ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో సుమారు రూ. 100 కోట్ల వరకు గ్రామపంచాయతీల నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ సర్పంచులకు చెల్లించాల్సినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. బిల్లులు వెంటనే చెల్లించేలా అధికారులను ఆదేశించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

కశ్మీర్ ఎదురుకాల్పుల మృతుల్లో అల్-బద్ర్ ఉగ్ర సంస్థ కమాండర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో తాజా ఎదురుకాల్పుల్లో హతమైన ఇద్దరు ఉగ్రవాదుల్లో అల్-బద్ర్ ముష్కర సంస్థ అగ్ర కమాండర్ జీనత్ ఉల్ ఇస్లాం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. రెండో మృతుడిని అదే సంస్థకు చెందిన షకీల్ అహ్మద్ దర్‌గా గుర్తించినట్లు తెలిపారు. కుల్గాం జిల్లాలోని కథ్‌పోరా ప్రాంతంలో శనివారం సాయంత్రం ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. గాలింపు జరుపుతున్న భద్రత దళాలపై ఈ ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. బలగాలు దీటుగా స్పందించి వారిని మట్టుపెట్టాయి. గత నవంబర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్ర సంస్థ నుంచి ఇస్లాం అల్-బద్ర్‌కు మారాడని, ఆ రెండు ముష్కర సంస్థల మధ్య కుదిరిన అంగీకారం ప్రకారమే ఈ మార్పు జరిగిందని పోలీసులు ఆదివారం వివరించారు. అల్-బద్ర్‌కు అధిపతిగా ఇస్లాం బాధ్యతలు తీసుకున్నాడని.. అతడిపై పలు ఉగ్ర నేరాలకు సంబంధించిన కేసులున్నాయని వెల్లడించారు.



మహిళామిషన్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో ఆదివారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉత్పాదక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కేంద్రాల్లో శిక్షణ పూర్తిచేసుకున్న 600 మంది మహిళలకు ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులంతా తమకు అందజేసిన కుట్టుమిషన్లతో ఇలా కనిపించారు. - ఈనాడు, రాజమహేంద్రవరం

ఝార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

దుమ్కా: ఝార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నాయకుడు షాహ్‌దేవ్ రాయ్ అలియాస్ తాల్‌దాను భద్రతా దళాలు కాల్చి చంపాయి. అతడిపై రూ.10 లక్షల రివార్డు ఉంది. షికారిపారలోని అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. 2013 జులైలో నాటి పాకుర్ జిల్లా ఎస్పీ అమర్‌జీత్ బలిహర్‌ను హత్య చేసిన కేసులో అతడు ప్రధాన నిందితుడు. చాతుపార ప్రాంతంలో నక్సల్స్ ఆశ్రయం పొందారని, అక్కడ డబ్బు వసూళ్లకు దిగనున్నారని సమాచారం అందుకొని జిల్లా సాయుధ పోలీసులు, సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) దళాలు శనివారం రాత్రి గాలింపు చేపట్టాయని దుమ్కా ఎస్పీ వై.ఎస్.రమేశ్ తెలిపారు. రాత్రి 7 గంటల సమయంలో పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరిపారని చెప్పారు. దీంతో తమ బృందం ఎదురుకాల్పులు జరిపిందని తెలిపారు. ఇందులో షాహ్‌దేవ్ రాయ్ చనిపోయాడని వివరించారు. ఘటనా స్థలంలో ఏకే-47, ఇన్సాస్ తుపాకులు, భారీగా మందుగుండు సామగ్రి లభించాయన్నారు. మిగతా నక్సల్స్ పరారయ్యారని చెప్పారు. వారిలో కొందరికి తూటా గాయాలయ్యాయని తెలిపారు. వారి కోసం గాలింపు చేపట్టినట్లు చెప్పారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



ఆ ఇంటికి 101 ద్వారాలు!

సాధారణంగా ఇంట్లో అయిదు మహా అయితే పది ... మరీ పెద్దదైతే 20 గదులుంటాయి. కానీ సంగారెడ్డి జిల్లా, మునిపల్లిలోని ఆ ఇంటికి వెళితే మాత్రం మీకు ఆశ్చర్యం కలగడం ఖాయం. ఎందుకంటే ఆ ఇంట్లో ఏకంగా 75 గదులున్నాయి. ఇంతేనా... ఆ ఇంటికి మరో ప్రత్యేకత ఉందండోయ్... 101 ద్వారాలు కూడా ఉన్నాయి. విశాలమైన ఈ ఇంటి నిర్మాణం 400 ఏళ్ల క్రితం జరిగింది. ఆ ఇంటి నిర్మాణానికి సంబంధించిన చరిత్ర అంతా ఒక పుస్తక రూపంలో ఉంది. అంతేకాదు ఈ ఇంటిని పురావస్తుశాఖ కూడా గుర్తించింది. 17వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని నిజాం ప్రభువులు పాలించేవారు. అప్పట్లో ఈ గ్రామంలోనే వెయ్యి ఎకరాల భూస్వామి అయిన సంగప్ప పాటిల్ పెద్ద జమీందార్. అప్పట్లో వర్షాలు లేక కరవుతో అల్లాడుతున్న సమయంలో కూలీలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో జమీందారు ఈ ఇంటిని నిర్మించారట. నాలుగెకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఇంటి కోసం రోజుకు 200 మంది కూలీలు ఏడాదిపాటు పనిచేశారట. మామూలుగా అయితే ఇంటిని వీధి రహదారికి రెండు, మూడు అడుగుల ఎత్తులో కడతారు. కానీ ఈ ఇంటిని 30 అడుగుల ఎత్తులో కట్టడం విశేషం.

- **చోటూమియా,** మునిపల్లి

ప్లేటో.. మార్క్స్... గాంధీ ఇక్కడికి రండి!

దయాల్ నగర్ మనకేం నేర్పుతుందంటే..!



అక్కడ...
ప్లేటో ఊహించిన స్వర్గం కనిపిస్తుంది...
మార్క్స్ ప్రవచించిన ఆదర్శం దర్శనమిస్తుంది...
గాంధీ బోధించిన సత్యం ఆవిష్కృతమవుతుంది.
ఎందుకంటే...
నేను.. నాది.. అనే పదాలు అక్కడ వినిపించవు.. 'విడివిడి' అనేదాన్ని వాళ్లెప్పుడో వదిలేశారు.
'కలివిడి'కే కట్టుబడి ఉన్నారు.
అక్కడ ఆపేక్షలుంటాయి కానీ లాభాపేక్షలుండవు
'ఉన్నామంటే.. ఏదో ఉన్నాం..' అని కాకుండా..
నలుగురితో ఉన్నామా.. నవ్వుతూ ఉన్నామా అనేదే వాళ్లకు ముఖ్యం.
నాగరికత పెరిగే కొద్దీ బంధాలు బలహీనమైపోతున్న ఈరోజుల్లో మనం ఆ కాలనీ నుంచి ఏం నేర్చుకోవాలో చదివేయండి...

ఎక్కడ? ఏమిటి?

విశాఖపట్నం సాగర తీరానికి అతి సమీపంలో.. కైలాసగిరికి ఆనుకొని ఉన్న 'దయాల్ నగర్' కాలనీ. నగరం నడిబొడ్డున ఉన్నా అక్కడ ఆత్మీయతలకు లోటుండదు. అహంకారానికి చోటుండదు. గొప్ప, బీద తేడాలు అక్కడి వారు ఎరుగరు. ఎన్నో అవకాశాలున్నా.. సాదాసీదా జీవితం గడిపేస్తుంటారు. మానవీయ విలువలకు పెద్దపీట వేస్తారు. శ్రమైక జీవనం వారికి ఇష్టం. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ప్రభుత్వాల మీద ఆధారపడరు. డాక్టరైనా.. లాయరైనా.. ఇంజినీరైనా.. ఎవరైనా సరే.. పలుగుపార పడతారు. పనిచేసుకుంటూ పోతారు. 180 ఇళ్లు.. వెయ్యిమంది జనం నివసించే ఈ కాలనీలో ఏ ఒక్కరిలోనూ భేషజాలు కనిపించవు. భిన్న వర్గాల ప్రజలు ఉన్నా అందరి అభిమతం ఒక్కటే... 'కలసి ఉంటే కలదు సుఖం'. ఇదే వీరి జీవన సారం.

ఒకే మాట.. ఒకే బాట

సూత్రం 1:

ఆనందాన్ని ఒడిసి పట్టు

20 ఎకరాల్లో ఈ కాలనీ విస్తరించి ఉంటుంది. ఇందులో 180 ఇళ్లుంటాయి. వెయ్యిమంది జనాభా ఉంటారు. వీరిలో అన్ని మతాలు, కులాల వారుంటారు. ఈ కాలనీని ఐదు భాగాలుగా విభజించారు. రాధాబాగ్, స్వామి బాగ్, కృషిబాగ్, సేవాబాగ్, ప్రేమ్ బాగ్ అని వీటికి పేర్లు పెట్టారు. ఒక్కో బాగ్‌లో సుమారు 20-30 ఇళ్ల వరకు ఉంటాయి. ఇలా విభజించటానికి ప్రధాన కారణం.. పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా ఉండడానికే. పైగా బాగ్‌ల మధ్య ఖాళీ ఉండటం వల్ల గాలి, వెలుతురు, పచ్చదనానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ప్రతి బాగ్ చుట్టూ చక్కటి రోడ్లు కనిపిస్తాయి. అయితే ఇక్కడ ఇళ్లు ఎవరికైనా అమ్మాలన్నా వారు సత్సంగులే అయి ఉండాలి. బయటి వారెవరైనా సత్సంగులుగా మారాలన్నా.. అంత సులభం కాదు.. ఒక సంవత్సరం పాటు అతను కాలనీ నియమాలు పాటించాలి. సంవత్సరం తర్వాత కూడా అతను రాధాస్వామి భక్తుడిగా మారాలన్న దృఢ నిశ్చయంతో ఉంటేనే అవకాశం ఇస్తారు.

ప్రత్యేక జీవన కళ



సూత్రం 2:

ముచ్చటైన ప్రణాళికే... మొదటి మెట్టు

ఈ కాలనీ వాసులు ఆడంబరాలకు దూరంగా ఉంటారు. ప్రధానంగా నగరాల్లో ఉండేవారు పెళ్లి, ఇతర శుభకార్యాలకు చేసే ఖర్చు ఎంతుంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీళ్లు మాత్రం వాటికి దూరం. పెళ్లిళ్లు చాలా నిరాడంబరంగా చేసుకుంటారు. రూ. 10 వేలలోపు కూడా పెళ్లిళ్లయిపోతుంటాయి.

ఈ కాలనీ వాసుల జీవన శైలి ఆదర్శప్రాయంగా ఉంటుంది. సమయపాలనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. రోజూ ఉదయం 4 గంటలకే నిద్ర లేస్తారు. కాలకృత్యాలు తీర్చుకొని అందరూ 4.45 గంటలకు ప్రార్థనా మందిరంలో సమావేశమవుతారు. ఓ అరగంట పాటు ప్రార్థన (సురత్) చేస్తారు. తర్వాత చిన్నా పెద్దా అంతా కలిసి కాలనీలో ఉన్న గ్రౌండ్‌కు చేరుకుంటారు. అరగంట పాటు వ్యాయామం చేస్తారు. ఇది ఉదయం 6 గంటల వరకు కొనసాగుతుంది. అక్కడి నుంచి పెద్దవాళ్లందరూ 'తోట పని'లో నిమగ్నమవుతారు. ఓ గంటపాటు పనిచేసి ఎవరి పనుల్లో వారు నిమగ్నమై పోతారు. మళ్లీ సాయంకాలం 6 గంటలకు అందరూ కలిసి గ్రంథాలు పఠిస్తారు.

అందరూ తోట మాలీలే



సూత్రం 3:

మనం తినే ఆహారం మన తోటలోనే...

మనం తినే వాటిని సాధ్యమైనంత వరకు మనమే పండించుకోవాలంటారు. దీనికోసం వారి ప్రణాళిక అమోఘంగా ఉంటుంది. కాలనీ నిర్మాణ సమయంలోనే వారు కేవలం కూరగాయలు, పండ్లతోటల కోసం సుమారు ఐదారు ఎకరాల స్థలం వదిలేశారు. వీటన్నింటిని ఒకేచోట కాకుండా కాలనీలో వేర్వేరు చోట్ల పండిస్తారు. బెండకాయలు, వంకాయలు, టమాట, ముల్లంగి, మిరప, ములక్కాయలు, కాకర పాదులు, ఆనపకాయలు, బీర, ఐదారు రకాల ఆకుకూరలు పండిస్తారు. దీంతో పాటు మామిడి, అరటి, జామ, సపోటా, కొబ్బరి, బొప్పాయి పండ్లు విరివిగా పండుతాయి. వీటికి కేవలం సేంద్రియ ఎరువులనే వినియోగిస్తారు. కాలనీ సేంద్రియ ఎరువుల కోసం ఒక పిట్‌ను సైతం ఏర్పాటు చేశారు.

ఆగ్రాలోని దయాల్బాగ్ డీమ్డ్ యూనివర్సిటీ శాఖ ఈ కాలనీలో కూడా ఉంది. 1981లో 'దయాల్బాగ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్' పేరుతో దీనిని ఏర్పాటు చేశారు. ఇక్కడ వృత్తి విద్యకు ప్రాధాన్యం ఇస్తారు. వెబ్‌డిజైనింగ్, ఎలక్ట్రీషియన్, ఆఫీస్ మేనేజ్‌మెంట్, మోటార్ వెహికల్ మిషనరీ కోర్స్, టెక్స్‌టైల్ డిజైనింగ్ వంటి ఏడు కోర్సులు నేర్పుతారు. ప్రస్తుతం 54 మంది శిక్షణ పొందుతున్నారు. ఇవి బయటి వారు కూడా నేర్చుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరటానికి నోటిఫికేషన్ వేస్తారు.

అన్నీ... అందరివీ

సూత్రం 4:

లాభాలు కాదు అనుబంధాలు పండించాలి



కాలనీలో పండే కూరగాయలను ఒక పద్ధతి ప్రకారం పంచుతారు. ఒక్కోరోజు ఒక్కో బాగ్ వారికి ఆ దిగుబడి ఇస్తారు. అంటే సోమవారం బెండకాయల దిగుబడి ఒక బాగ్ వారికి ఇస్తే.. మరుసటి రోజు వంకాయలు కోస్తే మరో బాగ్ వారికి ఇస్తారు. ఇందులో కూడా లాభాపేక్ష ఉండదు. బయట మార్కెట్‌లో బెండకాయలు సుమారు కేజీ రూ. 30 ఉంటే.. ఇక్కడ రూ. 15కే ఇస్తారు. ఆ డబ్బులు కూడా కాలనీలోని కొన్ని నిర్వహణ ఖర్చులకే వినియోగిస్తారు. అలాగే కాలనీ మొత్తానికి ఓ రేషన్ షాపు ఉంటుంది. బయట హోల్‌సేల్ నుంచి సరకులు తీసుకొస్తారు. తీసుకొచ్చిన ధరలకే వాటిని కాలనీ వాసులకు అమ్ముతారు. వాటిమీద కేవలం ఓ అర్ధరూపాయి ఎక్కువగా తీసుకుంటారు. అవి కూడా రవాణా ఖర్చుల కోసమే. ఇక్కడి రేషన్ సరకులను కొనుగోలు చేసే అవకాశం బయట వారికి కూడా కల్పించారు. దీంతో చుట్టుపక్కల వారు కూడా వచ్చి తీసుకెళుతుంటారు. అంటే దాదాపు స్వయం సమృద్ధి అన్నమాట. దీనివల్ల అక్కడి కుటుంబాలపై ఆర్థికభారం కొంత తగ్గడంతో పాటు... అందరికీ ఆనందం, ఆరోగ్యం లభిస్తాయి.

నీటి నిర్వహణ అమోఘం

సూత్రం 5:

చుక్క... చుక్కగా.. భవిష్యత్తుకు నీటి ఊట



ఈ కాలనీలో నీటి నిర్వహణను చూస్తే మేనేజ్‌మెంట్ విద్యార్థులు కూడా సరిపోరు. ఈ కాలనీలో పురాతన బావులన్నింటినీ వీరు వర్షపు నీటితో నింపేశారు. ఆ కాలనీలో ప్రతి డాబా మీద పడిన ప్రతి వర్షపు చుక్క ఆ బావుల్లోకి వెళ్లేలా వ్యవస్థలు ఉంటాయి. పైపులతో అనుసంధానం చేసి ఉంచుతారు. వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం ఉండదు. అంతేకాదు.. ఆ కాలనీలో ప్రతి ఇంటికీ బోరు ఉండదు. నాలుగు ఇళ్లకు కలిపి ఒకరింట్లోనే బోరు ఉంటుంది. ఆ ఇంటి వాళ్లు ఉదయం బోరు వేసినపుడు మిగతా ఇళ్లవాళ్లు కూడా పైన ట్యాంకులు నింపుకొంటారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ భూగర్భ నీటిని తోడేసుకునే అవకాశం ఉండదు. దీంతో పాటు ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత ఉంటుంది. దీనివల్ల ఈ కాలనీలో నీటి కొరత అనే మాటే ఉండదు. ఈ కాలనీకి సమీపంలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఇప్పటికే పడిపోయి ఉన్నాయి. 500 అడుగులు తవ్వినా నీటి జాడ కనిపించడం లేదు. కానీ ఈ కాలనీలో వంద అడుగుల్లోపే నీళ్లు ఉంటాయి. బోర్లు కొడితే నీరు ఉబికి వస్తుంది. కాయగూరలు పండించడానికి కూడా వీరికి నీటి కొరత ఉండదు.

ఆదివారం అందరి వారం

సూత్రం 6:

ఇది మీ రోజు... సద్వినియోగం చేసుకోండి



ఈ కాలనీలోకి అడుగుపెడితే.. ఆధునిక ముసుగులో మనం 'కోల్పోయినవి' చాలా ఇక్కడ కనిపిస్తాయి. మనం నగరంలోనే ఉన్నామా అనిపిస్తుంది. బయటకు వచ్చేటప్పుడు మనమిక్కడ ఎందుకు లేమనిపిస్తుంది. అక్కడి ప్రశాంతత.. వారి జీవనవిధానం.. శ్రమైక సౌందర్యం.. అందరూ తెలుసుకోవాల్సిన విషయాలివి.

ఈ కాలనీ వాసులంతా రాధాస్వామి భక్తులు. 1861లో రాధాస్వామి సత్సంగ్‌ను వసంత పంచమి రోజున పరమ పురుష పూరణ ధని ఆగ్రా కేంద్రంగా దీన్ని స్థాపించారు. 1915లో అయిదో గురువు పరమగురు సాహెబ్‌జీ మహరాజ్ కాలంలో ఆగ్రాలో దయాల్ బాగ్ (దయార్ద్ర తోట) ఏర్పాటు చేశారు. ఈ మతాన్ని నమ్మిన వారు దయాల్‌బాగ్‌లో నివాసం ఉండేవారు. ఈ గురువు కాలంలోనే 'చదువు-జీవనోపాధి' అనే రెండు అంశాలకు పెద్దపీట వేశారు. ఈ ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఓ చిన్న విద్యాలయం నేడు 'డీమ్డ్ యూనివర్సిటీగా' మారింది. ఆ విద్యాలయశాఖ ఇప్పుడు మనం చెప్పుకుంటున్న దయాల్‌నగర్‌లో కూడా ఉంది. ఈ కాలనీ వాసుల ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నీ గురూజీలు చెప్పినట్లు.. వారి గ్రంథాల ఆధారంగానే కొనసాగుతాయి. రాధాస్వామి భక్తులను సత్సంగ్‌గా పిలుస్తారు. వీరి ఆధ్యాత్మిక జీవితంలోనూ మానవ విలువలకు, శ్రమైక జీవనానికి ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. రాధాస్వామి సత్సంగ్ బోధనలకు ఆకర్షితులైన కొంతమంది విశాఖ వాసులు 1965లో కైలాసగిరికి సమీపంలో 'దయాల్ నగర్' కాలనీ ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ ఉండేవారంతా రాధాస్వామి భక్తులే.

ఈ కాలనీ వాసులకు ఆదివారం ప్రత్యేకం. సెలవు రోజు కావటంతో కాలనీ అభివృద్ధిపనుల్లో అందరూ మునిగిపోతారు. బయటి ప్రపంచంలో ఎంత పెద్ద హోదాలో ఉన్నా.. ఇక్కడ మాత్రం ఆ తారతమ్యాలు ఉండవు. చిన్నా.. పెద్దా.. గొప్ప.. బీద భేదం కనిపించదు. కొందరు తోటపనిలోకి వెళితే.. మరికొందరు కాలనీలో చెత్తాచెదారాలు తొలగిస్తారు. మరికొందరు శానిటేషన్ పనుల్లో నిమగ్నమవుతారు. ఆ కాలనీలోని కొందరు మహిళలు అక్కడ పనిచేసే వారి కోసం ఫుడ్‌కోర్టులో అల్పాహారం తయారు చేసి అందిస్తారు.

- **సయ్యద్ ఫయాజ్, గురుమూర్తి,** విశాఖపట్టణం

చిత్రాలు: నాయుడు

మెన్ ఇన్ బ్లాక్ @ చిత్తూరు

"మెన్ ఇన్ బ్లాక్" హాలీవుడ్ సినిమా... 1997లో వచ్చిన ఈ సినిమా ప్రపంచంలో ఎందరినో ఉర్రూతలూగించింది. ఇప్పటికే మూడు భాగాలుగా వచ్చిన ఈ సినిమా నాలుగో భాగం ఈ ఏడాది జూన్ 14న అమెరికాలో విడుదల కానుంది. ఎంతో భారీ వ్యయంతో నిర్మించిన ఈ యాక్షన్ సినిమా కోసం ఎందరో అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

అయ్యయ్యో.... ఏంటీ సినిమా గోల అని కంగారు పడకండి. ఈ సినిమాలో కథానాయకులు వేసుకొనే అత్యంత ఖరీదైన సూట్లు చిత్తూరు జిల్లాకు చెందిన గ్రామీణ మహిళలు తయారు చేస్తున్నారు. వారు జాగ్రత్తగా వేసే చేతి కుట్టు నుంచే ఆ సూట్లు మెన్ ఇన్ బ్లాక్ హీరో ఒంటిపైకి వెళ్తున్నాయి...





క్యాడ్ అండ్ ది డ్యాండీ... పేరు మోసిన ఈ సూట్లు తయారుచేసే కంపెనీ అమెరికా నుంచి తన వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కంపెనీకి అమెరికాతో పాటు యూకే, స్వీడన్ దేశాల్లోని వివిధ నగరాల్లో షోరూంలు ఉన్నాయి. అత్యద్భుతంగా సూట్లు తయారు చేస్తుందనే పేరున్న ఈ కంపెనీ తయారీ యూనిట్ (ఎంఎస్ఆర్ గార్మెంట్స్ పేరుతో) చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీలో ఉంది. ఇందులో ఉన్న 122 మంది మహిళల చేతి మీదుగానే సూట్లు తయారవుతాయి. శ్రీసిటీ పక్కనున్న చిన్నచిన్న పల్లెల్లో ఉండే మహిళలకు శిక్షణనిచ్చి వారితో ఈ సూట్లు తయారు చేయిస్తున్నారు.. యంత్రాలతో కాకుండా... కేవలం చేతికుట్టు ద్వారా సూట్లను తయారు చేయడం ఈ కంపెనీ ప్రత్యేకత. వీటికి ప్రపంచవ్యాప్తంగా మంచి క్రేజ్ ఉంది. హాలీవుడ్ స్టార్లు మొదలుకొని... ఎందరో వీవీఐపీలు ఈ కంపెనీ సూట్లను ధరిస్తారు. ఇండియాలోనూ ప్రముఖ క్రికెట్ క్రీడాకారులు సచిన్, ద్రవిడ్‌లు ఎప్పుడైనా లండన్ పర్యటనలో ఉన్నప్పుడు ప్రత్యేకంగా వీటిని తయారు చేయించుకునే వారు.

ఆ సినిమా మొత్తానికి...


మెన్ ఇన్ బ్లాక్ 4వ భాగంలో ఇద్దరు ప్రధాన హీరోల్లో ఒక పాత్రలో నటిస్తున్న క్రిస్ హేమ్స్‌వత్ వాడిన సూట్లన్నీ శ్రీసిటీ నుంచి వెళ్లినవే. సుమారు 60 వరకు సూట్లు, షర్టులు, జాకెట్లు ఈ సినిమా కోసం తయారుచేశారు. వీటిని సినిమాలో వివిధ సందర్భాల్లో క్రిస్ వేసుకుంటాడు. సినిమా ప్రారంభంలో ఈ ఆర్డరు దక్కించుకుందీ సంస్థ

అద్భుత శిక్షణ

సంస్థలోకి తీసుకునే మహిళలంతా గ్రామీణ నేపథ్యం ఉన్నవారే. శ్రీసిటీ సమీపంలోని 30 గ్రామాల నుంచి వచ్చిన వారే. గతంలో కూలీపనులకు, వ్యవసాయ పనుల్లో ఉన్న వారే. వారిని రూ.12 వేల జీతానికి తీసుకుంటున్న సంస్థ.... వారికి ఆరు నెలలు శిక్షణ ఇస్తోంది. టైలరింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి విడిగా... కుట్టు పనిలో వారికి విడిగా శిక్షణ ఇస్తున్నారు. సూట్లు తయారీను ఎలా జాగ్రత్తగా చేయాలి...? ఎంత అంచుమేర కుట్టాలి..? చేతులు, మనసు ఎంత ప్రశాంతంగా ఉంచుకోవాలో శిక్షణ ఇస్తారు. వీరికి అన్నీ సదుపాయాలను సంస్థ కల్పిస్తోంది. ఇంతకీ ఇంత జాగ్రత్తగా తయారు చేసే ఈ సూట్ ఖరీదు రూ.60 వేల నుంచి మొదలై రూ.5 లక్షల వరకు ఉంది.

- **మావూరి శివ,** తిరుపతి

ఆసిస్ అసిల్.. థాయ్ రాజా





పందెం కోళ్లు అనగానే...కాకి, నెమలి, జింగిలి, డేగా, సేతు. ఈ పేర్లే గుర్తుకొస్తాయి. ఈసారి సంక్రాంతి సమరంలో దేశీయ కోళ్లతో పాటు విదేశీ కుక్కుటాలు కూడా దర్శనమిస్తున్నాయి. పందెంలో సత్తా చాటడానికి థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా నుంచి కోళ్లను రప్పించారు. అసిల్ జాతికి చెందిన కోళ్లు ఈసారి రంగంలోకి దించుతున్నారు. అరబిక్‌లో అసిల్ అంటే నాణ్యమైన జాతి అని అర్థం. అందుకు తగ్గట్టే ఈ కోళ్లు కాస్త సెప'రేటు'. బరువు తక్కువ ఉండటం వీటి ప్రత్యేకత. ఫలితంగా గాల్లోకి ఎక్కువ ఎత్తు ఎగర గలుగుతాయి. మన జాతి కోళ్లు 3-5 కిలోల బరువుంటే.. వీటి బరువు 3 కిలోలకు కాస్త ఇటుగా ఉంటుందంతే. పైగా ఈ కోళ్లలో పోరాడే తత్వం కూడా అధికంగా ఉంటుందట. ఏమాత్రం రెచ్చగొట్టినా.. ప్రత్యర్థి కోడిని ముప్పుతిప్పలు పెట్టి మట్టికరిపిస్తాయట. సాధారణ పందెం కోడి ధర రూ.5,000 నుంచి రూ.లక్ష వరకు ఉంటే వీటి ధర లక్షన్నర పైమాటే! విదేశాల నుంచి సముద్ర మార్గంలో వచ్చిన కోళ్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యుద్ధానికి సిద్ధం చేసుకున్నారు

ఈనాడు సినిమా

ఆ ఆలోచన రాలేదు

ఈతరం కథానాయికల లెక్కలు వేరు. తమ క్రేజ్ కొంతకాలమే అనే విషయం వాళ్లు బాగా అర్థం చేసుకున్నారు. అందుకే గ్లామర్ ఉండగానే నాలుగు సినిమాల్ని వెనకేసుకుంటున్నారు. వీలైనంత తక్కువ సమయంలో ఎక్కువ సినిమాల్ని చేయడమే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నారు. ఓ దశలో తమన్నా కూడా ఇదే సూత్రం అనుసరించింది. అయితే ఇప్పుడు ఆమెలో కాస్త మార్పు వచ్చింది. సినిమాల కోసం వెంపర్లాడటం లేదు. వచ్చిన అవకాశాల్లో అత్యుత్తమమైనవి ఎంచుకుంటోంది. "ఇప్పుడే కాదు.. నేను ముందు నుంచీ ఇలానే ఉన్నాను. అవకాశం వచ్చింది కదా అని ప్రతి సినిమా ఒప్పేసుకోలేదు. వదులుకున్న సినిమాల్లో కొన్ని బాగా ఆడాయి. కొన్ని ఆడలేదు. ఆ ఫలితాల్ని నేనెప్పుడూ పట్టించుకోలేదు. ఓ దశలో చేతినిండా సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడిపా. అవన్నీ ఇష్టపడి ఎంచుకున్న కథలే. తీరిక లేకుండా పనిచేసినా ఎప్పుడూ అలసిపోలేదు. 'కొన్నాళ్లు సినిమాలకు బ్రేక్ ఇద్దాం' అనే ఆలోచన రాలేదు. విరామం అనేది మనం కోరుకున్నప్పుడు రాదు. వచ్చినప్పుడు మాత్రం తీసుకోవాల్సిందే" అంటోంది తమన్నా.



తమన్నా

గీతోపదేశం

ఏ సిరి కోరి పోతన్న
భాగవత సుధలు చిలికించెను
ఏ నిధి కోరి త్యాగయ్య
రాగ జలనిధులు పొంగించెను
రమణీయ కళావిష్కృతికి
రసానందమే పరమార్థం
గీతం: లలిత కళారాధనలో వెలిగే
చిరుదివ్వెను నేను...

చిత్రం: కళ్యాణి
రచన: సి.నారాయణరెడ్డి

– పంపినవారు: వి.రాజయ్య, మచిలీపట్నం

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

మజ్ను పాటల సందడి



అఖిల్

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. నిధి అగర్వాల్ కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 25న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఈ చిత్రంలోని పాటలన్నింటినీ విడుదల చేస్తున్నారు. "ఇప్పటికే టీజర్, రెండు పాటలు విడుదలయ్యాయి. వాటికి చక్కటి స్పందన లభించింది. తమన్ స్వరకల్పనలోని గీతాలన్నీ శ్రోతల్ని అలరిస్తాయ"ని చిత్రవర్గాలు చెప్పాయి. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జార్జ్ సి.విలియమ్స్.

చేసింది నాలుగు సినిమాలే అయినా వినోదం పండించడంలో తన ప్రత్యేకతని చాటుకొన్నారు అనిల్ రావిపూడి. వాణిజ్యాంశాల్ని పక్కాగా జోడించి ఇంటిల్లిపాదీ మెచ్చేలా సినిమాలు తీస్తుంటారాయన. 'పటాస్'తో ప్రయాణం మొదలుపెట్టిన అనిల్... 'ఎఫ్2'తో మరో విజయాన్ని సొంతం చేసుకొన్నారు. వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా నటించిన ఆ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. సంక్రాంతి అల్లుళ్లుగా వెంకీ, వరుణ్ థియేటర్లలో వినోదాల్ని పంచుతున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...



'గుండమ్మ కథ' కోరిక తీర్చింది 'ఎఫ్2'

ప్రతి సినిమాతోనూ నవ్విస్తుంటారు. 'ఎఫ్2'తో ఆ డోసు మరింత పెంచినట్టున్నారు...

చిన్నప్పుడు థియేటర్లలో జంధ్యాల, ఈవీవీ, ఎస్వీ కృష్ణారెడ్డిల సినిమాల్ని చూస్తున్నప్పుడు థియేటర్లో పై వరస నుంచి, కింద వరకు అందరూ నవ్వుతుండేవారు. అది ఇప్పటికీ నాకు గుర్తు. అలా థియేటర్ మొత్తం నవ్వుతూ కనిపించేలా సినిమా చేయాలనుకొన్నా. నిన్న 'ఎఫ్2' ఆడుతున్న ఓ థియేటర్‌కి వెళ్లి చూస్తే అందరూ నవ్వుకోవడం కనిపించింది. ఆ రోజుల్లో అలా చూసిన సినిమాల్ని ఈ రోజు నేను తీసి నా లక్ష్యాన్ని నెరవేర్చుకొన్నా.

'ఎఫ్2' ఆలోచన ఎప్పుడొచ్చింది? ఈ సినిమాకి స్ఫూర్తి ఏంటి?

'రాజా ది గ్రేట్' సెట్స్‌పై ఉన్నప్పుడు వచ్చిన ఆలోచనే ఇది. వరుసగా మూడు యాక్షన్ సినిమాలు చేశాను కాబట్టి, తదుపరి ఫైట్స్ లేకుండా వినోదాత్మకంగా సాగే ఓ సినిమా చేయాలనుకొన్నా. 'పెళ్లాం చెబితే వినాలి', 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' సినిమాల తరహాలో భార్యాభర్తల నేపథ్యంతో కూడిన కథయితే బాగుంటుందనే ఆలోచన తట్టింది. పైగా నాకు 'గుండమ్మ కథ' సినిమా అంటే పిచ్చి. ఎప్పటికైనా అలాంటి మల్టీ స్టారర్ సినిమా చేయాలనే కోరిక ఉండేది. ఆ ప్రభావం ఈ సినిమాలోని పాత్రల్లో కనిపిస్తుంటుంది. అలా 'గుండమ్మ కథ' గురించి మనకు తెలిసింది ఏదో ఒకటి చెబుదామనే కోరిక ఈ చిత్రంతో తీరింది.

వెంకటేష్, వరుణ్‌తేజ్‌లని దృష్టిలో ఉంచుకొనే ఈ కథ సిద్ధం చేశారా...?

వాళ్లని మాత్రమే దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేసిన కథ ఇది. వందశాతం వెంకటేష్ చేయాల్సిన కథ ఇది. వరుణ్‌తేజ్ బోరబండ బస్తీ కుర్రాడి పాత్రకి తగ్గట్టే ఉంటాడు. కథ చెప్పగానే ఇద్దరూ ఆసక్తిని కనబరిచారు. ఎక్కడో ఒక చోట తన వయసుని గుర్తు చేస్తూ సన్నివేశాలు రాయమని వెంకటేష్‌గారు అంటే... నా పాత్ర పరిధికి తగ్గట్టే చూపించమని వరుణ్‌తేజ్ చెబుతూ నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. అందుకే ఆ స్థాయిలో వినోదం పండింది.

మీ సినిమాల్లో కథ బలహీనంగా ఉంటుందనే విమర్శ వినిపిస్తుంటుంది. అది మీ దృష్టికి వచ్చిందా?

సినిమాలో వాణిజ్యాంశాలు ముఖ్యం అనుకొన్నప్పుడు ఎక్కడో ఒక చోట కథ బౌండరీలు దాటాలి. కేవలం కథ మీదే దృష్టిపెడితే అదొక రకమైన సినిమా అవుతుంది. 'మాతృదేవోభవ' ఒక నావెల్ స్టోరీ. అలాంటి సినిమా చేస్తున్నప్పుడైతే కథ గురించే మాట్లాడొచ్చు. 'రాజా ది గ్రేట్' సినిమాని 'కాబిల్' లాగా చేయొచ్చు. కానీ రవితేజతో అలాంటి సినిమా చేస్తే ప్రేక్షకులకి చేరువవుతుందా? నా సినిమాల్లో కథ కంటే ట్రీట్‌మెంట్‌కే ఎక్కువ ప్రాధాన్యమనే విషయాన్ని నేను కూడా ఒప్పుకుంటా. అయితే ఇప్పటిదాకా కథకి ప్రాధాన్యం ఉన్న సినిమా చేసే అవకాశం నాకు రాలేదు. అలాంటి సినిమాని త్వరలోనే చేస్తా.

సినిమా చూసిన ప్రతి ఒక్కరూ 'అంతేగా అంతేగా' అంటూ సరదాగా మాట్లాడుకొంటున్నారు. థియేటర్ల నుంచి వెంకీ ఆసనాలు వేస్తూ బయటికొస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ మా సినిమా సందడే కనిపిస్తోంది. నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు నమ్మి చేసిన సినిమా ఇది.

కామెడీ పండించడం అంత సులభం కాదంటారు. కానీ మీ ప్రతి సినిమాలోనూ అదే బలంగా కనిపిస్తుంటుంది. అందుకోసం ఎలాంటి కసరత్తులు చేస్తుంటారు?

నా సినిమాల్లో వినోదం పండుతోందంటే కారణం నేను చూసిన సినిమాలే. కామెడీ అయినా, భావోద్వేగాలైనా, సాంకేతికతైనా... అన్నీ సినిమాల్ని చూసే నేర్చుకొంటుంటా. కొన్నిసార్లు జీవితంలో ఎదురైన అనుభవాలు ఉపయోగపడతాయి. సందర్భోచితంగా కామెడీ పండించడం అంత సులభమేమీ కాదు. అందుకోసం స్క్రిప్టు దశలో చాలా గ్రౌండ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. ఏ సంభాషణకి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో ఊహించాలి. ఆరోగ్యకరమైన వినోదం పండించడంలో నాకు జంధ్యాల, ఈవీవీ, ఎస్వీ కృష్ణారెడ్డి సినిమాలే స్ఫూర్తి.

తదుపరి సినిమా విశేషాలేంటి?

ఇంకా ఏమీ ఆలోచించలేదు. ఎప్పుడని చెప్పలేను కానీ హిందీ చిత్రం 'గోల్‌మాల్' తరహాలో 'ఎఫ్2'కి సీక్వెల్‌గా సినిమాలు చేయాలనే ఆలోచన ఉంది. 'ఎఫ్3' పేరుతో సినిమా చేద్దామని వెంకటేష్, వరుణ్‌తేజ్‌లకి కూడా చెప్పా. వాళ్లూ ఒప్పుకొన్నారు. అందులో మరో హీరో కూడా ఉండొచ్చు.

హిందీలో సినిమాలు చేసే ఆలోచనలేమైనా ఉన్నాయా?

నా సినిమాల్ని మెచ్చి అక్కడ రీమేక్ చేసే అవకాశం ఎవరైనా ఇస్తే చేస్తానేమో. 'పటాస్' చిత్రాన్ని హిందీలో రివర్స్ చేసి 'కర్తవ్యం'లాగా కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రంగా రీమేక్ చేద్దామనుకొన్నా. భవిష్యత్తులో ఆ అవకాశం వస్తే చేస్తానేమో. బయోపిక్ చిత్రాలన్నా నాకు ఇష్టమే. మంచి ఆలోచన వస్తే స్పోర్ట్స్ నేపథ్యంలో ఓ బయోపిక్ చిత్రం చేయాలనుంది.

హిరాణీపై వేధింపుల ఆరోపణలు



రాజ్‌కుమార్ హిరాణీ

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీపై ఓ సహాయ దర్శకురాలు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినట్లు ఓ మీడియా సంస్థ పేర్కొంది. 'సంజు' సినిమా చిత్రీకరణ సమయంలో హిరాణీ నుంచి తనకెదురైన వేధింపుల గురించి వివరిస్తూ ఆమె ఆ చిత్ర నిర్మాత విధు వినోద్ చోప్రాకు, ఆయన భార్య అనుపమ చోప్రాకు ఈమెయిల్ చేసిందని ఆ సంస్థ వెల్లడించింది. "గత ఏప్రిల్‌లో హిరాణీ నాతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ తర్వాత ఆరు నెలల పాటు ఆయన నుంచి నరకం అనుభవించాను. ఆ విషయం బటయకు చెబితే నన్ను ఉద్యోగం నుంచి తొలగిస్తారని భయపడ్డాను. ఆయన నా గురించి చెడుగా చెబితే ఇంకెక్కడా పని దొరకదని భావించాను. అందుకే మౌనంగా భరించాన"ని ఈమెయిల్‌లో ఆమె పేర్కొన్నట్లు సదరు సంస్థ తెలిపింది. అయితే హిరాణీ ఆ ఆరోపణలను ఖండించారని వెల్లడించింది. ఈ వేధింపుల వ్యవహారంతో రాజ్‌కుమార్ హిరాణీని విధు వినోద్ చోప్రా దూరం పెట్టాడని తెలుస్తోంది. వారిద్దరు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న 'ఏక్ లడ్‌కీకో దేఖాతో ఐసా లగా' నుంచి హిరాణీకి చెందిన రాజ్‌కుమార్ హిరాణీ ఫిలింస్ సంస్థను తొలగించారని సమాచారం.

ఉండిపోరాదే

తరుణ్ తేజ్, లావణ్య నాయకానాయికలుగా గోల్డ్ టైమ్ ఇన్ పిక్చర్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. నవీన్ నాయని దర్శకత్వం వహిస్తున్నారు. లింగేశ్వర్ నిర్మాత. సత్య ప్రమీల కర్లపూడి సమర్పిస్తున్నారు. సంక్రాంతి పండగని పురస్కరించుకొని పేరుని ఖరారు చేయడంతో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "బలమైన కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. కథకు తగ్గట్టుగానే 'ఉండిపోరాదే' అనే పేరును నిర్ణయించాం. దిల్‌రాజు సంస్థలో పలు చిత్రాలకి సహ దర్శకుడిగా పనిచేసిన నవీన్ నాయని అన్ని వర్గాల ప్రేక్షకులకి వినోదం పంచేలా చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. తొలి షెడ్యూల్‌ని రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పూర్తి చేశాం. ఈ నెల 28 నుంచి బెంగళూరు, మైసూర్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతాం" అన్నారు. కేదార్ శంకర్, సత్యకృష్ణన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాబు వర్గీస్, ఛాయాగ్రహణం: శ్రీను విన్నకోట.



లావణ్య

పాత్రికేయ ముద్ర

నిజ జీవితాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'ముద్ర'. నిఖిల్ సిద్ధార్థ్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్నారు. టి.ఎస్.సంతోష్ దర్శకుడు. కావ్య వేణుగోపాల్, రాజ్ కుమార్ నిర్మిస్తున్నారు. బి.మధు సమర్పిస్తున్నారు. ఒక పాట, కొంత టాకీ మినహా చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే టీజర్‌ని విడుదల చేయనున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "పాత్రికేయం నేపథ్యంలో సాగే చిత్రమిది. నిఖిల్ పాత్రికేయుడిగా నటిస్తున్నారు. ఆయనకి జోడీగా నటించిన లావణ్య త్రిపాఠి అందంతోనూ, అభినయంతోనూ అలరిస్తుంది. ఇందులో కథ, కథనాలు, యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకొనేలా ఉంటాయి. అన్ని హంగులతో చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నాం" అన్నారు. సంగీతం: శ్యామ్ సి.ఎస్, ఛాయాగ్రహణం: సూర్య.



లావణ్య త్రిపాఠి, నిఖిల్ సిద్ధార్థ్

ఇంకా ఇంకా ఏదో కావాలి

కథానాయికగా జోరుమీదున్న సమయంలోనే నిర్మాతగా మారి అందర్నీ ఆశ్చర్యపరిచారు అనుష్కశర్మ. 'ఎన్‌హెచ్ 10'తో నిర్మాతగా తొలి విజయం అందుకున్న ఆమె మరింతమంది కథానాయికలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె బాటలోనే అగ్ర కథానాయికలు ప్రియాంక చోప్రా, దీపికా పదుకొణె, కంగనా రనౌత్ వెళ్లి నిర్మాతలుగా మారారు. "నా తోటి నాయికలు నిర్మాతలుగా మారడం సంతోషంగా ఉంది. అందరికంటే ముందు నేను ఈ దారిలోకి వచ్చాను. అప్పుడు నాయికగా చాలా అవకాశాలు ఉన్నాయి. అయినా కెరీర్ తొలినాళ్లలోనే ఇంకా ఏదో కొత్తగా చేయాలనే తపనే నిర్మాతను చేసింది. వెండితెరకు రాకుండా ఉండిపోతున్న ఎన్నో గొప్ప కథల్ని వెతికిపట్టుకొనే అవకాశం దక్కింది" అని చెబుతోంది అనుష్క. నాయికగా గుర్తింపు వచ్చింది... నిర్మాతగానూ సత్తా చాటింది. ఇంకేం కావాలి? అంటే "ఎప్పటికీ ఇంకా ఏదో కావాలనే తపనతో పనిచేయడమే నా నైజం. నేను ఇంతవరకూ సాధిస్తే చాలు అనుకోను. అంతవరకే ఎందుకు... ఇంకా ఇంకా చేయాలి అనుకుంటాను" అని చెప్పిందీ 'సుల్తాన్' భామ. నిర్మాతగా మారితే సినిమాలో నాయికగానూ మంచి పాత్రలు దక్కుతాయా అంటే "నేను నిర్మాణ సంస్థను మొదలుపెట్టడానికి అది కారణం కాదు. నేను నిర్మించని 'సూయీ ధాగా', 'సుల్తాన్', 'యే దిల్ హై ముష్కిల్', 'జీరో'...వీటన్నింటిలోనూ నాకు మంచి పాత్రలే దక్కాయి. కొత్త కథల్ని, ప్రతిభ ఉన్న దర్శకుల్ని వెలికితీయడానికే నా తపనంతా. సమాజంలో నాటుకుపోయిన కొన్ని విషయాల పట్ల చైతన్యం తీసుకురావడం ఇందులో భాగమే" అని చెప్పింది అనుష్క శర్మ.



అనుష్క శర్మ



పండగ వేళ... పోషకాలు అందేలా

రేగు పండ్లు... చెరకు ముక్కలు... నువ్వుల లడ్లు.. ఇవన్నీ ఉంటేనే సంక్రాంతి. మరి అవి ఆరోగ్యానికి ఎలా మేలు చేస్తాయో తెలుసా!

రేగుపండ్లు: ఇవి నిద్రలేమిని దూరం చేస్తాయి. ఈ పండ్లలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం. వందగ్రాముల పండ్లలో 69 మిల్లీగ్రాముల విటమిన్ సి లభిస్తుంది. అది వ్యర్థాలను తొలగిస్తుంది. రోగనిరోధకశక్తిని పెంచుతుంది.



చెరకు: ఇందులో ఫ్లవనాయిడ్లు, యాంటీ అలర్జీ, యాంటీ వైరల్, యాంటీక్యాన్సర్ కారకాలు అధికం. బాగా అలసిపోయినప్పుడు గ్లాసు చెరకురసం తాగి చూడండి. తక్షణ శక్తి అందుతుంది. చెరకును మూత్రపిండాలకు ఎంతో మేలుచేస్తుంది. డీహైడ్రేషన్ దూరం అవుతుంది. పిల్లలు చెరకు ముక్కలు నములుతుంటే దంతాలు శుభ్రపడటమే కాదు... గట్టిపడతాయి కూడా.

నువ్వులు: వీటిని తరచూ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. మలబద్ధకం దూరమవుతుంది. వీటిలో ఇనుము, క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. ఎదిగే ఆడపిల్లలకు నువ్వులతో చేసిన పదార్థాలు తినిపించడం వల్ల రక్తహీనత బాధించదు.



భోగి పండగంటే గుర్తొచ్చేది... భోగి పండ్ల వేడుక. తమ పిల్లలపై ఉన్న కీడు తొలగిపోవాలని తల్లులు ఎంతో మురిపెంగా చేసుకునే ఈ వేడుక ఓ మధురజ్ఞాపకమే. అసలు ఇది ఎందుకు చేస్తారు... దాని ప్రాశస్త్యం ఏంటనేది వివరిస్తున్నారు ఆధ్యాత్మికవేత్త మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి.

బంగారుకొండలకు భోగిభాగ్యాలు

మకర సంక్రాంతి తెలుగువారికి ఎంతో ప్రీతిపాత్రమైన పండగ. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్న మనకు పంట చేతికి అందివచ్చే సమయానికి ఈ పండగ వస్తుంది. మొదటిరోజు భోగి. ఇంట్లో పాత వస్తువులు, పనికి రానివాటిని భోగిమంటల్లో వేస్తారు. అలానే పిల్లలకు భోగిపండ్లు పోస్తారు. రెండోరోజు పెద్దలకు తర్పణాలిచ్చే పెద్ద పండగ. ఇది మకర సంక్రమణం ఉత్తరాయణ పుణ్యకాలం. మూడోరోజు కనుమ. ఇది రైతుల పండగ.

సూర్యాస్తమయానికి ముందే...

ఉదయం భోగిమంటలు వేసుకున్నాక... పిల్లలు, పెద్దలంతా అభ్యంగన స్నానాలు చేయడం తెలిసిందే. ఇళ్లల్లో చిన్నారులుంటే... వాళ్లకు భోగిపండ్లు పోయడం చాలా కుటుంబాల్లో ఉన్న సంప్రదాయమే. భోగిపండ్లు కూడా రోజులో ఎప్పుడు పడితే అప్పుడు పోయకూడదు. సూరాస్తమయ సమయంలోపు పోయాలి. భోగిపండ్లలో అంటే రేగుపండ్లలో చిల్లర నాణేలు, చిన్న చిన్న చెరకు ముక్కలు, పూలరేకలు కలిపి పిల్లల తలపై అభిషేకిస్తారు. భోగిపండ్ల వేడుక దృష్టి దోష పరిహారం కోసం చేస్తారు. ఇందులో భాగంగా పండ్లను పిల్లల తల చుట్టూ మూడుసార్లు తిప్పి దిష్టి తీసి ఆపై పోయాలి. మొదట తల్లి పిల్లలకు బొట్టు పెట్టి... దిష్టి తీసి భోగిపండ్లు పోసి ఆశీర్వదించాలి. ఆ తరువాత ముత్తయిదువలు పోస్తారు. అలానే అక్షింతలు వేసి దీవెనలు అందించాలి. అసలు ఈ కార్యక్రమం ఎందుకు చేసుకుంటారంటే... భోగి పండగనాడు బలి చక్రవర్తి సూక్ష్మరూపం ధరించి భూమిపైకి వస్తాడని ఓ విశ్వాసం. బలి ప్రభావం తమ బిడ్డలపై పడకుండా తల్లులు తమ దీవెనలను భోగిపండ్ల రూపంలో ఇస్తారు. తల్లి దీవెనకు ఎంతో ప్రాధాన్యముంది. మన సంప్రదాయంలో తల్లి ఆరాధ్యదైవం. 'మాతృదేవోభవ', 'నమాతుఃపరదైవతమ్' వంటి మాటలతో తల్లి ప్రాధాన్యాన్ని వేద వాఙ్మయం వివరించింది. అంతేకాదు, తల్లే బిడ్డకు తొలి గురువు కూడా.

కీడుపోయేలా...

భోగిపండు సూర్యునికి ప్రీతి పాత్రమైంది. పైగా సూర్యుడి ఆకారంలో గుండ్రంగా ఉంటుంది. ఆరోగ్య ప్రదాత అయిన సూర్యుని అనుగ్రహం తమ బిడ్డకు కలగాలనే ఆకాంక్షతో తల్లులు ఈ వేడుక చేస్తారని పెద్దల ఉద్దేశం. భోగిపండు అంటే రేగు పండు. దీన్ని సంస్కృతంలో బదరీఫలం అంటారు. ఈ బదరీ ఫలం, బదరీ వృక్షం విష్ణుమూర్తికి ఎంతో ఇష్టం అంటారు. అందుకే విష్ణుదేవుని ఆశీస్సులతో బలి ప్రభావాన్ని తప్పించి తమ పిల్లలకు భోగి కీడును తొలగింపజేయడం కోసం తల్లులు బిడ్డలకు భోగిపండ్లు పోస్తారని అంటారు. భాగవతంలో ప్రసిద్ధమైన దశావతారాలతోపాటు విష్ణుమూర్తికి మరో పదకొండు అవతారాల వివరాలున్నాయి. వాటిని 'ఏకవిశంతి అవతారాలు' అని చెబుతోంది భాగవతం. ఆ 21 అవతార మూర్తులలో వేద వ్యాసులు ఒకరు. వ్యాసుని రూపంలో అవతరించిన విష్ణుమూర్తి బదరీ వృక్షం నీడలో తపస్సు చేసిన కారణంగా 'బాదరాయణుడు' అనే పేరు వచ్చింది. ఆ వృక్షఫలం రేగుపండు. అంటే విష్ణుమూర్తి అనుగ్రహ ఫలం. కనుక ఆ రేగు పండ్లను భోగిపండ్లు అనే పేరుతో తమ బిడ్డల శ్రేయస్సు, అభ్యుదయాన్నీ ఆకాంక్షిస్తూ భోగిపండగ నాడు ఇలా చేస్తారు. దృష్టి దోషాలను పరిహరించి, చిన్న పిల్లలకు ఆయురారోగ్య భాగ్యాలు... అనేక భోగాలను ప్రసాదిస్తాయని నమ్ముతారు. అందుకే పిల్లలు కాస్త పెద్దయ్యేవరకూ ఈ భోగిపండ్ల వేడుక దాదాపు అన్ని తెలుగు ఇళ్లల్లో కనిపిస్తుంది.

రంగవల్లిక



15 చుక్కలు, 5 వరుసలు. 5 వచ్చేవరకు.



- ఎమ్. అన్నపూర్ణ
కాజ, కృష్ణాజిల్లా



17 చుక్కలు, 7 వరుసలు, 7 వచ్చేవరకూ.



- ఎమ్.రాణి
ఉప్పల్, హైదరాబాద్

మెచ్చిన ముగ్గుల పోటీ

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ జనవరి 12, 2019 విజేతలు

1. డి.లక్ష్మీపార్వతి, గొల్లల మామిడాడ - తూ.గో.జిల్లా 2. వి.అరుణకుమారి, పెద్దఅరికట్ల - ప్రకాశం 3. ఎస్.నాగమణి, కృష్ణపట్నం - నెల్లూరు 4. జి.హైమావతి, కడప 5. ఏ.పద్మావతి, జాండ్రపేట - ప్రకాశం 6. రమాదేవి, విజయవాడ 7. ఏ.ప్రసన్న, జక్కేపల్లిగూడూరు - నెల్లూరు 8. కె.లలిత, నంద్యాల 9. కె.సునీత, కావలి 10. వై.మేఘన, గాజువాక

పెరుగుతో పట్టులా

అసలే చలి... దానికితోడు పండగ... తల స్నానం చేసినా జుట్టు ఎండుగడ్డిలా కనిపించకూడదంటే తలస్నానానికి ముందు ఈ పూతలు వేసుకుని చూడండి.

- ఒక గుడ్డు సొనలో కొద్దిగా కలబంద గుజ్జు, రెండు చెంచాల ఆలివ్‌నూనె కలిపి తలకు పట్టించాలి. అరగంట అయ్యాక షాంపూతో కడిగేసుకుంటే చాలు. జుట్టు పట్టులా మారుతుంది.
- బాగా పండిన అరటి పండును గుజ్జులా చేసుకోవాలి. అందులో చెంచా తేనె, పావుకప్పు పెరుగు కలిపి తలకు పట్టించాలి. ముప్పావు గంట తరువాత తలస్నానం చేయాలి.



- పావుకప్పు పెరుగులో చెంచా ఆముదం కలిపి తలంతా రాసుకుని షవర్‌క్యాప్ పెట్టుకోవాలి. ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చని నీళ్లు, గాఢత తక్కువగా ఉన్న షాంపూతో కడిగేస్తే జుట్టు పట్టులా కనిపిస్తుంది.



మనసును తాకిన ఓ భావన ఆమెని కొత్తదారిలో నడిపించింది. ప్రపంచ నలుమూలలకు తన సేవలు అందించే స్థాయికి తీసుకొచ్చింది. పూల దారిలో కొత్త బాటను పట్టించింది. ఆమే హైదరాబాద్‌కి చెందిన చిత్రాదాస్. ఏడాదంతా నిల్వ ఉండే పూలతో బొకేలు, కానుకలు, గృహాలంకరణ వస్తువులు, వెడ్డింగ్ డెకరేషన్, పూల యాక్సెసరీలు రూపొందిస్తూ లాభాల బాటలో నడుస్తున్నారామె.

మా పూలు వాడిపోవు


పూలని చూస్తే చాలు ఒత్తిడి దూరమవుతుంది. ఇంట్లో రోజూ ఫ్లవర్‌వాజులోనూ, గాజు గిన్నెలోనూ అలంకరించుకుంటే ఇల్లంతా అందంగా, ఆహ్లాదంగా ఉంటుంది. చదువుకునే రోజుల్లో నా ఫ్లాట్‌లో ఒంటరిగా ఉండేదాన్ని. ఇల్లంతా ఖాళీగా బోసిపోయినట్టు ఉండటంతో పూలతో అలంకరించేదాన్ని. దాంతో ఇల్లు కళగా... పాజిటివ్ వైబ్రేషన్స్‌తో ఉండేది. అయితే అవి చాలా తక్కువ కాలంలో వాడిపోయేవి. అలానే ఎవరికైనా బహుమతిగా ఇచ్చినా కొన్నిరోజులకు పడేయాల్సిందే కదా. అందుకే పూలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా ఏదయినా చేస్తే బాగుంటుందని అనిపించింది. అలా చదువైపోయాక దానికి సంబంధించిన అధ్యయనం చేశా. ఆ తరువాత షాంఫ్లర్ పేరుతో 2017లో హైదరాబాద్‌లో ఓ సంస్థను ప్రారంభించా.

ల్యాబ్ ప్రత్యేకంగా...

జపాన్‌లో పూలను నిల్వ చేసే టెక్నాలజీ ఉందని తెలుసుకున్నా. చివరకు ఆ యంత్రాలను కొనుగోలు చేసి అక్కడే ల్యాబ్ ప్రారంభించా. దక్షిణ అమెరికా, పెరు, స్పెయిన్, ఆస్ట్రేలియా నుంచి పూలు తెప్పిస్తా. అదీ సేంద్రియ పద్ధతిలో సాగు చేసి పండించిన వాటికే ప్రాధాన్యం ఇస్తా. పూలను నిల్వ చేసే ప్రిజర్వేటివ్‌లు ఉన్నా... నేను వాడేది ఆర్గానిక్ ప్రిజర్వేటివ్‌లు. గులాబీలు, యూకలిప్టస్, క్రాస్పిడియా... ఇలా దాదాపు ఇరవై ఐదు రకాల పూలను సేంద్రియ పద్ధతిలో నిల్వ ఉండేలా చేసి వాటితో బొకేలు, రిటర్న్ గిఫ్టులు, ఫ్లవర్‌వాజులు, పెళ్లిళ్ల అలంకరణ... వంటివి చేస్తున్నాం. జపాన్‌లోని మా ల్యాబ్‌లో మూడు వారాలపాటు పూలను ప్రాసెస్ చేస్తాం. అక్కడి నుంచి వాటిని నెలకోసారి హైదరాబాద్ తెచ్చి, వినియోగదారులు కోరిన విధంగా అందిస్తాం. ఇవి చూడ్డానికి తాజా పూల మాదిరే ఉంటాయి. వాసన మాత్రం ఉండదు. ప్రాసెస్ చేసే క్రమంలో ఆ వాసన పోతుంది. ఇప్పుడు ఆ వాసన పోకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకునే ప్రయత్నంలో ఉన్నాం. త్వరలో వాటినీ మార్కెట్‌లోకి తీసుకొస్తాం.

నలుమూలలా అందిస్తా...

రెస్టారంట్లు, హోటళ్లు, కార్పొరేట్ సంస్థలు, ఆసుపత్రులు, అధికారుల గదుల్లో నిత్యం వాజులో ఒక పువ్వు లేదా... తాజా బొకే ఉండటం మామూలే. అలా ప్రతిరోజూ పూలు కొనడం చిన్న విషయమేగానీ... ఏడాది తరువాత లెక్క చూసుకుంటే పెద్ద మొత్తమే అవుతుంది. అలాంటివారికి మా నిల్వ పూలతో ఎంతో ఖర్చు తగ్గుతుంది. అదే మా వ్యాపార రహస్యం. అందుకే దేశవిదేశాల్లోనే కాదు, పలు సంస్థలూ మా వినియోగదారుల జాబితాలో ఉన్నాయి. కార్పొరేట్ కానుకలునూ అడుగుతున్నారు. మా వెబ్‌సైట్, ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా మమ్మల్ని సంప్రదించొచ్చు. ప్రపంచం నలుమూలలకు మా సేవల్ని అందిస్తాం. తెలుగురాష్ట్రాల్లోనూ మారుమూల పల్లెటూరి నుంచి అడిగినా ఈ పూలను అందిస్తాం.



పూలే ఎరువులుగా...

పెళ్లిళ్లు, ఇతర వేడుకలకీ... పూల అలంకరణ మామూలే. మేం అది కూడా చేస్తాం. కొందరు వధూవరులు తమ దుస్తులకు మ్యాచ్ అయ్యేలా అలంకరణ చేయమంటారు. ఒకవేళ మేం తాజా పూలను అలంకరిస్తే గనుక కార్యక్రమాలన్నీ అయ్యాక వాటన్నింటినీ సేకరిస్తాం. రీసైక్లింగ్ చేసి ఎరువుగా మారుస్తాం. అలా వచ్చిన ఎరువును మళ్లీ అమ్ముతాం. ఏ పువ్వూ వృథా కాకూడదనేదే మా ప్రయత్నం.



కోరుకున్న నగలు...

ఈ మధ్య పెళ్లిళ్లంటే ఒక్క మూడుముళ్లు వేసే తంతుతోనే పూర్తికావట్లేదు. పసుపు, మెహెందీ, సంగీత్, ఫొటో షూట్... ఇలా ఎన్నో ఉంటున్నాయి. ఆ సమయాల్లో చాలామంది తమ దుస్తులకు మ్యాచ్ అయ్యేలా పూల నగల్ని అడుగుతున్నారు. ఆ కార్యక్రమానికి హాజరయ్యేవారికి డ్రెస్ కోడ్ కూడా పెట్టి ఈ పూల నగలు అందిస్తున్నారు. అలాంటి నగల్ని మేం నిల్వ పూలతో తయారుచేసి ఇస్తున్నాం. గొలుసులు, గాజులు, బ్రూచ్, వడ్డాణం, క్రౌన్, పాపిట బిళ్లలు, హెయిర్ యాక్సెసరీలు అందిస్తున్నాం. ఇవి ఒక్కసారి కొనుక్కుంటే చాలు. ఏడాదిలో ఎన్నిసార్లైనా వాడుకోవచ్చు. చాలామంది ఒక్కసారి కొనుక్కొని బంధువులు, స్నేహితులు... ఇలా చాలామంది వాడుకుంటున్నారు.

> మాది పశ్చిమబంగా. నేను పుట్టక ముందే అమ్మానాన్నలు ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. కామర్స్‌లో డిగ్రీ అయ్యాక చాలా ప్రాంతాలకు వెళ్లా. ఈ క్రమంలో సింగపూర్‌లో నాకు లగడపాటి ప్రణయ్ పరిచయమయ్యాడు. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. నేను కొంతకాలం రామోజీ ఫిల్మ్ సిటీలో మార్కెటింగ్ విభాగంలో సేవలదించా. ఆ తరువాత ఐ మ్యాక్స్ ప్రయివేట్ థియేటర్‌లో పనిచేశా. కొంత అనుభవం వచ్చాక ఇప్పుడు సొంతంగా వ్యాపారం మొదలుపెట్టా.

– పద్మ వడ్డె

వైద్యుల వరల్డ్ రికార్డు

నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత, శానిటరీ న్యాప్‌కిన్ల వాడకం పట్ల ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించాలనుకున్నారు కొందరు మహిళా గైనకాలజిస్టులు. అందుకే



శానిటరీ న్యాప్‌కిన్‌లతో ఓ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇది గిన్నిస్ రికార్డులోనూ నమోదైంది. బెంగళూరు, గాయత్రీ విహార్, ప్యాలెస్ గ్రౌండ్స్‌లో 62వ ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ (ఏఐసీఓజీ) అయిదురోజుల సదస్సులో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఇందుకోసం 10,105 న్యాప్‌కిన్లు వినియోగించగా, 1,078 మీటర్ల దూరం అమర్చారు. దీన్ని చేయడానికి ఏడున్నర గంటల సమయం పట్టింది. వీటిని కేవలం అమర్చడమే కాదు, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ఎలా అవగాహన పెంచుకోవాలో కూడా వివరించారు వైద్యులు.

ముగ్గుకీ కిటుకులున్నాయి!

ఈ సమయంలో ఇంటిముందు రంగురంగుల ముగ్గులు వేయడం మనలో చాలామందికి అలవాటే. మరి మన పని సులువు కావాలంటే ముగ్గు వేసేటప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకుని చూడండి.

▼ ముగ్గువేసి రంగు నింపి మళ్లీ ముగ్గుతో అవుట్‌లైన్ గీయడం అంటే ప్రహసనమే. నట్టింట్లో లేదా ఇంటిముంగిట కూడా నేల మీదే ముగ్గు వేయాలనుకుంటే గనుక ముందు చాక్‌పీస్‌తో అనుకున్న డిజైను వేసేయండి. అంతా పూర్తయ్యాక చివరగా ముగ్గుతో అవుట్‌లైన్ వేస్తే చాలు.

▼ రంగులు నింపడానికి టీ వడపోసేది వాడితే చక్కగా పరచుకుంటుంది. లేదంటే జల్లెడ కూడా ఎంచుకోవచ్చు. ఇప్పుడు ప్రత్యేకంగా కోన్‌లు కూడా దొరుకుతున్నాయి కాబట్టి వాటినీ ప్రయత్నించొచ్చు.

▼ అన్ని ముగ్గులు రంగులతోనే వేయాలని లేదు. అచ్చంగా పూలు లేదా పూల రేకలు ఎంచుకోవచ్చు. లేదా బియ్యం, నవధాన్యాలకు ముందే రంగులు కలిపి ఆరబెట్టుకోవాలి. నట్టింట్లో చిన్నచిన్న ముగ్గులు వేసుకున్నప్పుడు ఈ అలంకరణ బాగుంటుంది. ఆసక్తి ఉంటే గనుక కుందన్లు కూడా అలంకరణకు ఉపయోగించొచ్చు.

▼ దోమల్ని నివారించే మస్కిటో కాయిల్స్ ఉంటాయి కదా... వాటిని ఐదారు తీసుకుని గది మధ్యలో పెట్టి.. అంచులద్వారా రంగులు వేయొచ్చు. అది డిజైను రూపంలో వస్తుంది. కావాలనుకుంటే దీనికి అదనపు హంగులు అద్దుకోవచ్చు. గుండ్రంగా తిప్పడం సాధ్యం కానప్పుడు ఇది చక్కని ప్రత్యామ్నాయం. లేదా గాజుతోనూ వేసుకోవచ్చు.



చదువు

లైఫ్ స్కిల్స్ ఒలింపియాడ్

3 నుంచి 12 తరగతుల విద్యార్థులకు అవకాశం



అంతర్జాతీయ ఒలింపియాడ్‌లో పాల్గొనాలనుకునే విద్యార్థులకు సదవకాశం. సింగపూర్‌కు చెందిన స్కిలిజెన్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఈ అవకాశాన్ని అందిస్తోంది. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నేషనల్ లైఫ్ స్కిల్స్ ఒలింపియాడ్ (ఐఎల్ఎస్ఓ)ను నిర్వహిస్తోంది. మూడు నుంచి పన్నెండు తరగతుల విద్యార్థులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. నమోదు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది.

విద్యార్థులు భావి పౌరులుగా ఎదగడానికి ఎంతవరకూ సంసిద్ధంగా ఉన్నారో తెలుసుకోవడానికి స్కిలిజెన్ ఐఎల్ఎస్ఓను నిర్వహిస్తోంది. వివిధ రకాల జీవన నైపుణ్యాలను విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ పరీక్ష ఉద్దేశం కూడా.

దీనిలో మూడు నుంచి పన్నెండు తరగతుల వరకు ఎవరైనా పాల్గొనవచ్చు. పరీక్ష ఆన్‌లైన్‌లో ఉంటుంది. ఆయా తరగతుల విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి, పరీక్ష నిర్వహిస్తారు. గ్రూప్-1లో మూడు, నాలుగు, ఐదు తరగతులవారూ, గ్రూప్-2లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులవారూ, గ్రూప్-3లో తొమ్మిది, పది తరగతులవారూ, గ్రూప్-4లో 11, 12 తరగతుల వారూ ఉంటారు. 100కు పైగా దేశాల విద్యార్థులు దీనిలో పాల్గొంటున్నారు.

నమోదు ఎలా?

ఆన్‌లైన్‌లో (www.lifeskillsolympiad.org) నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో ఈమెయిల్ (info@lifeskillsolympiad.org) అయినా పంపొచ్చు. స్కూలు ద్వారానే నమోదు చేసుకోవాలన్న నిబంధనేమీ లేదు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా అయినా చేసుకోవచ్చు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను నమోదు చేయించవచ్చు. ఇంటి దగ్గర ఉండి చదువుకునే పిల్లలకూ అవకాశం కల్పించారు. పరీక్ష ఫీజు 7.99 డాలర్లు (రూ. 490).

దరఖాస్తు చివరితేదీ: జనవరి 15, 2019

పరీక్ష తేదీ: జనవరి 27, 2019

★ ఫలితాలను వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు, ఈమెయిల్ ద్వారా కూడా తెలియజేస్తారు.

★ ఇతర వివరాలకు సంస్థ వెబ్‌సైట్ www.lifeskillsolympiad.org ను సందర్శించవచ్చు.

పరీక్ష విధానం

పరీక్ష ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటుంది. భాషా నైపుణ్యాలను పరీక్షించే పరీక్ష కాదు కాబట్టి, ప్రాథమిక ఆంగ్ల పరిజ్ఞానం ఉన్నవారెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. సిలిజెన్ కరిక్యులమ్ ఆధారంగా పరీక్ష ఉంటుంది. పరీక్షలో అడిగే ప్రశ్నలు ఎనిమిదేళ్ల పిల్లలు కూడా తేలిగ్గా చేసేవిగా ఉంటాయని సంస్థ చెబుతోంది. పరీక్షలో భాగంగా విద్యార్థుల నాయకత్వం, నిర్ణయం తీసుకునే లక్షణాలు, నైతిక విలువలు, బృందంతో పనిచేయడం, కమ్యూనికేషన్, లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, సమయ పాలన మొదలైన 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలన్నింటినీ పరీక్షిస్తారు.

సన్నద్ధత: వెబ్‌సైట్‌లో సిలబస్, లైఫ్ స్కిల్స్ గైడ్, మాదిరి ప్రశ్నలుంటాయి. నమోదు ప్రక్రియ పూర్తి చేసుకున్నవారికే ఇవి అందుబాటులో ఉంటాయి. అలాగే గ్రూపులవారీగా మాదిరి పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయి. వాటిని సాధన చేసుకోవచ్చు.

రివార్డులివీ: ప్రపంచవ్యాప్తంగా నాలుగు గ్రూపుల నుంచీ గెలుపొందిన వారికి యూఎస్ఏలోని హార్వర్డ్ యూనివర్సిటీని సందర్శించే అవకాశంతోపాటు మరెన్నో బహుమతులు అందజేస్తారు. పాల్గొన్నవారికీ డిజిటల్ సర్టిఫికెట్లతోపాటు పది డాలర్ల విలువైన బహుమతులనూ అందజేస్తారు.

గ్రూప్స్, సివిల్స్, ఇతర పోటీ పరీక్షల్లో వర్తమాన అంశాలకు ప్రాముఖ్యం ఏటా పెరుగుతోంది. ఇటీవల వీటి సరళి మారింది. సంపూర్ణమైన అవగాహన ఉంటేనే జవాబు గుర్తించగలిగేలా ప్రశ్నలను లోతుగా అడుగుతున్నారు. 'కరెంట్ అఫైర్సే కదా, పరీక్షలకు కొద్దిరోజుల ముందు చూసుకుంటే చాలు' అని తక్కువ అంచనా వేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుంది. ఉద్యోగార్థులు ఈ విషయం గుర్తుంచుకుని, చదివే పద్ధతిలో మార్పు చేసుకోవాలి. అప్పుడే పోటీలో ముందు నిలిచి, విజయానికి పునాది వేసుకోగలుగుతారు!

విజయానికి వర్తమానం

కరెంట్ అఫైర్స్ మెలకువలు



పోటీ పరీక్షల్లో దేనికి హాజరవుతున్నా తప్పనిసరిగా కనిపించే అంశం- వర్తమాన వ్యవహారాలు. సబ్జెక్టు విస్తృతమైనప్పటికీ జనరల్ స్టడీస్‌లోని ఇతర సబ్జెక్టులతో కూడా ముడిపడి ఉన్న నేపథ్యంలో ఉత్సాహంతో అనుసంధాన పద్ధతిలో సన్నద్ధత కొనసాగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

దాదాపు అన్ని పరీక్షల సిలబస్‌లోనూ మొదట పేర్కొనే అంశం కరెంట్ అఫైర్సే. 'జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న సంఘటనలు; వర్తమాన అంశాలు- జాతీయం, అంతర్జాతీయం, ప్రాంతీయం' అంటూ సిలబస్‌లో కరెంట్ అఫైర్స్‌ని పేర్కొన్నారు. దీన్ని రెండు భాగాలుగా పేర్కొనడం ద్వారా ఎక్కువ ప్రాధాన్యం ఉన్నట్లు చెప్పకనే చెప్పారు.

మనకు తెలిసి, మన కళ్ల ముందు జరుగుతున్న పరిణామాల కలయికే వర్తమాన వ్యవహారాలు. కాకపోతే జాతీయ, అంతర్జాతీయ, ప్రాధాన్యం ఉన్న సంఘటనలు కొంచెం లోతుగా ఉంటాయి. ఈ విభాగంపై అవగాహన పెంచుకోవాలంటే గతంలో జరిగిన పరిణామాలపై కూడా పట్టు అవసరం. సాధన చేస్తే ఈ స్థాయికి తేలిగ్గానే చేరుకోవచ్చు. ఈ విభాగంలో ఇటీవల జరిగిన ప్రముఖ సదస్సులు - సమావేశాలు, ప్రముఖుల విదేశీ పర్యటనలు, దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలు - సహాయ సహకారాలు, అంతర్జాతీయ సంస్థలు, శాస్త్ర సాంకేతికరంగ విజయాలను భారత కేంద్రంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.



సీహెచ్. కృష్ణప్రసాద్

ఇక వర్తమాన అంశాలు- జాతీయం, అంతర్జాతీయం, ప్రాంతీయం అనే విభాగం.. దీని గురించి అభ్యర్థులు పెద్దగా భయపడాల్సిందేమీ లేదు. సాధారణంగా ప్రతిరోజూ వార్తలను అనుసరించేవారికి ఈ విభాగంలో పట్టు ఉంటుందనే చెప్పాలి. వార్తల్లో వ్యక్తులు, ప్రదేశాలు, దేశ విదేశాల్లో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రముఖ సంఘటనలు, క్రీడలు, అవార్డులు, ఇటీవల జరిగిన ఎన్నికలు, ఆర్థికంగా, రాజకీయంగా చోటు చేసుకున్న పరిణామాలు, తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులు, పథకాలు, మంత్రివర్గాలు ఇలా అన్నింటిపై అవగాహన పెంచుకుంటే ఈ విభాగంలో మార్కుల సాధన నల్లేరుపై బండి నడకే.

సొంత నోట్సు ఉత్తమం

కరెంట్ అఫైర్స్ ప్రిపరేషన్‌లో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సొంతంగా నోట్స్ తయారుచేసుకోవడం ఉత్తమ ఫలితాలనిస్తుంది. సమయం ఎక్కడ ఉంటుందనుకుంటున్నారా? అది మన చేతుల్లో పనే. రోజూ గంట సమయాన్ని దినపత్రికలు చదువుతూ ముఖ్యమైన విషయాలను నోట్స్ రూపంలో రాసుకోవడం అత్యుత్తమ ఫలితాలనిస్తుంది. దీనివల్ల గణాంకాలు, సమాచారాన్ని తప్పుగా రాసుకోవడం, అనవసరపు విషయాలను చదవడం లాంటి సమస్యల నుంచి బయటపడవచ్చు. సబ్జెక్ట్‌పై ఆసక్తి పెరుగుతుంది. పునశ్చరణ త్వరగా పూర్తవుతుంది. దీంతోపాటు ప్రశ్నల సరళిపై కూడా అవగాహన రావచ్చు. గ్రూప్ 1 మెయిన్స్ పేపర్ 1 జనరల్ ఎస్సే విభాగానికి కూడా ఈ ప్రాక్టీస్ ఉపయుక్తంగా ఉంటుంది. సొంత నోట్సుతో పాటు యోజన, ఆంధ్రప్రదేశ్ లాంటి ప్రభుత్వ మ్యాగజీన్లను చదవాల్సి ఉంటుంది.

సిలబస్‌లోని కొన్ని విభాగాలతో కరెంట్ అఫైర్స్ ముడిపడి ఉండటం కూడా అభ్యర్థులకు అనుకూలిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆర్థిక రంగం, భారత రాజకీయ వ్యవస్థ, విపత్తు నిర్వహణ, పర్యావరణ అంశాలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనే విభాగాలు వర్తమాన వ్యవహారాలతో సంబంధం కలిగి ఉంటాయి. కాబట్టి ఒక్క కరెంట్ అఫైర్స్ ప్రిపరేషన్‌తో జనరల్ స్టడీస్‌లోని కీలక విభాగాలపై కూడా కొంత పట్టు సాధించవచ్చు. కరెంట్ అఫైర్స్‌ను ఇది మన సబ్జెక్ట్ అని సొంతం చేసుకుని తయారైతే అన్ని విభాగాల్లో ప్లస్ అవుతుంది. స్థూలంగా అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయం అంటూ చెప్పుకొనే కరెంట్ అఫైర్స్‌ను సూక్ష్మంగా చూస్తే రాష్ట్రీయం, ఆర్థిక రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, అవార్డులు, క్రీడలు, వార్తల్లో వ్యక్తులు, మరణాలు, నియామకాలు, కమిటీలు - కమిషన్లు, గ్రంథాలు - రచయితలు, సదస్సులు - సమావేశాలు, పర్యటనలు, నివేదికలు - సర్వేలు, దినోత్సవాలు, వార్తల్లో ప్రదేశాలు అనే ఉపవిభాగాలుగా అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయం అనే అంశాలకు అన్వయించుకోవచ్చు.

పరీక్షకు వెళ్ళేవరకూ...

ప్రశ్నల కాలావధిపై కూడా అభ్యర్థులు ఓ కన్నేయాలి. గతంలో పరీక్షకు ముందు ఒక నెల వదిలిపెట్టి ప్రశ్నలు అడిగేవారు. పోటీ పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షకు ఒక వారం, పదిరోజుల ముందు జరిగిన సంఘటనలపై కూడా ప్రశ్నలు అడుగుతున్నారు. అంటే కరెంట్ అఫైర్స్ సన్నద్ధత అనేది పరీక్షకు వెళ్లేవరకూ కొనసాగాలి. పరీక్షకు ముందు 6 నెలల నుంచి 8 నెలల కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు ప్రశ్నల రూపంలో ఎదుర్కోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే ఒక నాలుగైదు ప్రశ్నలు కాలావధితో సంబంధం లేకుండా వచ్చే అవకాశం ఉంటుంది. ఆ సంఘటనల ప్రభావం ఇప్పటికీ కొనసాగుతున్నప్పుడు ఇలాంటి ప్రశ్నలు చోటు చేసుకుంటాయి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ముఖ్యమైన చట్టాలు, దేశవిదేశాల్లో సంచలనం సృష్టించిన ఘటనలు, ఉగ్రవాద దాడులు, ముఖ్యమైన క్రీడా విశేషాలు, శాస్త్ర సాంకేతిక విజయాలు ఈ కోవకు చెందినవే. ఇలాంటివి అభ్యర్థి ఉద్యోగిగా మారే వరకూ గుర్తు పెట్టుకోవాల్సి ఉంటుంది.

ప్రశ్నల తీరు మారింది

ఇటీవల జరిగిన పరీక్షలను గమనిస్తే కరెంట్ అఫైర్స్ ప్రశ్నల సరళిలోనూ మార్పు వచ్చినట్లు స్పష్టమవుతోంది. గతంలో ప్రశ్నలను ఒక అంశానికి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం లేదా ఏదో ఒక ముఖ్యమైన విషయాన్ని కేంద్రంగా చేసుకుని అడిగేవారు. కానీ ఇటీవలి కాలంలో ఆ అంశానికి సంబంధించిన పూర్తి పరిజ్ఞానం అభ్యర్థికి తెలిసి ఉంటేనే జవాబు గుర్తించగలిగేలా ప్రశ్నలను లోతుగా అడుగుతున్నారు. కాబట్టి అభ్యర్థులు ఒక అంశానికి సంబంధించి చదివేటప్పుడు ఆసాంతం దానిపై అవగాహన ఏర్పరచుకోవడం ఉత్తమం. ఒక అంశం వార్తల్లో వచ్చినప్పుడు అది పరీక్షలో ప్రశ్నగా మారే అవకాశం ఎంతవరకుందనేది గుర్తించగలగాలి. ఆ స్థాయికి చేరుకుంటే సమయం ఆదా అవుతుంది. దీనికి పెద్దగా కష్టపడాల్సింది కూడా ఏమీ లేదు. ఒక అంశాన్ని చదివేటప్పుడు ఆ అంశం ప్రభావం, దాని పరిధి, కాలమాన పరిస్థితుల్లో దాని నేపథ్యం లాంటివి ఒక్కసారి కూలంకషంగా పరిశీలిస్తే సరిపోతుంది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మెడికల్ ఆఫీసర్లు

దేశ వ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కింది పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది.

పోస్టు-ఖాళీలు: అసిస్టెంట్ ప్రొఫెసర్- 16, ఇంజినీర్ అండ్ షిప్ సర్వేయర్-కమ్-డిప్యూటీ జనరల్- 01, సైంటిస్ట్-బి (జూనియర్ జియోఫిజిసిస్ట్)- 03, మెడికల్ ఆఫీసర్(జీడీఎంవో)- 327, సీనియర్ లెక్చరర్- 11. మొత్తం ఖాళీలు- 358.

విభాగాలు: అనస్థీషియా, కార్డియాలజీ, గ్యాస్ట్రో మెడిసిన్, గ్యాస్ట్రో సర్జరీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ తదితరాలు. **అర్హత:** పోస్టును బట్టి ఎంబీబీఎస్, సంబంధిత విభాగాల్లో ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్, పీహెచ్‌డీ/ డీఎస్సీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 31.01.2019.

www.upsc.gov.in

ప్రవేశాలు

ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్-2019

దేశంలోని వివిధ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(ఐసర్) ప్రాంగణాల్లో బీఎస్, బీఎస్-ఎంఎస్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్-2019 ప్రకటన విడుదలైంది. **ఐసర్ ప్రాంగణాలు:** బరంపురం, భోపాల్, కోల్‌కతా, మొహాలి, పుణె, తిరువనంతపురం, తిరుపతి. **ప్రవేశ విధానం:** కింది మూడింటిలో ఏదైనా ఒక మార్గం ద్వారా ప్రవేశాలు పొందవచ్చు. ➤ కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఛానల్: 2019-20 అకడమిక్ సెషన్ల నుంచి కేవీపీవై ఫెలోషిప్ అర్హత ఉన్న అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులు. ➤ ఐఐటీల జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ-అడ్వాన్స్‌డ్) ఛానల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2019లో పదివేలలోపు ర్యాంకు సాధించిన జనరల్ కేటగిరీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ➤ స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డు (ఎస్‌సీబీ) ఛానల్: సైన్స్ స్ట్రీములో 2018 లేదా 2019లో 10+2 ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాసేందుకు అర్హులు.

ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ తేది(కంప్యూటర్ ఆధారిత): జూన్‌లో. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** ఏప్రిల్‌లో ఉంటుంది.

వెబ్‌సైట్: www.iiseradmission.in

ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

దేహ్రాదూన్(ఉత్తరాఖండ్)లోని ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 2019 సంవత్సరానికి ఎంఎస్సీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

ఎంఎస్సీ విభాగాలు-సీట్లు: ఫారెస్ట్రీ- 38, ఉడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ- 38, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్- 38, సెల్యులోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ- 20.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా. **ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 08.04.2019. **ప్రవేశ పరీక్ష తేది:** 19.05.2019. http://fridu.edu.in/

యువర్ ఆనర్!

'లా' కోర్సుల్లో ప్రవేశాలకు క్లాట్

కామన్ లా అడ్మిషన్ టెస్టు (క్లాట్) స్కోరుతో దేశవ్యాప్తంగా 21 జాతీయస్థాయి సంస్థలు అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఏడాది వ్యవధి ఉండే ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఎన్నో ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు సైతం ప్రవేశానికి అవకాశం ఇస్తున్నాయి. ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్షలో సాధించిన స్కోర్‌తో కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.



దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో పెండింగులో ఉన్న కేసులు 3.3 కోట్లు. అయిదు వేలకు పైగా జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ న్యాయశాస్త్ర పట్టభద్రులకు ఉపాధి అవకాశాలను తెలుపుతున్నాయి. మరోవైపు సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, కాపీ రైట్ కేసులు పెరుగుతున్నాయి. పెరుగుతోన్న సాంకేతికత... లీగల్ పట్టభద్రులకు అవకాశాలు కల్పిస్తోంది. ప్రసిద్ధ సంస్థల్లో లా కోర్సులు చేసినవారు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా కార్పొరేట్ కంపెనీల్లో అవకాశాలు పొందుతున్నారు. లా గ్రాడ్యుయేట్లను జ్యుడీషియల్ క్లర్కులుగా తీసుకుంటున్నారు. లీగల్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్ విస్తరిస్తోంది. బోధనలోనూ అవకాశాలుంటాయి. అయితే పీజీతోపాటు నెట్ అర్హత ఉంటే ప్రాధాన్యం లభిస్తుంది.

గేట్ స్కోర్‌తో పబ్లిక్ సెక్టార్ కంపెనీలు ఉద్యోగాలిస్తున్నట్లుగానే క్లాట్ ఎల్ఎల్ఎం పరీక్ష స్కోర్, ఇంటర్వ్యూతో కొలువులు లభిస్తున్నాయి. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, ఓఎన్‌జీసీ లిమిటెడ్, నేషనల్ థర్మల్ పవర్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్... లీగల్ విభాగాల్లో ఉద్యోగులుగా తీసుకుంటున్నాయి. ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్ష స్కోర్‌కు పీఎస్‌యూలు 75 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి. మిగిలిన 25 శాతం ఇంటర్వ్యూకు కేటాయిస్తున్నాయి.

తెలంగాణలో నల్సార్ (హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (విశాఖపట్నం)లో క్లాట్ స్కోరుతో ప్రవేశాలు పొందవచ్చు. జాతీయస్థాయిలో 21 సంస్థల్లోనూ కలుపుకుని దాదాపు 2500 ఎల్ఎల్‌బీ సీట్లున్నాయి. కొన్ని సంస్థలు సగం లేదా కొంత శాతం సీట్లను ఆయా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో నింపుతున్నాయి. ఉదాహరణకు నల్సార్, హైదరాబాద్‌లో అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సులో 105 సీట్లకు గాను 21 సీట్లు, ఎల్ఎల్ఎంలోనూ 40లో 10 సీట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు కేటాయించారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ, విశాఖపట్నంలో ఎల్ఎల్‌బీ కోర్సులో 60, ఎల్ఎల్ఎంలో 12 సీట్లు ఆంధ్ర విద్యార్థులకు కేటాయించారు.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో...

ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ ఖరగ్‌పూర్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన విడుదల చేసింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో చూపిన ప్రతిభ ద్వారా కోర్సులో ఎంపిక చేస్తారు.

కోర్సు: ఎల్ఎల్‌బీ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ మూడేళ్ల లా కోర్సు. రెసిడెన్షియల్ విధానంలో అందిస్తున్నారు.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఇంజినీరింగ్ /మెడిసిన్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీలో ప్రథమ శ్రేణి మార్కులతో సైన్స్ / ఫార్మసీ డిగ్రీ లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీఏతోపాటు.. ఇంజినీరింగ్/మెడిసిన్‌లో యూజీ లేదా సైన్స్/ఫార్మసీలో పీజీ.

పరీక్ష ఇలా: ప్రశ్నపత్రం 200 మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ 60, లాజికల్ రీజనింగ్ 20, మ్యాథమెటికల్ ఎబిలిటీ 15, బేసిక్ సైన్స్ (కెమిస్ట్రీ, ఫిజిక్స్, లైఫ్ సైన్సెస్) 35, లీగల్ ఆప్టిట్యూడ్ 70 మార్కులకు ప్రశ్నలుంటాయి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలుంటాయి.

ఎల్ఎల్ఎం...

అర్హత: మూడేళ్ల లేదా అయిదేళ్ల ఎల్ఎల్‌బీ లేదా బీఎల్‌లో ప్రథమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత. **రాత పరీక్షలో:** లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి 120 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 15 **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 20 http://www.iitkgp.ac.in/ law, http://www.iitkgp.ac.in/ llm

గడువు తేదీ, అర్హతలు

ఎల్ ఎల్ బీ 5 సంవత్సరాల కోర్సులో చేరే విద్యార్థులు ఇంటర్ 45% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్‌సీ/ ఎస్‌టీ విద్యార్థులు 40% మార్కులు సరిపోతాయి. చివరి సంవత్సరం పరీక్షకు హాజరవుతున్న వాళ్లూ అర్హులే.

ఎల్ఎల్ఎం కోర్సు చేయదల్చినవారు ఎల్ఎల్‌బీ పరీక్షను 55% మార్కులతో; ఎస్‌సీ, ఎస్‌టీ వారు 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. చివరి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు కూడా రాయవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 31, 2019 **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 4000; ఎస్సీ, ఎస్టీలకు రూ. 3500. **పరీక్ష తేదీ:** 12.05.2019 (ఆదివారం) సాయంత్రం 3 నుంచి 5 వరకు ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. https://clatconsortiumofnlu.ac.in

సమగ్ర కథనం www.eenadupratibha.net లో.